


www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

# నవభూమి

ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక

Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్

హైదరాబాద్ | 17 సోమవారం | మార్చి 2025 | పేజీలు 12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 181

Navabhoomi daily fallows..

Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar,Warangal,Khammam, Nalgonda, Mahabubnagar,Medak, Nizamabad, Krishna,Guntur,Easrt Godavari, West Godavari,Prakasam, Nellore,Srikakulam,Vizianagaram,Visakhapatanam,Kurnool,Chittoor,Kadapa,and Anantapur




## కేసీఆర్ జాతిపిత ఎలా అవుతారు?

- రూ.8.29లక్షల కోట్ల అప్పు మా నెత్తిన పెట్టిన కేసీఆర్
- కేసీఆర్ అప్పులకు ఒక్కఏడాదిలో 84వేల కోట్ల వడ్డీ రూ.6వేల కోట్లు అసలు చెల్లించాం
- ఎమ్మెల్యేగా జీతభత్యాలు తీసుకున్న కేసీఆర్,
- తన బాధ్యతలను నిర్వర్తించడం లేదు
- తెలంగాణ పోరాటంలో కాకతీయవర్శిటీ విద్యార్థులు కీలకపాత్ర
- వరంగల్ అభివృద్ధికి రూ. 6500 కోట్ల నిధులిచ్చాం

2



స్టేషన్‌ఘన్‌పూర్-నవభూమిప్రతినిధి

గత బీఆర్ఎస్ పాలనపై తెలంగాణ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన అనంతరం స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగించారు. తెలంగాణ ఉద్యమంలో వరంగల్ ఉమ్మడి జిల్లా వాసులు, కాకతీయ వర్సిటీ విద్యార్థులు కీలక పాత్ర పోషించారన్నా రు. వరంగల్ గడ్డపైనుంచి ఎన్నో పోరాటాలు జరిగాయన్నారు. వరంగల్ అభివృద్ధికి రూ. 6500 కోట్ల నిధులను కేటాయించినట్లు సీఎం రేవంత్ ప్రకటించారు. రైల్వే కోచ్, ఔటర్ రిం రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, విమానాశ్రయం వంటి మెగా ప్రాజెక్టుల ద్వారా హైదరాబాద్ తో సమానంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. కేసీఆర్ రూ. 8.29 లక్షల కోట్లు అప్పును మా నెత్తిన పెట్టిపోయా రన్నారు సీఎం రేవంత్ రెడ్డి. కేసీఆర్ చేసిన అప్పులకు ఒక్క ఏడాదిలోనే ఈ ప్రభుత్వం 84 వేల కోట్లు వడ్డీ, రూ. 6 వేల కోట్లు అసలు చెల్లించిందని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గురించి ప్రజలకు కూడా తెలియాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నిఆర్థిక సమస్యలు ఉన్నప్పటికీ ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నామని సీఎం చెప్పారు. అధికారంలోకి వచ్చిన రెండు రోజుల్లోనే మహి ళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించామని, ఇందుకోసం రూ.

## అమరావతి నిర్మాణానికి హడ్కో రుణం



- 11 వేల కోట్లిచ్చేందుకు హడ్కో ఒప్పందం..!
- సీఆర్డీఏ హడ్కోతో సీఎం సమక్షంలో కీలక ఒప్పందం
- రాజధాని ప్రాజెక్టులకు తీరబోతోన్న నిధుల కొరత
- హడ్కో రుణాన్ని భవిష్యత్తులో వాయిదాల రూపంలో తీర్చాలి

2

అమరావతి-నవభూమిప్రతినిధి

ఏపీ రాజధాని అమరావతికి ఇవాళ గుడ్ న్యూస్ అందింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అమరావతి పనుల ప్రారంభానికి చేస్తున్న ప్రయత్నాలకు ఊతమిచ్చేలా ఇవాళ ఓ కీలక ఒప్పందం కుదిరింది. ఇందులో భాగంగా హడ్కో నుంచి 11 వేల కోట్ల రుణం అమరావతి రాజధానికి లభించబోతోంది. ఈ మేరకు ఏపీ రాజధాని ప్రాంత ప్రాధికార సంస్థ సీఆర్డీఏ హడ్కోతో ఇవాళ కీలక ఒప్పందం చేసుకుంది. దీంతో త్వరలో ఈ నిధులు విడుదల కానున్నా యి. అమరావతి రాజధాని నిర్మాణం కోసం నిధులు సేకరిస్తున్న ఏపీ ప్రభుత్వం..హౌసింగ్ అండ్ అర్బన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ (హడ్కో)కు పంపిన ప్రతిపాదనల్ని తాజాగా జనవరిలో ఆమోదించారు. ఈ మేరకు జనవరి 22న ముంబైలో జరిగిన హడ్కో బోర్డు సమావేశంలో నిధులు మంజూరుకు అంగీ కారం తెలిపారు. ఈ మేరకు ఇవాళ హడ్కో, సీఆర్డీయే ప్రతినిధులు ఒప్పందం చేసుకున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో హడ్కో -సీఆర్డీయే మధ్య ఒప్పందం కుదిరింది. ఉండవల్లి నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి నారాయణ, హడ్కో సిఎండీ సంజయ్ కుల్ శ్రేష్ఠ, మునిసిపల్ శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ ఒప్పందం మేరకు రాజధాని నిర్మాణాలకు హడ్కో రూ.11 వేల కోట్లు రుణంగా అందించనుంది. దీంతో రాజ ధాని ప్రాజెక్టులకు నిధుల కొరత తీరబోతోంది. హడ్కో రుణాన్ని ప్రభుత్వం భవిష్యత్తులో వాయిదాల రూపంలో తీర్చాల్సి ఉంటుంది. ఇప్పటికే ఆసియా అభివృద్ధి బ్యాంకు, ప్రపంచ బ్యాంక్ కలిపి రూ.15 వేల కోట్ల మేర రుణాలిచ్చేందుకు సిద్ధమవుతున్నాయి. ఇప్పుడు హడ్కో నిధుల రాకతో అమరావతి పనులు

## డీకే అరుణ ఇంట్లోకి ఆగంతకుడి చొరబాటు

- హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని రోడ్ నెంబర్ 56లో డీకే అరుణ నివాసం
- ఆదివారం తెల్లవారుజామున 3 గం, సమయంలో చొరబడిన దుండగుడు
- గంటన్నర పాటు ఇంట్లో తిరిగినట్లు సీసీ కెమెరాల్లో రికార్డ్
- మహబూబ్‌నగర్ పర్యటనలో ఉన్న ఎంపీ డీకే అరుణ..
- తమ ఇంటికి భద్రత కల్పించాలని సీఎంను కోరిన ఎంపీ

2



హైదరాబాద్-నవభూమిబ్యూరో

తమ కుటుంబానికి భద్రత పెంచాలంటూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు భారతీయ జనతా పార్టీ ఎంపీ డీకే అరుణ. శనివారం అర్ధరాత్రి తర్వాత ఆమె నివాసంలోకి ఓ ఆగంతకుడు ప్రవేశించడమే ఇందుకు కారణం. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని రోడ్ నెంబర్ 56లో డీకే అరుణ నివాసం ఉంటున్నారు. ఆదివారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో దుండగుడు చేతులకు గ్లౌజ్‌లు ధరించి డీకే అరుణ ఇంట్లోకి చొరబడ్డాడు. దాదాపు గంటన్నరపాటు ఆమె ఇంట్లో తిరిగినట్లు సీసీ కెమెరాల్లో రికార్డయింది. ఈ క్రమంలో జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను డీకే అరుణ కారు డ్రైవర్ లక్ష్మణ్ వెల్లడించారు. శనివారం తెల్లవారుజామున 3 గంటలకు ఇంట్లో శబ్దం వచ్చిందని.. కానీ, ఎవరు కనిపించలేదని తెలిపారు. కిచెన్‌లో పాదముద్రలు ఉన్నాయన్నారు. సీసీటీవీ ఫుటేజీ చూడగా.. ఓ వ్యక్తి కిటికీలోంచి వచ్చినట్లు కనిపించింది. మాస్క్, గ్లౌజ్‌లు వేసుకుని ఉన్నాడు. ఆ సమయంలో డీకే అరుణ ఇంట్లో లేరు. మీటింగ్ కోసం శనివారం మహబూబ్‌నగర్ వెళ్లారని డ్రైవర్

## ప్రకృతి ప్రకోపానికి అమెరికా విలవిల

- మొన్న కార్చిచ్చు, నేడు తుఫాను..
- అమెరికాలో భీభత్సం సృష్టించిన తుఫాను
- దేశవ్యాప్తంగా 16 కౌంటీల్లో అనేక ఇళ్లు నేలమట్టం
- తుఫాను ధాటికి 34 మంది మృతి
- 29 మందికి పైగా గాయపడ్డారన్న అధికారులు

2



**మిస్సోరీ-నవభూమిబ్యూరో:** ప్రకృతి ప్రకోపానికి అగ్రరాజ్యం విలవిల్లాడుతోంది. మొన్న ఆ మధ్య కార్చిచ్చు కారణంగా తీరని నష్టం చూసిన అమెరికాను.. ఈసారి తుఫాను విషాదంలో మునిగిపోయేలా చేస్తోంది. అమెరికాలో తుఫాను భీభత్సం సృష్టించింది. దేశవ్యాప్తంగా 16 కౌంటీల్లో అనేక ఇళ్లు నేలమట్టం అయ్యాయి. వ్యాపార సంస్థలు సైతం నష్టపోగా.. విద్యుత్ లైన్లు దెబ్బతిన్నాయని, చెట్లు కూలిపోయా యని అర్కాన్సాస్ డిపార్ట్మెంట్ ఆఫ్ పబ్లిక్ సేఫ్టీ ఒక ప్రకటనలో వెల్లడించింది. తుఫాను ధాటికి 34 మంది మరణించినట్లుగా సమాచారం. ఈ విషాద ఘటన సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఇక రాష్ట్రాల వారీగా చూస్తే మిస్సోరీలో సుడిగాలి కారణంగా 11 మంది మరణించారని, 29 మందికి పైగా

## నేటి నుంచి టెన్త్ పరీక్షలు

- ఆర్టీసీ బస్సుల్లో హాల్ టికెట్ చూపిస్తే
- పరీక్షా కేంద్రాలకు ఉచిత ప్రయాణం
- అన్ని ఏర్పాట్లు చేసిన విద్యాశాఖ
- ఒత్తిడికి గురికాకుండా రాయండి
- సీఎంచంద్రబాబు ,మంత్రి లోకేశ్ ఆల్ ది బెస్ట్



2

**అమరావతి-నవభూమిబ్యూరో:** పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా పాఠశాల విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. పబ్లిక్ పరీక్షల ఒత్తిడిని అధిగమించేలా గత వంద రోజుల నుంచి పాఠశాల విద్యాశాఖ విద్యార్థులను సన్నద్ధం చేసింది. వంద రోజుల కార్యాచరణ ప్రణాళికను అమలు చేసింది. మెరుగ్గా ఉన్న విద్యార్థులు మెరుగైన ర్యాంకులు సాధించేలా, అంతంతమాత్రంగా ఉన్నవారు సులభంగా ఉత్తీర్ణులయ్యేలా సమాయత్తం చేసింది. నేటి నుంచి ఈనెలాఖరు వరకు పరీక్షలు జరగనున్నాయి. ప్రతిరోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు పరీక్షలు నిర్వహిస్తారు. ఉదయం 8.45 గంటల నుంచే విద్యార్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారు. అని పరీక్షా కేంద్రాలను మొబైల్ రహితంగా ప్రకటించారు. చీఫ్ సూపరింటెండెంట్‌కు మాత్రమే పరీక్ష కేంద్రంలోకి మొబైల్ తీసుకెళ్లే అవకాశం ఉంటుంది. ఇతర ఎలక్ట్రానిక్ ఉపకరణాలైన ల్యాప్‌ట్యాపలు, కెమేరాలు, ట్యాబ్‌లు, ఇయర్‌ఫోన్లు, స్పీకర్లు, స్మార్ట్ వాచ్‌లు, బ్లూటూత్ వంటివాటిని పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించరు. పరీక్షా కేంద్రాల వద్ద తాగునీటి సౌకర్యం, ఏఎన్ఎంలను అందుబాటులో ఉంచారు. ఈ ఏడాది టెన్త్ విద్యార్థులకు ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్ అమలు చేశారు. మొత్తం విద్యార్థుల్లో 51,069 మంది

## అసెంబ్లీకి వర్గీకరణ బిల్లు

- బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే మరో రెండు బిల్లులు కూడా..
- నేడు శాసనసభలో ప్రవేశపెట్టనున్న ప్రభుత్వం
- వర్గీకరణపై నేడే చర్చించి, ఆమోదించే ఛాన్స్
- బీసీలకు గంపగుత్తగానే రిజర్వేషన్ల పెంపు?
- బీసీ ఎమ్మెల్యేలతో భేటీ కానున్న మంత్రి పొన్నం

2



హైదరాబాద్-నవభూమిబ్యూరో

ఎస్సీ వర్గీకరణ బిల్లును, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు సంబంధించి రెండు బిల్లులను ప్రభుత్వం సోమవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టనుంది. ఎస్సీ వర్గీకరణ బిల్లును ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, బీసీ బిల్లులను మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రవేశపెట్టనున్నారు. ఎస్సీ వర్గీకరణకు సంబంధించి.. రిజర్వేషన్ల విషయంలో ఇప్పటికే స్పష్టత ఉండడంతో ఆ బిల్లుపై సోమవారమే చర్చించి, ఆమోదించే అవకాశం కూడా ఉన్నట్టు సమాచారం. ఎస్సీల వర్గీకరణ కోసం ఏర్పాటైన ఏకసభ్య కమిషన్ రాష్ట్రంలోని 59 ఎస్సీ కులాలను మూడు గ్రూపులుగా వర్గీకరించి ఆయా గ్రూపుల వారీగా 15 శాతం రిజర్వేషన్‌ను కేటాయించింది. గ్రూప్-1లో సామాజికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా, అత్యంత వెనుకబడిన, పట్టించుకోని కులాలను చేర్చి, వారికి 1 శాతం.. గ్రూప్-2లో మధ్యస్థంగా లబ్ధిపొందిన షెడ్యూల్ కులాలను చేర్చి, వారికి 9 శాతం, గ్రూప్-3లో మెరుగైన ప్రయోజనం పొందిన కులాలను చేర్చి, వారికి 5 శాతం రిజర్వేషన్లను

## ఇంటర్ విద్యలో కీలక మార్పులు

- ఏప్రిల్ నుంచే క్లాసులు..2026లో పబ్లిక్ పరీక్షలు ఫిబ్రవరిలో
- ఇంటర్మీడియట్‌లో ఇక నుంచి విద్యార్థులు ఎం.బైపీసీ చదువుకునే అవకాశం
- గణితంలో ఏ,బీ పేపర్లు రద్దు చేసి ఇకపై వంద మార్కులకు ఒకటే పరీక్ష
- సైన్స్ సబ్జెక్టుల్లో మార్కులను 60 నుంచి 85కు పెంచిన విద్యాశాఖ
- ఎంబైపీసీ చదివిన విద్యార్థులు మెడికల్,ఇంజనీరింగ్‌కు అర్హత

2



**అమరావతి-నవభూమిబ్యూరో:**ఏపీ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. కొంత కాలంగా జరుగుతున్న కసరత్తు మేరకు తాజాగా ఇంటర్మీడియట్ విద్యలో పలు కీలక మార్పులు తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయిం చింది. ఏప్రిల్ నుంచే అడ్మిషన్లు ప్రారంభించాలని నిర్ణయించారు. దీంతో 2025-26 విద్య సంవత్సరం నుంచి జూన్ 1వ తేదికి బదులుగా ఏప్రిల్ 1వ తేదీ నుంచే ప్రభుత్వ కళాశాలలు ప్రారంభం కానున్నాయి. 2026లో పబ్లిక్ పరీక్షలు ఫిబ్రవరిలో, ప్రథమ సంవత్సరం అడ్మిషన్లు ఏప్రిల్ 7వ తేదీ నుంచి ప్రారంభించాలని నిర్ణయం తీసుకున్నారు. ఇంటర్ లో సంస్కరణలు ఇంటర్మీడియట్ విద్యా విధానంలో మార్పులు తీసుకొచ్చేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. తాజాగా జరిగిన ఇంటర్ సమీక్షలో ఈ మేరకు పలు నిర్ణయాలకు ఆమోదం తెలిపారు. అందులో భాగంగా..

## మేం శాంతికి ప్రయత్నించాం.. వాళ్లు అశాంతి సృష్టిస్తున్నారు

- అమెరికాకు చెందిన లెక్స్ ఫ్రిడ్‌మ్యాన్ పాడ్‌కాస్ట్‌లో మోదీ ఇంటర్వ్యూ
- పాక్ ప్రజలు కలహాలు, అశాంతితో అలసి పోయారు
- పాక్ ప్రజలు కూడా శాంతి కోరుకుంటున్నారు
- ఇప్పటికైనా ఇస్లామాబాద్ నాయకుల్లో వివేకం మేల్కొవాలి

2



**న్యూఢిల్లీ-నవభూమి:** పొరుగుదేశమైన పాకిస్థాన్‌తో శాంతి కోసం భారత్ ప్రయత్నించినప్పుడల్లా శతృత్వం, నమ్మకద్రోహమే ఎదురైందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. అమెరికాకు చెందిన లెక్స్ ఫ్రిడ్‌మ్యాన్ పాడ్‌కాస్ట్‌లో జరిగిన ఇంటర్వ్యూలో మోదీ మాట్లాడు తూ, ఇండియా-పాక్ సంబంధాలలో కొత్త అధ్యాయం ప్రారంభం కావాలని ఆశిస్తూ 2014లో ప్రధానమం త్రిగా తన ప్రమాణస్వీకారానికి అప్పటి పాక్ ప్రధాని నవాజ్ షరీఫ్‌ను కూడా ఆహ్వానించానని చెప్పారు. నిబద్ధతో తాము శాంతిని ప్రోత్సహించేందుకు పనిచేసినప్పుడల్లా శత్రుత్వం, నమ్మకద్రోహాన్నే చవిచూశామని తెలిపారు.

పాక్ ప్రజలు కలహాలు, అశాంతితో అలసి పోయారని, ఉగ్రదాడుల్లో ఎందరో అమాయకులు ప్రాణాలు కోల్పోయారని, వారు కూడా శాంతి కోరుకుంటున్నారని మోదీ అన్నారు. ఇప్పటికైనా ఇస్లామాబాద్ నాయకుల్లో వివేకం మేలుకుంటుందని ఆశిస్తున్నామని చెప్పారు.

**స్కార్ దేశాధినేతలను ఆహ్వానించాం**

విదేశాంగ విధానంలో గతంలో తమను ప్రశ్నించిన వారు ఆ తర్వాత సార్క్ దేశాధినేతలను ఆహ్వానించడాన్ని చూసి ఆశ్చర్యపోయారని ప్రధాని

## సీఎం చంద్రబాబు అధ్యక్షతన నేడు ఏపీ కేబినెట్ సమావేశం

- పలు కీలక నిర్ణయాలకు ఆమోదం
- అమరావతి పనులకు పచ్చ జెండా ఊపనున్న కేబినెట్



**అమరావతి-నవభూమిబ్యూరో:**ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన రేపు ఏపీ కేబినెట్ సమావేశం కానుంది. సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు సచివాలయంలో రాష్ట్ర కేబినెట్ భేటీ జరగనుంది. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలపనున్నారు. అమరావతి నిర్మాణం కోసం సీఆర్డీఏ ఆమోదించిన రూ.37,072 కోట్ల టెండర్ల పనులు చేపట్టేందుకు కేబినెట్ ఆమోదం తెలపనుంది. అమరావతి డెవలప్ మెంట్ కార్పొరేషన్ చేపట్టిన రూ.15,081 కోట్ల పనులకు ఆమోదం తెలపనుంది. అమరావతిలో పలు సంస్థలకు భూ కేటాయింపులకు కూడా రాష్ట్ర కేబినెట్ ఆమోదం లభించనుంది. 10 సంస్థల ద్వారా వచ్చే రూ.1,21,659 కోట్ల పెట్టుబడులకు కేబినెట్ ఆమోదం తెలపనుంది. 175 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులు, ముందుగా 26 జిల్లా కేంద్రాల్లో ఏర్పాటుకు ఆమోదం తెలపనుంది.

## డీలిమిటేషన్ తొలి దెబ్బ ప్రాంతీయ పార్టీలకే

**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో:**లోక్‌సభలో 888 మంది పార్లమెంటు సభ్యులకు సౌకర్యవంతంగా వసతి కల్పించేలా దీనిని రూపొందించారు, ఇది పాత లోక్‌సభ సామర్థ్యం కంటే మూడు రెట్లు ఎక్కువగా చేశారు. డీలిమిటేషన్ విషయంలో కేంద్రంలోని బీజేపీ నాయకత్వంలోని ఎన్డీయే కూటమి దూకుడుగా ముందుకు వెళ్తోంది. ఒక ప్రణాళిక ప్రకారం అంతా చేసుకుంటోంది. బీజేపీ ఈ విషయంలో ఎంత అలెర్ట్ గా ఉందంటే 2022లో కొత్త పార్లమెంట్ భవనం నిర్మించింది. అందులో కేవలం 888 మంది మాత్రమే ఎంపీలు కూర్చునే విధంగా నిర్మాణం జరిగింది. లోక్‌సభలో 888 మంది పార్లమెంటు సభ్యులకు సౌకర్యవంతంగా వసతి కల్పించేలా దీనిని రూపొందించారు, ఇది పాత లోక్‌సభ సామర్థ్యం కంటే మూడు రెట్లు ఎక్కువగా చేశారు. అలాగే కొత్త రాజ్యసభ సమావేశ మందిరంలో 384 మంది సభ్యులకు సీట్లు ఉంటాయి. ఈ విధంగా చూస్తే కనుక బీజేపీ ముందే డీలిమిటేషన్ మీద ఒక అవగాహన పెంచుకుని ఈ విధంగా చేసింది అని భావించాల్సి ఉంది. అంటే ఈ రోజున దేశంలో 543 ఎంపీ సీట్లు ఉంటే అవి ఎంతవరకూ పెరుగుతాయన్న అంచనా బీజేపీకి ముందుగా ఉందని అంటున్నారు. జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్ చేయాలని బీజేపీ భావిస్తోంది ఇక ప్రతీ లోక్ సభ నియోజకవర్గంలో పాతిక నుంచి ముప్పయి లక్షల దాకా ఓటర్లు ఉన్నారు. ఈ రకమైన జనాభా ఉత్తరాదిన ఎక్కువగా ఉంది. దాంతో దీనిని 20 లక్షలకు చేయాలని డీలిమి టేషన్ లో పెట్టుకున్నారని అంటున్నారు. ఆ విధంగా చేస్తే ఉత్తరాదిన ఇపుడు ఉన్న సీట్లకు మరింత ఎక్కువగా సీట్లు పెరుగుతాయి. కేవలం యూపీ బీహార్ లలో కలుపుకుని ఏకంగా 200 ఎంపీ సీట్లు ఈ డీలిమిటేషన్ లో అవుతాయని అంటున్నారు. ఇక ఈ దేశంలో 143 కోట్ల మంది జనాభా ఉన్నారు ప్రతీ ఇరవై లక్షల జనాభాకు ఒక లోక్ సభ సీటు అనుకుం టే 715 దాకా ఎంపీ సీట్లు పెరుగుతాయని ఒక అంచనా ఉంది. ఇక ఇందులో ఉత్తరాదిన జనాభా ఎక్కువగా ఉంటుంది కాబట్టి అక్కడే సీట్లు అధికంగా పెరుగుతాయని అంటున్నారు. ఈ విషయంలో దక్షిణాదికి తీవ్రంగా అన్యాయం జరుగుతుందని ఆందోళన అయితే మేధావులలో ఉంది. దక్షిణాదిన చూసుకుంటే మొత్తం రెండు తెలుగు రాష్ట్రాలు, తమిళనాడు, కేరళ, కర్ణాటక ఉన్నాయి.



# తెలంగాణ వ్యాప్తంగా మండుతున్న ఎండలు..

**హైదరాబాద్-నవభూమి:** తెలంగాణ వ్యాప్తంగా ఎండలు మండిపోతున్నాయి. మార్చి నెలలోనే గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. హైదరాబాద్‌తో పాటు జిల్లాల్లో 40 డిగ్రీలకు పైగానే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. సాధారణం కంటే 3.3 డిగ్రీలు అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని వాతావరణ శాఖ అధికారులు చెప్తున్నారు. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఎండల ప్రభావం ఎక్కువగా ఉంటోంది. కాగా.. వచ్చే పది రోజుల్లో తెలంగాణలో కాస్త భిన్నమైన వాతావరణ పరిస్థితులు ఏర్పడబోతున్నట్టు తెలంగాణ వాతావరణ నిపుణలు చెప్తున్నారు.

ఈ నేఫథ్యంలోనే.. తెలంగాణ వెదర్‌మెన్ కీలక అప్డేట్ ఇచ్చాడు. మార్చి 19 వరకు వేడిగాలులు కొనసాగుతాయని స్పష్టం చేశారు. అయితే.. మార్చి 20 నుంచి 24 తేదీల్లో మాత్రం రాష్ట్రంలో అకాల వర్షాలు కురిస్తాయని హెచ్చరించాడు. అవి కూడా బలమైన ఉరుములతో కూడిన అకాల వర్షాలు కురుస్తాయని స్పష్టం చేశాడు. ఈ వాతావరణం ఎప్పటికప్పుడు మారుతుందని కూడా పేర్కొన్నారు. అయితే మార్చి 20 తర్వాత మాత్రం రైతులు కాస్త జాగ్రత్తగా ఉండాలని తెలంగాణ వెదర్ మెన్ సూచించాడు.



# మాట మార్చేసిన తీన్మార్ మల్లన్న.. ఇంతలో ఎంత మార్పు..? అప్పుడు అలా.. సభలో ఇలా..!



**హైదరాబాద్-నవభూమి:** తెలంగాణలో రాజకీయాలు ఎప్పటికప్పుడు ఆసక్తిని రేకెత్తిస్తూనే ఉన్నాయి. ఏ పార్టీ నేత ఎప్పుడు ఎలా మారతాడో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. మొన్నటివరకు ప్రభుత్వంపై నిప్పులు చెరిగిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్ ఒక్కసారిగా మాట మార్చేశారు. రేవంత్ రెడ్డి సర్కార్ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కులగణన సర్వే నివేదిక మొత్తం తప్పుల తడకగా అభివర్ణించిన తీన్మార్ మల్లన్న.. రిపోర్టును తన యూట్యూబ్ ఛానెల్ లైవ్‌లోనే తగలబెట్టటం సర్వత్రా చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. బీసీల జనాభాకు సంబంధించి తప్పుడు లెక్కలు చూపించారని.. హైదరాబాద్‌లోనే పలు చోట్ల మొత్తానికే సర్వే చేయలేదని.. రాష్ట్రంలో ఇంకెన్ని ప్రాంతాల్లో సర్వే చేయలేదో అంటూ అనుమానాలు వ్యక్తం చేస్తూ.. ప్రభుత్వంపై తీవ్ర అక్కస్సు వెళ్లగక్కిన మల్లన్నపై పార్టీ నాయకత్వం సస్పెన్షన్ వేటు కూడా వేసిన విషయం తెలిసిందే.ఇక్కడి వరకు అందరికీ తెలిసిందే. అయితే.. శనివారం (మార్చి 15న) రోజున మాత్రం శాసనమండలిలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానం సందర్భంగా ఆయన మాట్లాడిన తీరు, కుల గణన సర్వేపై స్పందించిన విధానం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. కులగణన సర్వే లెక్కల విషయానికి తాను పోవాలనుకో వట్లేదని.. రాష్ట్ర ప్రభుత్వ లెక్కలను గౌరవిస్తున్నట్టు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం లెక్కల ప్రకారమే 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. ఈ విషయంలో సీఎం రేవంత్ రెడ్డి పాటు కేసీఆర్, బీజేపీ నేతలు కూడా చొరవ చూపాలంటూ విజ్ఞప్తి చేశారు తీన్మార్ మల్లన్న.బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇస్తామని ప్రకటించిన సందర్భంగా రేవంత్ రెడ్డి సర్కార్‌కు తీన్మార్ మల్లన్న కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగుల డీఏలు పెండింగ్లో ఉన్నాయని.. రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం ఎదురుచూస్తున్నారని.. వాటికి పరిష్కార మార్గం చూపాలని కోరారు. తీన్మార్ మల్లన్న విజ్ఞప్తిపై సీఎం రేవంత్ రెడ్డి స్పందిస్తూ.. వచ్చే ఫైనాన్షియల్ సంవత్సరంలోపు పూర్తయ్యేలోగా రిటైర్డ్ ఉద్యోగుల బకాయిల చెల్లింపులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

అయితే.. మండలిలో తీన్మార్ మల్లన్న ప్రసంగం చూసిన నెటిజన్లు ఇంతలో ఎంత మార్పు అని సోషల్ మీడియాలో పోస్టులు చేస్తున్నారు. మొన్నటి వరకు రిపోర్టులు కాల్చేసి.. రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై నిప్పులు చెరిగి.. పార్టీ నుంచి సస్పెండ్ చేయటంతోనే.. తత్వం బోధపడిందా అంటూ కామెంట్లు చేస్తున్నారు. తన యూట్యూబ్ ఛానెల్‌లో మాత్రం ఇష్టమున్నట్టు మాట్లాడే తీన్మార్ మల్లన్న.. పార్టీ నుంచి సస్పెండ్ చేశాక.. పార్టీ నీ అయ్యా జాగీరా అంటూ తీవ్ర స్థాయిలో కామెంట్లు చేసి.. ఇప్పుడు సైలెంట్ అవ్వటానికి కారణం ఏమై ఉంటుందా అన్ని చర్చించుకున్నారు.

# తెలంగాణ మాజీ ఉప ముఖ్యమంత్రి అరెస్ట్.. హైటెన్షన్..!



**హైదరాబాద్-నవభూమి:** సీఎం రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో.. స్టేషన్ ఘన్ పూర్ నియోజకవర్గంలో హైటెన్షన్ నెలకొంది. ఈరోజు స్టేషన్ ఘన్ పూర్ నియోజకవర్గంలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటించనుండగా.. బీఆర్ఎస్ నేతలు కీలక పిలుపునిచ్చింది. సీఎం సభను అడ్డుకుంటామని బీఆర్ఎస్ నేతలు ఇచ్చిన పిలుపు నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. నియోజకవకర్గంలోని కీలక బీఆర్ఎస్ నేతలను పోలీసులు ముందస్తుగా అరెస్టులు చేస్తున్నారు. ఈ క్రమంలోనే మాజీ డిప్యూటీ సీఎం తాటికొండ రాజయ్యను హౌస్ అరెస్ట్ చేశారు.

తెలంగాణలో రాజకీయాలు రసవత్తరంగా మారుతున్నాయి. ఇప్పటికే అధికార, ప్రతిపక్షాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేలా రాజకీయాలు మారిపోగా.. పరిస్థితి రోజు రోజుకు మరింత ముదురుతోంది. ఈ క్రమంలోనే.. తెలంగాణ తొలి డిప్యూటీ సీఎం తాటికొండ రాజయ్యను పోలీసులు అరెస్ట్ చేయటం ఇప్పుడు సర్వత్రా ఉత్కంఠ రేపుతోంది. ఈ నేపథ్యంలో.. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలో హైటెన్షన్ వాతావరణం నెలకొంది.

అయితే.. ఈరోజు (మార్చి 17న) సీఎం రేవంత్ రెడ్డి జనగామ జిల్లా స్టేషన్ ఘన్ పూర్‌లో పర్యటించనున్నారు. నియోజకవర్గంలో రూ. 800 కోట్లతో చేపట్టబోయే పలు అభివృద్ధి పనులకు రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం నిర్వహించనున్న బహిరంగ సభలో పాల్గొననున్నారు. సీఎం రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో నియోజకవర్గ బీఆర్ఎస్ నేతలు కీలక పిలుపునిచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి సభను అడ్డుకుంటామని బీఆర్ఎస్ నాయకులు ప్రకటించారు.

బీఆర్ఎస్ నేతల ప్రకటనతో అప్రమత్తమైన పోలీసులు.. నియోజకవర్గ వ్యాప్తంగా బీఆర్ఎస్ ముఖ్య నేతలను అదుపులోకి తీసుకున్నారు. పలువురు నాయకులకు హౌస్ అరెస్ట్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే తెలంగాణ తొలి ఉప ముఖ్యమంత్రి, మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్యను పోలీసులు హౌజ్ అరెస్ట్ చేశారు. సమాచారం అందుకున్న బీఆర్ఎస్ కార్యకర్తలు.. రాజయ్య నివాసం వద్దకు భారీగా చేరుకుంటుండటంతో పోలీసులు కూడా పెద్దఎత్తున మోహరించారు.

కాగా.. స్టేషన్‌ఘన్‌పూర్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన దృష్ట్యా.. జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. అసెంబ్లీలో రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో.. రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ నేతల నుంచి ఆగ్రహం వ్యక్తమవుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో సీఎం పర్యటన జరుగుతుండగా.. పోలీసులు అప్రమత్తమయ్యారు. పర్యటనలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

మరోవైపు.. శివునిపల్లి వద్ద 50 వేల మందితో ప్రజాపాలన బహిరంగ సభను నిర్వహించనున్నారు. స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరితో పాటు భారీ స్థాయిలో కాంగ్రెస్ శ్రేణులు ఈ సభకు హాజరుకానున్నారు. సీఎం సభ కోసం జనాన్ని తరలించేందుకు కాంగ్రెస్ శ్రేణులు ఇప్పటికే ఘనంగా ఏర్పాట్లు చేశారు. ఎండల నేపథ్యంలో సభా ప్రాంగణంలో జర్మన్ టెక్నాలజీ టెంట్లు సిద్ధం చేశారు. సభకు వచ్చే వారి దాహార్తిని తీర్చేందుకు మజ్జిగ ప్యాకెట్లను కూడా అందుబాటులో ఉంచుతున్నారు.

# భారీ శుభవార్త.. ఇంటి కల సాకారం.. వెబ్‌సైట్లో లబ్ధిదారుల లిస్ట్..



**హైదరాబాద్-నవభూమి:** ప్రతి ఒక్కరికీ సొంత ఇల్లు ఉండాలని కోరుకుంటారు. అలాంటి ఇంటి కోసం ఎన్నో కలలు కంటూ ఉంటారు. అయితే ఈ ఇంటి కలను సాకారం చేసేందుకు అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు రాష్ట్ర ప్రభుత్వాలు కూడా పథకాలను ప్రవేశపెడుతున్నాయి. వీటి ద్వారా ఇంటిని నిర్మించుకునేందుకు ఆర్థిక సాయం అందిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం నుంచి పీఎం ఆవాస్ యోజన పథకం ద్వారా తెలంగాణకు లక్ష ఇండ్లు మంజూరు చేసేందుకు కేంద్రం అంగీకరించింది. దీనికి సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.

సొంతింటి కలను సాకారం చేసుకునేందుకు కేంద్రం ప్రభుత్వం పీఎం ఆవాస్ యోజన పథకాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. ఇటు రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా రూ.5 లక్షల సాయాన్ని అందిస్తోంది. ప్రస్తుతం మొదటి దశలో భాగంగా.. స్థలం ఉన్న వారి జాబితాలను ఇప్పటికే నియోజకవర్గాల వెల్లడించారు. అయితే పీఎం ఆవాస్ యోజన పథకం ద్వారా తెలంగాణ రాష్ట్రానికి లక్ష ఇండ్లు మంజూరు చేసేందుకు తాజాగా కేంద్రం అంగీకరించింది. 2024%-25 ఆర్థిక సంవత్సరానికిగానూ పట్టణ ప్రాంతాల్లో ఈ ఇండ్లను మంజూరు చేయనున్నట్లు తెలిపింది. పీఎం ఆవాస్ వెబ్సైట్ లో లక్ష ఇండ్లకు సంబంధించి లబ్ధిదారుల జాబితాను రాష్ట్ర గృహనిర్మాణ శాఖ ఇప్పటికే అప్‌లోడ్ చేసింది. స్టేట్ హౌసింగ్ ఆఫీసర్లు ఇటీవల కేంద్ర అర్బన్ హౌసింగ్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్రానికి అర్బన్, రూరల్ కేటగిరీలో ఇండ్లను మంజూరు చేయాలని కోరారు. ఈ మేరకు పట్టణ ప్రాంతాల్లో ఈ ఇండ్ల మంజూరుకు అంగీకరించిన కేంద్రం.. రూరల్ ఇండ్లకు మాత్రం కొన్ని మార్పులు, చేర్పులు చేయాలని కేంద్ర అర్బన్ హౌసింగ్ అధికారులు ప్రభుత్వాన్ని కోరినట్లు సమాచారం.ఇదిలా ఉంటే.. 100 శాతం సబ్సిడీతో తెలంగాణ రాష్ట్రంలో ఒక్కో ఇంటికి రూ.5 లక్షలు ఇచ్చేలా ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని తెలంగాణ ప్రభుత్వం ఈ ఏడాది జనవరి 26న రూరల్ ఏరియాలో 71,500 ఇండ్లను సాంక్షన్ చేసి.. లబ్ధిదారులకు ఇండ్ల పత్రాలను కూడా అందించిన విషయం తెలిసిందే. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కూడా చాలా చోట్ల ఈ ఇండ్ల నిర్మాణాలు కూడా స్టార్ట్ అయ్యాయి. అయితే కేంద్రం అందిస్తున్న పీఎం ఆవాస్ యోజన పథకం కింద.. అర్బన్ ఏరియాల్లో ఒక్కో ఇంటికి రూ.1.50 లక్షలు, రూరల్ ఏరియాల్లో రూ.72 వేలు ఇస్తుంది. ఈ రకంగా చూసుకుంటే.. రాష్ట్రానికి మొత్తం రూ.1500 కోట్లు రానున్నాయి. దీంతో ప్రభుత్వం పేదలకు నిర్మిస్తామని చెప్పిన లక్ష ఇండ్లకు మిగతా రూ.3.50 లక్షల చొప్పున రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి ఉంటుంది. కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఎక్కువ సంఖ్యలో ఇండ్లు ఇవ్వాలని మొదటి నుంచి కోరుతోంది. గత సంవత్సరం పట్టణం, రూరల్ ఏరియాలకు కలిపి మొత్తం 9 లక్షల ఇండ్లు మంజూరు చేయాలని ప్రతిపాదనలు పంపారు. ప్రధాని మోదీని ఇటీవల ఢిల్లీ వెళ్లిన సమయంలో సీఎం రేవంత్ రెడ్డి ఈ అంశాన్ని ప్రస్తావించారు. ఇటీవల కేంద్ర అర్బన్ హౌసింగ్ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ రాష్ట్ర పర్యటనకు వచ్చిన విషయం తెలిసిందే. ఆ సమయంలో గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీఎం రేవంత్ రెడ్డి కలిసి.. తమ రాష్ట్రానికి ఎక్కువ ఇండ్లను కేటాయించాలని కోరారు. ఇందిరమ్మ ఇండ్లపైన పీఎం ఆవాస్ యోజన లోగో కూడా వేస్తామని గతంలో సీఎం రేవంత్ ప్రకటించారు. ఈ రకంగా రాష్ట్రానికి వచ్చే నాలుగు ఏండ్లలో ఎక్కువ సంఖ్యలో ఇండ్లను మంజూరు చేయించుకునేలా సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రయత్నిస్తోంది.

**ఇందిరమ్మ ఇండ్ల రెండో విడత.. .**

తొలి విడతలో తెలంగాణ ప్రభుత్వం 71,500 ఇండ్లను మంజూరు చేయగా.. మండలానికో గ్రామాన్ని ఎంపిక చేశారు. ఇలా నియోజకవర్గానికి చాలా తక్కువ సంఖ్యలో ఇండ్లు మంజూరు కావడంతో చాలా మంది అసహనం వ్యక్తం చేశారు. అయితే ఈ సారి ప్రతీ మండలంలో లబ్ధిదారులు ఉండే విధంగా రెండో విడత లబ్ధిదారుల ఎంపిక సాగుతోంది. ప్రభుత్వం నియోజకవర్గానికి 3,500 ఇండ్లను మంజూరు చేస్తామన్న హామీలో సాధ్యమైనంత వరకు మంజూరు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

# తెలంగాణ యువతకు అదిరిపోయే శుభవార్త

## ఒక్కొక్కరికి రూ. 3 నుంచి 5 లక్షలు



**హైదరాబాద్-నవభూమి:** తెలంగాణ నిరుద్యోగులకు రేవంత్ రెడ్డి సర్కార్ మరో అదిరిపోయే శుభవార్త వినిపించింది. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ప్రయత్నాలు చేస్తున్న ప్రభుత్వం.. ఈ మేరకు కొత్త పథకాన్ని తీసుకొస్తోంది. రాజీవ్ యువ వికాసం పేరుతో తీసుకొస్తున్న ఈ కొత్త పథకాన్ని రేపే ప్రారంభించనున్నారు. కాగా.. పథకం ప్రారంభంపై మంత్రి పొన్న ప్రభాకర్‌తో కలిసి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలోత.. యువ వికాసం పథకం విధి విధానలపై చర్చించారు. అయితే.. సోమవారం (మార్చి 17న) నుంచి రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తుల ప్రక్రియను సీఎం రేవంత్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ ప్రారంభ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఇతర మంత్రులు పాల్గొననున్నారు.

అయితే.. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశం కల్పించేందుకే ఈ యువ వికాం పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. తెలంగాణ సంక్షేమ శాఖ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్ల సహకారంతో ఈ పథకం అమలు చేయనున్నట్టు తెలిపారు. ఈ కార్పొరేషన్ల ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేయనుంది.

యువత సొంత వ్యాపారాలు చేసుకునేం దుకు.. ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు రూ.3 లక్షల నుంచి రూ. 5 లక్షల వరకు ప్రభుత్వం ఆర్థిక సాయం చేయనుంది. ఈ ఆర్థిక సాయం కోసం దరఖాస్తు చేసుకునేందుకు షెడ్యూల్ కూడా విడుదల చేశారు. మార్చి 15 నుంచి ఏప్రిల్ 5 వరకు అర్హులైన వారు ఈ పథకం కోసం దరఖాస్తు చేసుకోవచ్చని ప్రభుత్వం తెలిపింది. మ్మొత్తం రూ. 6 వేల కోట్లతో ఈ పథకాన్ని రూపొందించామని.. తెలంగాణ వ్యాప్తంగా 5 లక్షల మంది యువతకు తగ్గకుండా సాయం చేయనున్నట్టు భట్టి విక్రమార్క ఇప్పటికే వెల్లడించారు.ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేసే పనిలో పడిన రేవంత్ రెడ్డి సర్కార్.. మహిళలు, రైతుల సంక్షేమం, అభివృద్ధి కోసం ఇప్పటికే పలు పథకాలు, కార్యక్రమాలు అమలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే.. రాష్ట్రంలో ప్రధాన సమస్యగా ఉన్న నిరుద్యోగాన్ని రూపుమాపేందుకు ప్రభుత్వం అన్ని రకాలుగా కృషి చేస్తోంది. ఇందులో భాగంగా.. ఇప్పటికే పలు రంగాల్లో ఉద్యోగాలకు నోటిఫికేషన్లు, పరీక్షలు నిర్వహిస్తున్న ప్రభుత్వం.. తాజాగా రాజీవ్ యువ వికాసం పేరుతో కొత్త పథకాన్ని అమలు చేసేందుకు సిద్ధమైంది.

# నేటి నుంచి టెన్త్ పరీక్షలు

**(1వపేజీ తరువాయి)** ఇంటర్మీడియట్‌లో ఇక నుంచి విద్యార్థులు ఎం.బైపీసీ చదువుకునే అవకాశాన్ని కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గణితంలో ఏ,బీ పేపర్లు రద్దు చేసి ఇకపై వంద మార్కులకు ఒకటే పరీక్ష నిర్వహిస్తారు. సైన్స్ సబ్జెక్టుల్లో మార్కులను 60 నుంచి 85కు పెంచారు. ఏటా ఫిబ్రవరిలోనే పబ్లిక్ పరీక్షలు నిర్వహించేలా కీలక సంస్కరణలకు ఇంటర్మీడియట్ విద్యా మండలి ఆమోదం తెలిపింది. ఇంటర్మీడియట్‌లో ఇకపై ఎంబైపీసీ గ్రూపు చదవడం వల్ల విద్యార్థులు మెడికల్, ఇంజినీరింగ్ రెండింటికి అర్హత సాధిస్తారు. నీట్, జేఈఈలు రాసుకోవచ్చు. %హాశ్రీంశీ =ఝుం% జనసేనకు సర్వే నిపుణుడి షాక్- మిమ్మల్ని గెలిపించింది ఆయనే..! తాజా విశ్లేషణ..! సబ్జెక్టులపై నిర్ణయం ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పబ్లిక్ పరీక్షలు రద్దు చేయాలని గతంలో వచ్చిన ప్రతిపాద నను పరిశోధన, శిక్షణ మండలి సిలబస్‌ను అమలు చేయనున్నారు. విద్యార్థులు ఆరు సబ్జెక్టులతో .బైపీసీ కోర్సు చదువుకునే అవకాశం కల్పించారు. మార్చిన సిలబస్ ప్రకారం కొత్త పాఠ్యపుస్తకాలను ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఉచితంగా ఇస్తారు. గ్రూపులో ఐదు సబ్జెక్టులు ఉంటాయి. రెండు భాష సబ్జెక్టుల్లో ఆంగ్లం తప్పని సరిగా చదవాల్సి ఉంటుంది. రెండో భాష సబ్జెక్టు ఐచ్చికంగా ఎంపిక చేసుకోవచ్చు. అదే విధంగా ఎంపీసీ విద్యార్థి రెండో భాష తెలుగు, సంస్కృతం, హిందీ, ఉర్దూ స్థానంలో జీవశాస్త్రం తీసుకుంటే ఎం.బైపీసీ చదవొచ్చు. లేదంటే నచ్చిన సబ్జెక్టును ఎంపిక చేసుకునే అవకాశం కల్పించారు. %ూశీఠవతీవ‌ు దీఎ ూఖ్రూ% పేపర్లలో మార్పులు ఇంటర్ విద్యార్థులకు ప్రస్తుతం గణితంలో ఏ, బీగా పేపర్లు 150 మార్కులకు ఉండగా వచ్చే ఏడాది మొదటి ఉండగా ఇది 85మార్కులకు పెరగను న్నాయి. రెండో ఏడాదిలో 30మార్కులకు ప్రాక్టీకల్స్ ఉంటాయి. వృక్ష, జంతు శాస్త్రం కలిపి జీవశాస్త్రంగా ఒకే సబ్జెక్టుగా ఉంటాయి. ఇది 85 మార్కులకు ఉంటుంది. ఇందులో 43మార్కులు వృక్షశాస్త్రం, 42 మార్కులు జంతుశాస్త్రం ఉంటుంది. మిగతా 15 మార్కులకు ప్రాక్టీకల్స్ ఉంటాయి. భాష సబ్జెక్టులు వంద మార్కులకు ఉంటాయి. నీట్, జేఈఈ, ఈఏపీసెట్ లాంటి పోటీ పరీక్షల మెటీరియల్‌ను బోర్డు పోర్టల్‌లో ఉంచుతారు. ప్రభుత్వ కళాశాలల విద్యార్థులకు కోచింగ్ తోపాటు మెటీరియల్ ఉచితంగా ఇస్తారు. ఏప్రిల్ నుంచే కళాశాలలు 2025-26 విద్యా సంవత్సరం నుంచి జూన్ ఒకటో తేదీకి బదులు ఏప్రిల్ 1 నుంచే జూనియర్ కళాశాలలు ప్రారంభమవుతాయి. ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశాల ప్రక్రియ ఏప్రిల్ 7నుంచి మొదలవుతాయి. ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు మార్చి 2026లో కాకుండా ఫిబ్రవరి చివరి వారం నుంచే నిర్వహిస్తారు.

# అసెంబ్లీకి వర్గీకరణ బిల్లు

**(1వపేజీ తరువాయి)** కేటాయించి, నివేదికను ప్రభుత్వానికి అందించింది. ఆ వర్గీకరణకు రాష్ట్ర ప్రభుత్వం చట్టబద్ధత కల్పించనుంది. తద్వారా ఆయా వర్గాలన్నింటికీ మేలు జరుగుతుందని సర్కారు భావిస్తోంది. అంతేకాదు.. ఎస్సీ వర్గీకరణ విషయంలో రాష్ట్రాలే నిర్ణయాలు తీసుకోవచ్చంటూ సుప్రీంకోర్టు తీర్పు తరువాత దానిని అమలుచేసిన మొదటి రాష్ట్రంగా తెలంగాణ నిలవనుంది. వర్గీకరణ బిల్లును సభలో ప్రవేశపెట్టిన అనంతరం ఈ అంశాలతో పాటు మరికొన్నింటిపైనా చర్చించనున్నారు.

అలాగే.. బీసీలకు స్థానిక సంస్థలతోపాటు, విద్య, ఉపాధి రంగాల్లో 42% రిజర్వేషన్లు కల్పించే బిల్లులనూ ప్రభుత్వం సభలో ప్రవేశపెట్టి చర్చ జరపనుంది. వాటిని ఆమోదించి పార్లమెంటుకు పంపాలని.. కేంద్రం ఒప్పుకోకపోతే జాతీయ స్థాయిలో పోరాటం చేయాలని భావిస్తోంది. స్థానిక సంస్థల్లో, విద్య ఉద్యోగాల్లో మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదని సుప్రీంకోర్టు తీర్పులు ఉన్న నేపథ్యంలో ఈ అంశంపై పకడ్బందీగా ముందుకెళ్లే ఉద్దేశంతో రాష్ట్రప్రభుత్వం ఉంది. కాగా.. అసెంబ్లీలో ప్రవేశపెట్టబోయే బీసీ బిల్లుల్లో రిజర్వేషన్లను కేటగిరీలవారీగా కాకుండా గంపగుత్తగా పెంచనున్నట్టు సమాచారం. ప్రస్తుతం రాష్ట్రంలో బీసీల్లోని ఏ కేటగిరీకి 7%, బి కేటగిరీకి 10%, సి కి 1%, డి 7%, ఈ కేటగిరీకి 4% చొప్పున రిజర్వేషన్లు అమల్లో ఉన్న విషయం తెలిసిందే. కాగా.. బీసీ బిల్లులపై చర్చించేందుకు కాంగ్రెసలోని బీసీ సామాజిక వర్గం ఎమ్మెల్యేలతో మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం అసెంబ్లీలో, సభ ప్రారంభం కావడానికి ముందే ప్రత్యేకంగా భేటీ కానున్నారు. సభలో ఈ బిల్లులను ప్రవేశపెట్టడం, సమగ్ర కుల సర్వే, రిజర్వేషన్ల పెంపునకు కేంద్రం నుంచి ఆమోదం తీసుకోవడం సహా పలు అంశాలపై ఈ భేటీలో చర్చించనున్నట్టు తెలిసింది. ఇక.. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి సురవరం ప్రతాపరెడ్డి పేరు పెట్టాలని సర్కారు నిర్ణయించిన సంగతి తెలిసిందే. దానికి సంబంధించిన సవరణ బిల్లును కూడా సీఎం రేవంత్ రెడ్డి సోమవారం సభలో ప్రవేశపెట్టనున్నారు.

# కేసీఆర్ జాతిపిత ఎలా అవుతారు?

**(1వపేజీ తరువాయి)** 5500 కోట్లు కేటాయించా మన్నారు. గ్రూప్ 1, 2,3 పరీక్షలను సవ్యంగా నిర్వహించి ఉద్యోగాలు ఇస్తున్నామని సీఎం రేవంత్ చెప్పారు. అన్ని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రానికి కడియం శ్రీహరి అవసరం ఉందని పార్టీకి తీసుకున్నామన్నారు. ఎమ్మెల్యేగా జీతభత్యాలు తీసుకుంటున్న వ్యక్తి.. తన బాధ్యతలను నెరవేర్చడం లేదంటూ కేసీఆర్‌పై మండిపడ్డారు. 15 నెలలుగా 50 లక్షలకుపైగా జీతభత్యాలు తీసుకుంటూ అసెంబ్లీ మాత్రం రావడం లేదని కేసీఆర్ నుద్దేశించి వ్యాఖ్యానించారు సీఎం రేవంత్ రెడ్డి. బడ్జెట్ సమావేశాల్లో కేసీఆర్ చేసిన తప్పులను బయటపెడతామన్నారు. కేసీఆర్‌ను తెలంగాణ జాతిపిత అని అంటు న్నారని.. ఆయన జాతిపిత ఎలా అవుతారని ప్రశ్నించారు. వందల ఎకరాల ఫాంహౌస్‌లు కట్టుకున్నోళ్లు జాతిపిత అవుతారా? తాగుబోతులు జాతిపిత అవుతారా? అని ప్రశ్నించారు. తెలంగాణ జాతిపిత అర్హత కేసీఆర్‌కు లేదన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ, ప్రొఫెసర్ జయశంకర్‌లు తెలంగాణకు జాతిపిత అవుతారని సీఎం రేవంత్ స్పష్టం చేశారు.

# అమరావతి నిర్మాణానికి హడ్కో రుణం

**(1వపేజీ తరువాయి)** వేగం పుంజుకోనున్నాయి. ఈ మేరకు ప్రభుత్వం వేగంగా అడుగులేస్తోంది. ఇప్పటికే రాజధానిలో గతంలో భూములు కేటాయించిన సంస్థలకు వాటిని తిరిగి కేటాయించడం, లేదా ముందుకు రాని సంస్థలకు భూముల్ని రద్దు చేయడం వంటి చర్యలు తీసుకున్నారు. త్వరలో టెండర్ల ప్రక్రియ కూడా పూర్తి చేసి అమరావతి పనులు ప్రారంభించబోతున్నారు.

# డీకే అరుణ ఇంట్లోకి ఆగంతకుడి చొరబాటు

**(1వపేజీ తరువాయి)** చెప్పారు. ఆగంతకుడు గంటన్నరపాటు కిచెన్‌లో ఉన్నాడని, ఎంపీ గది వరకు వెళ్లాడని డ్రైవర్ చెప్పారు. అయితే, ఇంట్లో ఎలాంటి వస్తువులు పోలేదని తెలిపారు. ఒక్కడే వచ్చినట్లు సీసీ టీవీలో కనిపించిందన్నారు. జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశామని డీకే అరుణ డ్రైవర్ లక్ష్మణ్ తెలిపారు. " హైదరాబాద్‌లోని తమ నివాసంలో దుండగుడు చొరబడి ఘటనపై ఎంపీ డీకే అరుణ ఆందోళన వ్యక్తం చేశారు. తనతోపాటు తన కుటుంబానికి సెక్యూరిటీ పెంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఘటనపై విచారణ చేపట్టాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. గతంలో తమ కుటుంబంపై జరిగిన ఘటనను దృష్టిలో ఉంచుకుని భద్రత పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసానికి 100 మీటర్ల దూరంలోని తన నివాసంలో ఇలా జరిగిందన్నారు. దుండుగుడు తన నివాసంలో ఏవైనా బగ్స్ పెట్టారా? అనే అనుమానం వ్యక్తం చేశారు. డీకే అరుణకు బండి సంజయ్ ఫోన్, ఘటనపై ఆరా డీకే అరుణకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఫోన్ చేశారు. దుండగుడు ఆమె ఇంట్లోకి ప్రవేశించిన ఘటనపై ఆరా తీశారు. ఘటనపై కేసు నమోదు చేయాలని పోలీసులు, అధికారులను బండి సంజయ్ ఆదేశించారు. డీకే అరుణ కుటుంబానికి భద్రత పెంచాలని సూచించారు.

# నేటి నుంచి టెన్త్ పరీక్షలు

**(1వపేజీ తరువాయి)** తెలుగు మీడియంలో పరీక్షలు రాయనున్నారు. ఒడియాలో 838 మంది, తమిళంలో 194 మంది, కన్నడలో 623 మంది, హిందీలో 16 మంది, ఉర్దూలో 2,471 మంది పరీక్షలు రాయనున్నారు. వీరితో పాటు ఓపెన్ స్కూల్ సొసైటీ విద్యార్థులకూ సోమవారం నుంచే పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి.

పదో తరగతి పరీక్షలు రాయబోతున్న విద్యార్థులకు సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ శుభాకాంక్షలు తెలిపారు. అకడమిక్ ప్రయాణంలో టెన్త్ పరీక్షలు కీలక మైలురాలు లాంటివని, ఏకాగ్రతతో ఉండాలని సూచించారు. ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాయాలని సూచించారు.

# ప్రకృతి ప్రకోపానికి అమెరికా విలవిల

**(1వపేజీ తరువాయి)** గాయపడ్డారని స్టేట్ హైవే పెట్రోల్ అధికారులు స్పష్టం చేశారు. అర్కాన్సాస్ లోని ఇండిపెండెన్స్ కౌంటీలో ముగ్దురు మరణించగా, 29 మంది గాయపడ్డారు. అలానే టెక్సాస్ లోని అమరిల్లో ముగ్దురు మరణించారు. షెర్మాన్ కౌంటీలో దుమ్ము తుఫాను కారణంగా చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఎనిమిది మంది మరణించారు. మరో మూడు కౌంటీలలో ఆరుగురు మరణించారని.. ముగ్గురు తప్పిపోయారని మిస్సిసిప్పి గవర్నర్ ప్రకటించారు. ఈ ఐదు రాశులకు అఖండ ధనయోగం ఇస్తున్న పరమశివుడు! అంతే కాకుండా తుఫాను విధ్వంసానికి అమెరికాలోని 100కు పైగా ప్రాంతాల్లో అగ్నిప్రమాదాలు సంభవించాయి. పదుల సంఖ్యలో వాహనాలు ధ్వంసం అయ్యాయని వాపోతున్నారు. టెక్సాస్ పాన్ హ్యాండిల్‌లోని అమరిల్లోలో దుమ్ము తుఫాను కారణంగా కారు ప్రమాదాల్లో ముగ్గురు వ్యక్తులు మరణించారని భద్రతా సిబ్బంది తెలిపారు. పదుల సంఖ్యలో అడవుల్లో మంటలు చెలరేగినట్లు కూడా భావిస్తున్నారు. అమెరికాలోని రాష్ట్రాలన్నింటిలో కలిపి దాదాపు 2 లక్షలకు పైగా ఇళ్లలో కరెంటు నిలిచిపోయినట్టు తెలుస్తోంది. మరో వైపు మిన్నెసోటా లోని పశ్చిమ ప్రాంతాలు, దక్షిణ డకోటా లోని తూర్పు ప్రాంతాలకు జాతీయ వాతావరణ సేవ మంచు తుఫాను హెచ్చరికను జారీ చేసింది. 3 నుంచి 6 అంగుళాల మంచు పేరుకుపోయే అవకాశం ఉందని వెల్లడించింది. ఈ విధ్వంసకర పరిస్థితుల్లో స్థానికులు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని అధికారులు సూచిస్తున్నారు. రోడ్లపై కార్లతో పాటు పెద్ద పెద్ద ట్రక్కులు కూడా బోల్లాపడినట్లు సోషల్ మీడియాలో ఫొటోలు వైరల్ అవుతున్నాయి. తుఫాను మరింత తీవ్ర రూపం దాల్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

# మేం శాంతికి ప్రయత్నించాం.. వాళ్లు అశాంతి సృష్టిస్తున్నారు

**(1వపేజీ తరువాయి)** గుర్తుచేశారు. భారత విదేశాంగ విధానం ఎంత పటిష్ఠంగా ఉందో దానిని బట్టే చెప్పవచ్చన్నారు. శాంతి పట్ల భారతదేశం నిబద్ధతను ప్రపంచదేశానికి చాటామని, అయినప్పటికీ ఆశించిన ఫలితాలు రాలేదని అన్నారు.

చైనాతో..పోటీతత్వం అనేది మంచే కానీ చెడు కాదని, అయితే పోటీతత్వం ఆరోగ్యకరంగా ఉండాలేన కానీ సంఘర్షణలకు దారితీయరాదని చైనాతో సంబంధాలపై మోదీ అన్నారు. విభేదాలు వివాదాలు కారాదన్నారు. చర్చలకే తాము ఎక్కువ ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు.



## ఎట్టెట్టా.. గ్రహణాలు తారుమారు!

న్యూఢిల్లీ-నవభూమి:సూర్యుడికి, చంద్రుడికి మధ్య భూమి అడ్డుగా ఉంది కనుక భూమి నీడ చంద్రుడిపై పడి.. సంపూర్ణ చంద్రగ్రహణం సంభవించింది. కానీ...'బ్లూ ఘోస్ట్' ల్యాండర్ చంద్రుడిపై ఉంది. సూర్యుడికి భూమి అడ్డుగా రావడంతో ల్యాండరుకు సూర్యగ్రహణ దర్శన భాగ్యం కలిగింది. ఏదైనా చూసే చూపును బట్టి ఉంటుంది. దృష్టికోణాన్ని బట్టి ఉంటుంది గ్రహణం! అమెరికా కాలమానం ప్రకారం శనివారం తెల్లవారుజామున 2.25



గంటలకు సూర్యుడికి, చంద్రుడికి మధ్య భూమి రావడంతో.. చంద్ర గ్రహణం ఏర్పడింది. చంద్రుడిపైనున్న 'బ్లూ ఘోస్ట్' లూనార్ ల్యాండర్.. చంద్రుడికి, సూర్యుడికి మధ్య భూమి రావడంతో ఏర్పడ్డ సంపూర్ణ సూర్య గ్రహణ దృశ్యాలను చిత్రీకరించింది. అయితే.. చంద్రుడి నుంచి కనిపించే సూర్య గ్రహణాన్ని చిత్రీకరించడం ఇది మొదటిసారి కాదు. 1967లో 'సర్వేయర్-3' లూనార్ మిషన్ కూడా అనేక చిత్రాలను భూమికి పంపింది. కాగా.. తాజా చంద్ర గ్రహణం అమెరికా, ఆఫ్రికా, న్యూజిల్యాండ్, రష్యా, ఐరోపా దేశాల్లో కనిపించింది.


నవభూమి

www.navabhoomi.in
www.epaper.navabhoomi.in

3 హైదరాబాద్ సోమవారం 17 । మార్చి । 2025


## తెలంగాణ కులగణన విశ్లేషణలో ఫ్రాన్స్ ఆర్థికవేత్త ఎందుకు?



న్యూఢిల్లీ-నవభూమి: తెలంగాణలో చేపట్టిన కులగణన సమాచారాన్ని విశ్లేషించడానికి ఏర్పాటయిన నిపుణుల బృందంలో ఫ్రెంచి ఆర్థికశాస్త్రవేత్త థామస్ పికెట్టీని నియమించడాన్ని బీజేపీ తప్పుపట్టింది. కీలకమైన సామాజిక సమాచారాన్ని విదేశీయులకు ఎలా అందుబాటులో ఉంచుతారని ప్రశ్నించింది. బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి, రాజ్యసభ సభ్యుడు సుధాంశు త్రివేది శనివారం ఇక్కడ మాట్లాడుతూ దేశంలో చాలా మంది నిపుణులు ఉండగా, విదేశీ ఆర్థికశాస్త్రవేత్తను కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు నియమించిందని ప్రశ్నించారు. ఎంతోమంది భారతీయులు ఎన్నో విదేశీ సంస్థలకు ఆధిపత్యం వహిస్తుండగా, ఒక విదేశీయుడ్ని నియమించాల్సిన అవసరం ఏముందని అన్నారు. సుప్రీంకోర్టు రిటైర్డు జడ్జి ఆ?ధ్వర్యంలో ఏర్పాటయిన 11 మంది సభ్యుల కమిటీలో పికెట్టీ సభ్యుడిగా ఉన్నారు. ఆయన ఆర్థిక అసమానతలపై విస్తృతంగా పరిశోధనలు చేశారు. పన్నుల విధానంపై ఆయన చేసిన సూచనలు ఉద్యోగులు, మధ్యతరగతి వారికి హాని కలిగించేవిగా ఉన్నాయంటూ విమర్శలు వచ్చాయని త్రివేది గుర్తు చేశారు. భారత ఆర్థిక వ్యవస్థపై విమర్శలు చేస్తున్న విదేశీ శక్తులతో కాంగ్రెస్ చేతులు కలుపుతోందని ఆరోపించారు. దీనిపై వివరణ ఇవ్వాలని డిమాండు చేశారు. బీజేపీ నాయకుడు జీవీఎల్ నరసింహారావు మాట్లాడుతూ భారత్‌లో మంచేమీ లేదని చెప్పడం కాంగ్రెసకు అలవాటేనని వ్యాఖ్యానించారు. భారత్ సొంతంగా పరిపాలించుకోలేదు, సొంతంగా ఆలోచించుకోలేదు, సొంతంగా రక్షించుకోలేదన్నదే కాంగ్రెస్ ఉద్దేశమని విమర్శించారు. సున్నితమైన జనాభా సమాచారంపై విదేశీయులు వారి అవసరాలకు అనుగుణంగా తప్పుడు వ్యాఖ్యానాలు చేస్తే బా?ధ్యులు ఎవరని ప్రశ్నించారు.

## కేజ్రీవాల్ లాగే స్టాలిన్ కూడా జైలుకే



చెన్నై-నవభూమి: మద్యం అవినీతి కేసులో ఢిల్లీ మాజీ సీఎం కేజ్రీవాల్ బాటలోనే తమిళనాడు సీఎం స్టాలిన్ కూడా జైలుకెళ్తారని అన్నాడీఎంకె ఎంపీ తంబిదురై వ్యాఖ్యానించారు. తిరుపత్తూర్ జిల్లా జోలార్‌పేటలో శనివారం అన్నాడీఎంకె బూత్ కమిటీల నిర్వాహకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... టాస్మాక్‌లో రూ.1,000 కోట్లకు పైగా అవినీతి చోటుచేసుకుందని ఈడీ ప్రకటించిందని గుర్తు చేశారు. ఇప్పటికే 2జీ స్పెక్ట్రమ్ కేసులో డీఎంకే, కాంగ్రెస్ పార్టీలు అడ్రస్ లేకుండా పోయాయని తెలిపారు. మద్యం అవినీతి కేసులో ఆమ్ ఆద్మీకి చెందిన సిసోడియా, కేజ్రీవాల్ జైలు కెళ్లారని, ఆ కోవలోనే మంత్రి సెంథిల్ బాలాజీ, ఆ తర్వాత స్టాలిన్ జైలుకెళ్లడం ఖాయమన్నారు.

## 'నిర్బంధ హిందీ'పై మాట మార్చిన పవన్:కనిమొళి

చెన్నై- నవభూమి: జాతీయ విద్యా విధానాన్ని వ్యతిరేకిస్తున్న డీఎంకే నేతలపై పిఠాపురంలో ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలకు ఆ పార్టీ సీనియర్ నాయకురాలు కనిమొళి కౌంటర్ ఇచ్చారు. 2017లో ఆంధ్రజ్యోతి పత్రికలో చలసాని నరేంద్ర 'హిందీ గో బ్యాక్' పేరుతో రాసిన వ్యాస క్లిప్పింగును సామాజిక మాధ్యమాల్లో జత చేసి, 'ఉత్తర భారత రాజకీయ నాయకులు భారతదేశ సాంస్కృతిక వైవిధ్యాన్ని అర్థం చేసుకోవాలి, గౌరవించాలి' అని పవన్ కల్యాణ్ అప్పట్లో ఎక్స్‌లో పెట్టిన పోస్ట్‌ను కనిమొళి గుర్తు చేశారు. బీజేపీకి మద్దతు ఇవ్వక ముందు నిర్బంధ హిందీని వ్యతిరేకించి, బీజేపీతో చేతులు కలిపిన తర్వాత నిర్బంధ హిందీకి మద్దతుగా మాట్లాడుతున్నారంటూ కనిమొళి ఆరోపించారు.



## వ్యక్తి అంత్యక్రియలకు వెళ్తుండగా పడవ బోల్తా.. నదిలో మునిగి ముగ్గురు మృతి



లక్నో-నవభూమి:హోలీ సందర్భంగా నదిలో మునిగి ఒక వ్యక్తి మరణించాడు. అతడి అంత్యక్రియల కోసం పడవలో వెళ్తుండగా బోల్తాపడింది. ఈ ప్రమాదంలో నదిలో మునిగి ముగ్గురు వ్యక్తులు మరణించారు. మరి కొందరిని స్థానికులు రక్షించారు. ఉత్తరప్రదేశ్‌లోని సీతాపూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. రతన్‌గంజ్ గ్రామానికి చెందిన 22 ఏళ్ల దినేష్ గుప్తా శుక్రవారం హోలీ సందర్భంగా శారదా నదిలో మునిగి మరణించాడు.కాగా, శనివారం ఆ వ్యక్తి అంత్యక్రియల కోసం కుటుంబ సభ్యులు, బంధువులు రెండు పడవల్లో శారదా నదిని దాటేందుకు బయలుదేరారు. కొంత మంది కుటుంబ సభ్యులు, దినేష్ మృతదేహాన్ని తీసుకెళ్లిన పడవ ఒడ్డుకు చేరుకున్నది. అయితే 16 మంది వ్యక్తులు ఉన్న మరో పడవ నది మధ్యలో బోల్తాపడింది. స్పందించిన స్థానికులు పలువురిని కాపాడారు. అయితే ముగ్గురు వ్యక్తులు నదిలో మునిగి మరణించారు.మరోవైపు మృతులను 32 ఏళ్ల సంజయ్, 30 ఏళ్ల ఖుష్బూ, 13 ఏళ్ల కుంకుమ్‌గా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. నదిలో పడిన రెండేళ్ల చిన్నారిని రక్షించి చికిత్స తర్వాత ఇంటికి పంపినట్లు చెప్పారు. కాపాడిన మరో 12 మంది ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్నట్లు పోలీస్ అధికారి తెలిపారు. ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

## బీజేపీ నేత, పోలీస్ అధికారి మధ్య ఫైట్..

బెంగళూరు - నవభూమి:బీజేపీ నేత, పోలీస్ అధికారి మధ్య వాగ్వాదం ఘర్షణకు దారి తీసింది. దీంతో వారిద్దరూ ఫైట్ చేసుకున్నారు. చెంపలపై కొట్టుకున్నారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యిం ది. కర్ణాటకలోని చిత్రదుర్గ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. శుక్రవారం అర్ధరాత్రి వేళ దుర్గాడ సిరి హోటల్ రోడ్ వద్ద కొందరు వ్యక్తులు గుమిగూడారు.కాగా, వాహనంలో అటుగా వెళ్తున్న పోలీసులు వీరిని చూశారు. అక్కడి నుంచి వెళ్లిపోవాలని ఎస్ఐ గాడిలింగ గౌడర్ వారికి చెప్పారు. మధుగిరి బీజేపీ జిల్లా అధ్యక్షుడు హనుమంత గౌడ దీనిపై ఆగ్రహించారు. ఆ పోలీస్‌పై దుర్భాషలాడారు. చేయి చేసుకునేందుకు ప్రయత్నించిన బీజేపీ నేత చెంపపై ఆ పోలీస్ అధికారి కొట్టారు. హనుమంత గౌడ తిరిగి కొట్టగా వారి మధ్య గొడవ ముదిరింది.

## రన్యా రావుతో ఇద్దరు మంత్రులకు లింక్ ఉంది! బీజేపీ ఎమ్మెల్యే సంచలన స్టేట్‌మెంట్



న్యూఢిల్లీ-నవభూమి:విదేశాల నుంచి బంగారాన్ని అక్రమంగా రవాణా చేస్తున్నారనే ఆరోపణలతో నటి రన్యా రావు అరెస్ట్ అయిన విషయం తెలిసిందే. అయితే తాజా ఈ కేసు విషయంలో స్పందించిన బీజేపీ ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాల్ సంచలన స్టేట్‌మెంట్ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ.. సోమవారం సభలో మొత్తం కేసు గురించి మాట్లాడుతానని అన్నారు. రన్యా రావుతో పరిచయం ఉన్న ఇద్దరు మంత్రుల పేర్లను సభలో చెబుతాను. నేను ఇప్పుడు మీడియా ముందు దాని గురించి మాట్లాడను. ఆమెకు ప్రోటోకాల్ ఇచ్చిన వారి గురించి మేము సమాచారాన్ని సేకరించాం. వాళ్ళకి బంగారం ఎక్కడి నుంచి వచ్చింది? ఎవరి కోసం తెచ్చారో నాకు తెలుసు." అని యత్నాల్ అన్నారు.రన్యా కేసులో కేంద్ర కస్టమ్స్ అధికారులు కూడా తప్పులు చేశారని మంత్రి సంతోష్ లాడ్ ఆరోపించారు. ఈ అంశంపై యత్నాల్ స్పందిస్తూ, "ఎవరు తప్పు చేసినా, అది తప్పే" అని అన్నారు. కస్టమ్స్ అధికారులు తప్పు చేస్తే, మేం వారిని సమర్థించడం లేదు. రన్యాకు %ఖ×ూణదీ%(కర్ణాట ఇండస్ట్రియల్ ఏరియా డెవలప్‌మెంట్ బోర్డ్) 12 ఎకరాల భూమి ఇచ్చిన అంశంపై స్పందిస్తూ, మురుగేష్ నిరానీ స్వయంగా ఆ భూమిని తానే ఇచ్చానని అంగీకరించారు. అయితే డబ్బు చెల్లించకపోవడంతో దానిని రద్దు చేశారు. 12 ఎకరాల భూమికి ఎవరో డబ్బు చెల్లించడానికి ముందుకొచ్చారు. వాళ్ళు ఇవ్వలేదు. అందువల్ల, భూమి కేటాయింపును రద్దు చేసినట్లు ఆయన తెలిపారు.మరోవైపు కస్టడీలో తనను టార్చర్ చేస్తున్నారంటూ రన్యా రావు కోర్టుకు వెల్లడించిన విషయం తెలిసిందే. తెల్ల కాగితంపై తన సంతకాలు చేయించుకున్నారని ఆరోపించారు. కనీసం నిద్ర పోనివ్వకుండా, తిండి కూడా తిననివ్వడం లేదంటూ ఫిర్యాదు చేశాడు. కాగా, రన్యా రావు కేసు విషయంలో ఎయిర్ పోర్టులో ప్రోటోకాల్ ఉల్లంఘన వెనుక ఆమె సమితి తండ్రి, ఐపీఎస్ అధికారి రామచంద్రరావు ఉన్నట్లు ఆరోపణలు రావడంతో, ఆయన పాత్రపై విచారణ జరపాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. మరి ఈ గోల్డ్ స్మగ్లింగ్ కేసు ఎక్కడికి దారి తీస్తుందో? ఈ కేసుతో ఎంత మందికి లింకులు బయటపడతాయో చూడాలి.

## లష్కరే చీఫ్‌ను లక్ష్యంగా దాడి.. అబూ ఖతల్ ఖతం.. అజ్ఞాతంలోకి హఫీజ్ సయీద్!



జీలం-నవభూమి: పాకిస్తాన్‌లోని జీలం వద్ద జరిగిన కాల్పుల్లో ముంబై ఉగ్రవాద దాడుల సూత్రధారి హఫీజ్ సయీద్ గాయపడ్డాడు. అతన్ని రావల్పిండిలోని ఆర్మీ ఆసుపత్రిలో చేర్చారు. పాకిస్తాన్ ఆర్మీ కోర్ కమాండర్‌ను కలిసిన తర్వాత సయీద్ తిరిగి వస్తున్నాడు. గుర్తు తెలియని దుండగులు అతనిపై కాల్పులు జరిపారు. ఈ ఘటనలో సయీద్ మేనల్లుడు అబూ ఖతల్ ప్రాణాలు కోల్పోయాడు. నిజానికి, అబూ ఖతల్‌తో పాటు హఫీజ్ సయీద్ కూడా ప్రాణాలు కోల్పోయాడని కొన్ని మీడియాల్లో వార్తలు వచ్చాయి. కానీ అది నిజం కాదు. హఫీజ్ సయీద్ ఇంకా బతికే ఉన్నాడు. కాల్పుల్లో గాయపడిన హఫీజ్ చికిత్స పొందుతున్నట్లు తెలుస్తోంది.భారతదేశ మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది హఫీజ్ సయీద్ సహచరుడు అబూ ఖతల్ హత్యకు గురయ్యాడు. గుర్తు తెలియని దుండగులు ఆయనను కాల్చి చంపారు. అబూ ఖతల్ లష్కరే తోయిబా ఉగ్రవాద సంస్థలో ముఖ్యమైన సభ్యుడు. అతన్ని లష్కరే చీఫ్ హఫీజ్ సయీద్ కుడిభుజంగా పిలుస్తారు. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే ఈ దాడిలో హఫీజ్ సయీద్ బయటపడ్డాడు.

**అబూ ఖతల్ ఎవరు?**

జమ్మూ కాశ్మీర్ ప్రజలలో భారతదేశంపై ద్వేషాన్ని సృష్టించడమే లష్కరే తోయిబా ఉగ్రవాది నదీమ్ అలియాస్ అబూ ఖతల్ సింఘి పని. జమ్మూ కాశ్మీర్‌లో జరిగిన అనేక ఉగ్రవాద దాడులకు అతను ప్రధాన సూత్రధారి. 2023లో జరిగిన రాజౌరి ఉగ్రవాద దాడిలో ఆయన కీలక పాత్ర పోషించారు. ఈ కేసులో ఆయనపై ఎన్ఐఏ చార్జిషీట్ కూడా దాఖలు చేసింది. 2024 జూన్ 9న జమ్మూ కాశ్మీర్‌లోని శివ్ ఖోడి నుండి కాట్రాకు వెళ్తున్న బస్సుపై జరిగిన ఉగ్రవాద దాడిలో కూడా అబూ ఖతల్ పేరు తెరపైకి వచ్చింది. ఈ దాడిలో ఉగ్రవాదులు బస్సుపై కాల్పులు జరిపారు. బస్సుపై డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో అది గుంతలో పడిపోయింది. ఈ ఘటనలో 10 మంది మృతి చెందగా, 33 మంది గాయపడ్డారు.గత కొంత కాలంగా పాకిస్తాన్ లో భారతదేశ శత్రువులు వరుసగా ప్రాణాలు కోల్పోతున్నారు. అన్ని దాడులు ఒకే విధంగా జరుగుతున్నాయి. గుర్తు తెలియని దుండగులు పాకిస్తానీ ఉగ్రవాదులను లక్ష్యంగా చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో గత కొంతకాలంగా హఫీజ్ సయీద్ అజ్ఞాతంలోకి వెళ్తున్నట్లు వార్తలు వస్తున్నాయి.

**మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్ట్ హఫీజ్ సయీద్**

అబూ ఖతల్ తన మేనమామ హఫీజ్ సయీద్ ఆదేశాల మేరకు అన్ని ఉగ్రవాద కార్యకలాపాలను నిర్వహించేవాడు. ముంబైలో జరిగిన 26/11 దాడికి హఫీజ్ సయీద్ ప్రధాన సూత్రధారి. అతను భారతదేశ మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదుల జాబితాలో నంబర్ వన్ స్థానంలో ఉన్నాడు. 2008 నవంబర్ 26న ముంబైలో జరిగిన ఉగ్రవాద దాడికి హఫీజ్ సయీద్‌ను ప్రధాన సూత్రధారిగా భావిస్తారు. ఈ దాడిలో 160 మందికి పైగా మరణించారు. 2006 ముంబై రైలు పేలుళ్లలో హఫీజ్ సయీద్ పాత్ర ఉంది. 2001లో సయీద్ భారత పార్లమెంటును కూడా లక్ష్యంగా చేసుకున్నాడు. అతను మోస్ట్ వాంటెడ్ జాబితాలో ఉన్నాడు. ముంబై దాడుల తర్వాత, అతన్ని అప్పగించాలని భారతదేశం పాకిస్తాన్‌ను కోరింది. కానీ పాకిస్తాన్ అతన్ని ఉగ్రవాదిగా అంగీకరించడానికి నిరాకరిస్తోంది.

## భార్య తల నరికి.. బ్యాగులో పెట్టుకొని..!



ముంబై-నవభూమి: కొన్ని హత్యలు జరిగిన తీరు వింటుంటేనే భయం పుడుతుంది. ఈ మధ్య కాలంలో హత్యలు జరిగే తీరు అత్యంత క్రూరంగా, భయంకరంగా ఉంటున్నాయి. తాజాగా అలాంటిదో మరో హత్య జరిగింది. ఓ వ్యక్తి తన భార్యను అత్యంత కిరాతంగా హత్య చేసి.. తలా మొండెం వేరే చేశాడు. తలను ఓ బ్యాగులో ప్యాక్ చేసి ఓ దర్గా దగ్గర పెట్టాడు. ఈ దారుణ ఘటన మహారాష్ట్రంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. ముంబై పరిసరాల్లో వన్‌గ్రామ్ గోల్డ్ ఆభరణాల తయారీ పరిశ్రమలో పనిచేసే హిప్పర్గి, తన భార్య ఉత్పల(51), వారి 22 ఏళ్ల కుమారుడితో కలిసి నివసించాడు. ఈ జంటకు తరచుగా గొడవలు జరిగేవని, అందుకు కారణం వారి కుమారుడు.నిజానికి ఉత్పలకు గతంలోనే ఓసారి వివాహం జరిగింది. అప్పుడు జన్మించిన కుమారుడే ఇప్పుడు వీరితో ఉంటున్నాడు. అతని విషయంలో జనవరి 8న మరోసారి గొడవ జరిగింది. ఆ సమయంలో విచక్షణ కోల్పోయిన హిప్పర్గి, ఉత్పలను గొంతు కోసి చంపాడు. నేరాన్ని దాచడానికి, ఆమె మృతదేహాన్ని విరార్ ఈస్ట్‌కు తీసుకెళ్లాడు. అక్కడ గొడ్డలితో ఆమె తలను మొండెం వేరు చేశాడు. ఆ తర్వాత నిందితుడు మొండెంను కాలువలోకి విసిరేశాడని, తెగిపోయిన తలను ట్రావెల్ బ్యాగ్‌లో ప్యాక్ చేసి పీర్కొండ దర్గా సమీపంలో వదిలేశాడని పోలీసులు తెలిపారు. ఉత్పల పశ్చిమ బెంగాల్‌లోని తన స్వస్థలానికి వెళ్లిందని, ఆమె కుమారుడికి అబద్ధం చెప్పాడు. అయితే, శుక్రవారం పోలీసు అధికారులు విరార్‌లో ఓ ట్రావెల్ బ్యాగ్‌ను గుర్తించారు. అందులో ఓ పుర్రెను చూసి షాక్ అయ్యారు. విచారణ జరపగా.. ఆ బ్యాగ్‌లో ఉంది ఓ మహిళ పుర్రె అని, హత్య జరిగి దాదాపు రెండు నెలలు అయి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. విచారణ చేపట్టగా.. ఆ బ్యాగ్ బెంగాల్‌లోని ఓ నగల దుకాణానికి చెందిందని గుర్తించారు. అక్కడి వెళ్లి విచారించగా.. కస్టమర్ లిస్ట్‌లో ఉత్పల పేరు ఉంది. ఆ పేరుతో ఒక్క దర్యాప్తు చేపట్టడంతో నేరం బయటపడింది. తదుపరి దర్యాప్తులో భాగంగా ఉత్పల ఫోన్ గత రెండు నెలలుగా స్విచ్ ఆఫ్‌లో ఉందని తేలింది. హిప్పార్గి కూడా అజ్ఞాతంలోకి వెళ్లి పోయాడు. అనేక ఆధారాలను వెతికిన తర్వాత, పోలీసులు అతన్ని నలసోపారాలోని రహమత్ నగర్‌లో గుర్తించి శుక్రవారం రాత్రి అరెస్టు చేశారు. హత్య దర్యాప్తు కొనసాగుతుండగా, అధికారులు ఇప్పుడు ఉత్పల శరీరం కోసం వెతుకుతున్నారు.

## డ్రైవర్‌కు గుండెపోటు.. వాహనాలపైకి దూసుకెళ్లిన కారు..

న్యూఢిల్లీ-నవభూమి: కారు డ్రైవర్ ఘోర ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పోయాడు.. అదుపుతప్పిన కారు దాదాపు పది వాహనాలను ఢీకొట్టింది. కారు డ్రైవర్ కు గుండెపోటు వచ్చిందని, ఆ తర్వాత అతను కారుపై నియంత్రణ కోల్పోయాడని, ప్రమాదం జరిగిందని చెబుతున్నారు. ఈ ప్రమాదానికి సంబంధించిన షాకింగ్ వీడియో ఇంటర్‌నెట్‌లో హల్‌చల్ చేసింది.వాహనాలపైకి దూసుకెళ్లిన కారు.. షాకింగ్ డ్రైవింగ్ సమయంలో ఓ కారు డ్రైవర్ గుండెపోటుకు గురయ్యాడు. దీంతో కారు అదుపుతప్పి వాహనాలపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఓ వ్యక్తి మరణించాడు. రోడ్డు పక్కన ఆగి ఉన్న ద్విచక్ర వాహనాలు, రిక్షాలు సహా తొమ్మిది వాహనాలను వేగంగా వస్తున్న కారు ఢీకొట్టడంతో ఘోర ప్రమాదం జరిగింది. ఈ ఘటన కర్ణాటక జిల్లాలోని కలబురగిలో చోటు చేసుకుంది. ఈ ప్రమాదానికి సంబంధించిన షాకింగ్ వీడియో ఒకటి వెలుగులోకి వచ్చింది.మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో ఒక విషాద ఘటన చోటు చేసుకుంది. ఇందులో కారు డ్రైవర్ ఘోర ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పోయాడు.. అదుపుతప్పిన కారు దాదాపు పది వాహనాలను ఢీకొట్టింది. కారు డ్రైవర్ కు గుండెపోటు వచ్చిందని, ఆ తర్వాత అతను కారుపై నియంత్రణ కోల్పోయాడని, ప్రమాదం



జరిగిందని చెబుతున్నారు. ఈ ప్రమాదానికి సంబంధించిన షాకింగ్ వీడియో ఇంటర్‌నెట్‌లో హల్‌చల్ చేసింది.నివేదికల ప్రకారం, ధీరజ్ పాటిల్ (55) మోరిస్ గ్యారేజ్ విండ్సర్ కారును నడుపుతుండగా, ఫ్లైఓవర్ దగ్గర అదుపు తప్పిన కారు ఆటోరిక్షా, కారు, ద్విచక్ర వాహనం, అనేక ఇతర వాహనాలను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కారుతో సహా అనేక వాహనాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి.

కారు డ్రైవర్ ధీరజ్ పాటిల్ మరణించాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్ట్‌మార్టం కోసం పంపగా, ధీరజ్ గుండెపోటు కారణంగా మరణించాడని తేలింది. అతను పనికి వెళు తున్నప్పుడు ఈ ప్రమాదం జరిగిందని తెలిసింది. ఈ సంఘటన మొత్తం రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన సీసీటీవీలో రికార్డైంది.

### మార్ఫింగ్ ఫొటోలతో బెదిరించి.. టెన్త్ విద్యార్థినిపై తోటి విద్యార్థి లైంగిక దాడి

రాయదుర్గం-నవభూమి:తనతో పాటు చదువుతోన్న బాలిక ఫొటోలను సేకరించిన తోటి విద్యార్థి పథకం ప్రకారం ఆ ఫొటోలను అశ్లీల చిత్రాలుగా మార్ఫింగ్ చేశాడు. అనంతరం వాటిని ఆ బాలికకు చూపించి తాను చెప్పినట్లు వినకపోతే సామాజిక మాధ్యమాల్లో పెడతానని బెదిరించి ఆమెను లోబర్చుకొని లైంగిక దాడికి పాల్పడ్డాడు. వారు ఏకాంతంగా ఉన్న సమయంలో వీడియో తీసిన మరో ఇద్దరు విద్యార్థులు బాలికకు ఆ వీడియో చూపించి లైంగికంగా వేధించసాగారు. బాలిక తల్లి దండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఓ పాఠశాలలో 10వ తరగతి చదువుతోన్న బాలుడు అదే తరగతిలోని ఓ బాలికతో స్నేహంగా ఉండేవాడు.ఈ క్రమంలో బాలిక ఫొటోలను సేకరించిన అతడు వాటిని మార్ఫింగ్ చేసి అశ్లీల చిత్రాలుగా మార్చాడు. వాటిని బాలికకు చూపించి తాను చెప్పినట్లు వినాలని లేదంటే ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేస్తానని బెదిరించి ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. వారు ఏకాంతంగా ఉన్న సమయంలో మరో విద్యార్థి వీడియో తీసి దాన్ని తన స్నేహితుడికి పంపాడు. అనంతరం ఆ వీడియోను బాలికకు చూపించి వారిరువురూ బాలికను వేధించసాగారు.

## ఆధార్-ఓటర్ ఐడీ అనుసంధానంపై సీఈసీ కీలక నిర్ణయం..



న్యూఢిల్లీ-నవభూమి:ఆధార్ కార్డుకు ఓటర్ ఐడీని అనుసంధానం చేసే దిశంగా సీఈసీ చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఓటరు ఐడీల్లో అవకతవకలు జరుగుతన్నాయని ఇటీవల అనేక ఆరోపణలు వస్తున్న విషయం తెలిసిందే. నకిలీ ఓటరు జాబితా ద్వారా బీజేపీ.. మహారాష్ట్ర, ఢిల్లీ వంటి రాష్ట్రాల్లో గెలిచిందంటూ టీఎంసీ ఇటీవల ఆరోపించిన విషయం కూడా తెలిసిందే. ఈ నేపథ్యంలో ఓటరు కార్డును.. ఆధార్ కార్డుతో అనుసంధానం చేసే అంశంపై కేంద్ర హోంశాఖ కార్యదర్శి, లెజిస్లేటివ్ సెక్రటరీతో పాటూ యూఐడీఏఐ సీఈవోతో భారత ప్రధాన ఎన్నికల అధికారి జ్ఞానేశ్ కుమాంభేటీ కానున్నట్లు తెలుస్తోంది.ఎలక్టోరల్ డేటాలో ఎలాంటి అక్రమాలు జరగకుండా ఉండేందుకు ఈ చర్యలు తీసుకోనున్నట్లు తెలుస్తోంది. వివిధ శాఖల అధికారులతో సీఈసీ మంగళవారం సమావేశం అవనున్నారని ఆ శాఖ వర్గాలు తెలిపారు. సుమారు 25 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఓటర్ ఐడీ కార్డు డూప్లికేట్ సమస్యకు మూడు నెలల్లో చెక్ పెట్టేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలుస్తోంది. ఈ అంశంపై ఏప్రిల్ 30లోగా అన్ని జాతీయ, రాష్ట్రాలకు చెందిన పార్టీల నుంచి కూడా సూచనలు కోరతారని చెబుతున్నారు. అదేవిధంగా దీనిపై బూత్ స్థాయి ఏజెంట్లు, పోలింగ్, కౌంటింగ్ ఏజెంట్లతో పాటూ ఎన్నికల ఏజెంట్లకు శిక్షణ ఇవ్వనున్నట్లు సీఈసీ వర్గాలు తెలిపాయి.ఓటర్ల జాబితాను ఆధార్ డేటాబేస్‌తో అనుసంధానించేందుకు చట్టం అనుమతిస్తోందని అధికారులు చెబుతున్నారు. ఓటర్ కార్డును ఆధార్‌తో ఆనుసంధానం చేసే అంశంపై ఎలాంటి గడువూ నిర్దేశించలేదని ప్రభుత్వం పార్లమెంట్‌లో తెలిపింది. అదేవిధంగా ఓటరు జాబితాలతో తమ ఆధార్ వివరాలను అనుసంధానించని వారి పేర్లను ఓటర్ జాబితా నుంచి తొలగించరని కూడా ప్రభుత్వం పేర్కొంది.

## దుస్తులే దొరికాయి.. సుదీక్ష జాడలేదు



న్యూఢిల్లీ-నవభూమి:డొమినికన్ రిపబ్లిక్‌లో అదృశ్య మైన భారత సంతతి విద్యార్థిని సుదీక్ష కోణంకి కేసు రోజుకో మలుపు తిరుగుతోంది. మార్చి 6వ తేదీ నుంచి కనిపించకుండా పోయిన సుదీక్ష ఆచూకీ ఇప్పటికీ మిస్టరీగానే ఉండగా తాజాగా బీచ్ వద్ద ఆమె దుస్తులు లభ్యం కావడం కలకలం రేపుతోంది. పోలీసులు ఆమె కోసం విస్తృతంగా గాలిస్తుండగా, బీచ్‌లోని లాంజ్ కుర్చీలో సుదీక్ష దుస్తులు ఉన్నట్లు కొన్ని దృశ్యాలు తాజాగా వెలుగులోకి వచ్చాయి. స్థానిక మీడియా కథనాల ప్రకారం.. సుదీక్ష దుస్తులు కొంతమేర మట్టిలో కూరుకుపోయి ఉన్నాయి. ఆమె నీటిలోకి వెళ్లే ముందు వాటిని అక్కడ వదిలి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. చివరిసారిగా సుదీక్ష ధరించిన దుస్తులు ఇవేనని భావిస్తున్నారు. వర్జీనియాకు చెందిన 20 ఏళ్ల సుదీక్ష కోణంకి, మరో ఐదుగురు స్నేహితురాళ్లతో కలిసి డొమినికన్ రిపబ్లిక్‌లోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన ప్యూంటా కానాకు విహారయాత్రకు వెళ్లింది. మార్చి 6న స్థానిక రియూ రిపబ్లికా రిసార్ట్ బీచ్ వద్ద ఆమె చివరిసారిగా కనిపించింది. ఆ తర్వాత తన గదికి తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన స్నేహితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి పోలీసులు ఆమె కోసం తీవ్రంగా గాలిస్తున్నారు. పోలీసులు సీసీటీవీ దృశ్యాలను క్షుణ్ణంగా పరిశీలించారు. మార్చి 6వ తేదీ తెల్లవారుజామున 3 గంటల వరకు సుదీక్ష తన స్నేహితులతో కలిసి రిసార్ట్‌లో జరిగిన పార్టీలో పాల్గొన్నట్లు గుర్తించారు. ఆ తర్వాత ఆమె ఐయోవాకు చెందిన 24 ఏళ్ల టూరిస్ట్ జాషువా స్టీవెన్ రిబెతో కలిసి బీచ్‌కు వెళ్లినట్లు పోలీసులు కనుగొన్నారు. దీంతో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా అతను పొంతన లేని సమాధానాలు చెబుతున్నట్లు సమాచారం. ఈ కేసులో కొత్త కోణాన్ని వెలుగులోకి తెస్తూ, సుదీక్ష తల్లిదండ్రులు తమ కుమార్తెను ఎవరైనా కిడ్నాప్ చేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ దిశగా కూడా దర్యాప్తు చేపట్టాలని వారు పోలీసులను అభ్యర్థించారు. ఈ నేపథ్యంలోనే బీచ్ వద్ద సుదీక్ష దుస్తులు కనిపించడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఆమె ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయిందా? లేక కిడ్నాప్ నకు గురైందా? అనే ప్రశ్నలు ఇప్పుడు అందరినీ వెంటాడుతున్నాయి. సుదీక్ష దుస్తులు లభ్యం కావడంతో పోలీసులు మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఆ దుస్తులను ఫోరెన్సిక్ పరీక్షల కోసం పంపే అవకాశం ఉంది. జాషువా స్టీవెన్ రిబెను మరింత లోతుగా విచారించే అవకాశం కూడా ఉంది. సుదీక్ష ఆచూకీ కోసం పోలీసులు అన్ని కోణాల్లోనూ ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఈ కేసు ఎప్పుడు కొలిక్కి వస్తుందో వేచి చూడాలి.

## క్షణాల్లో డూప్లికేట్ కీస్..ఔరా అనిపిస్తున్న వెండింగ్ మెషీన్

న్యూఢిల్లీ-నవభూమి: డూప్లికేట్ తాళం చెవి తయారు చేయించుకోవాలంటే ఎంత ప్రయాస పడాలో అందరికీ ఎప్పుడో ఒకప్పుడు అనుభవంలోకి వచ్చే ఉంటుంది. అయితే డూప్లికేట్ తాళం చెవిని క్షణాల్లో తయారు చేసే ఓ మెషీన్ గురించి సామాజిక మాధ్యమాల్లో ప్రత్యక్షమైన ఓ వీడియో నెటిజన్లను షాక్‌కు గురిచేయడమే కాదు ఔరా అనిపిస్తోంది.
ఏటీఎం లా ఉన్న వెండింగ్ మెషీన్ వీడియోని




అమెరికాలో నివసించే తన్వీర్ షేక్ అనే వ్యక్తి ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. ఎటువంటి తాళం చెవినైనా చిటికెలో తయారుచేయడం ఈ మెషీన్ ప్రత్యేకత. ఇంటి తాళం చెవులతోపాటు, వాహనాలు, బీరువాల కీస్, యాక్సెస్ కార్డులను కూడా తయారు చేయగలదు ఈ వెండింగ్ మెషీన్. ప్రత్యేకంగా తాళం చెవులను తయారుచేసే విధంగా ఈ మెషీన్‌ను డిజైన్ చేశారు.



## ఇది ఇంటర్వెల్ మాత్రమే: సీఎం రేవంత్ రెడ్డి

తెలంగాణ అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై కేసీఆర్ ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. పదేళ్లలో రూ.7 లక్షల కోట్ల అప్పులు చేశారని, కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతిని ఆరోపించారు. మామునూరు ఎయిర్‌పోర్టు ప్రారంభం, వరంగల్ అభివృద్ధికి రూ.6000 కోట్ల పథకం గురించి ప్రకటించారు. హరీష్ రావు తో వాగ్వాదంలో, కాంగ్రెస్ సాగునీటి ప్రాజెక్టులపై సవాల్ విసిరారు.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై అసెంబ్లీలో ఇప్పటి వరకు చెప్పింది ఇంటర్వెల్ మాత్రమే.. మిగతా సినిమా తర్వాత చూపిస్తా అని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం మామునూరు ఎయిర్‌పోర్ట్ తీసుకొచ్చామన్నారు సీఎం రేవంత్. వరంగల్ అభివృద్ధి కోసం రూ.6 వేల కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నామని ప్రకటించారు. ధనిక రాష్ట్రాన్ని కేసీఆర్ అప్పుల పాలు చేశారని సీఎం రేవంత్ విమర్శించారు. పదేళ్లలో కేసీఆర్ 7లక్షల కోట్ల అప్పులు చేశారని వారు చేసిన అప్పులలో కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష 53 వేల కోట్లు చెల్లించిందని వివరించారు.

తెలంగాణలో కాంగ్రెస్ సాగునీటి ప్రాజెక్టులు కట్టలేదన్న హరీష్ రావుకు సీఎం రేవంత్ సవాల్ విసిరారు. కేసీఆర్ లక్ష కోట్లు పెట్టి కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు మూడేళ్లలోనే కూలిపోయిందని, అది కాళేశ్వరం కాదు కూలేశ్వరం అని ఎద్దేవా చేశారు. కేసీఆర్ రోజా ఇంట్లో రొయ్యల పులుసు తిని, ఏపీ కృష్ణా జలాలను తరలించుకుపోతుంటే పట్టించుకోలేదని సీఎం రేవంత్ ఆరోపించారు. అసెంబ్లీకి రాని కేసీఆర్‌కు రూ.58 లక్షల జీతం, పోలీసుల పహారా ఎందుకని సీఎం రేవంత్ ప్రశ్నించారు.

సోషల్ మీడియాలో ఇష్టానుసారం పోస్టులు పెట్టే సంస్కృతి పెరిగిపోతోందని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఇలాంటి వారి విషయంలో సీరియస్‌గానే యాక్షన్ తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ప్రజాప్రతినిధులు తప్పులు చేస్తే.. వారిని ప్రశ్నించడం వరకు పరిమితం కావాలని, కానీ, వారి ఇంట్లో ఆడవాళ్లు ఏం తప్పులు చేశారని వారిపై నెగిటివ్ కామెంట్లు చేస్తున్నారని ఆయన నిలదీశారు. అసెంబ్లీలో సుదీర్ఘంగా మాట్లాడిన రేవంత్‌రెడ్డి.. సోషల్ మీడియాలో వస్తున్న కామెంట్లపై స్పందించారు.

"నేను ప్రజాజీవితంలో ఉన్నా. నన్ను విమర్శించండి. కానీ, నా భార్య, నా బిడ్డ ఏం చేసిన్రు? వారిని ఎందుకు తిట్టాలి. అది కూడా బండ బూతులతోనా? ఇలాంటి వారు సమాజానికి ఏం సందేశం ఇస్తున్నారు. వీరు ఏం జర్నలిస్టులు? ఎవరో ముక్కు మొహం తెలియని వారు ఒక యూట్యూబ్ ఛానెల్ పెట్టి ఇష్టాను సారం కామెంట్లు చేస్తే.. అది ఏం జర్నలిజం? వారు ఎలాంటి జర్నలిస్టులు?" అని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. ఇలాంటి కామెంట్లు చదివినా.. విన్నా అన్నం కూడా తినాలని అనిపించడం లేదన్నారు.

"ఈ కామెంట్లు చేసిన వారికి ఒక్కటే చెబుతున్నా.. ఒక్కసారి నా పేరు తీసేసి మీరు మీ పేరు పెట్టుకోండి. అప్పుడు ఏమనిపిస్తుందో చూడండి" అని వ్యాఖ్యానించారు. భూభారతి పేరుతో తనపై వస్తున్న కామెంట్లు చదివేందుకు కూడా మనస్కరించడం లేదని అన్నారు. ఇలాంటి వారికి తోలు తీస్తానని అసెంబ్లీ సాక్షిగా హెచ్చరిస్తున్నట్టు సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. భూభారతి పేరుతో పేదల భూములను వారికే చెందేలా చేస్తున్న తన ప్రయత్నం తప్పా? అని ప్రశ్నించారు. దీనిని అడ్డు పెట్టుకుని తమపై విమర్శలు చేయిస్తారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పెయిడ్ ఆర్టిస్టులతో చేయిస్తున్న ఇలాంటి వీడియోలు అత్యంత దారుణంగా ఉంటున్నాయని సీఎం చెప్పారు. ఇలాంటివి చేయడానికి అసలు మనసు ఎలా వస్తోందని నిలదీశారు. సమస్యలు ఉంటే ఉండొచ్చునని.. వాటిని హ్యాండిల్ చేయాల్సిన తీరు మాత్రం ఇలా కాదన్నారు. "ఇంతలేసి మాటలు మీ నోటికి ఎలా వస్తున్నాయి. మీరు మనుషులేనా? మీకు భార్య, పిల్లలు లేరా?" అని ప్రశ్నించారు. ఇలాంటి వాటిని చూస్తూ ఊరుకునేది లేదని స్పష్టం చేశారు.

సోషల్ మీడియాలో తన కుటుంబ సభ్యుల పట్ల దారుణమైన రీతిలో పోస్టులు పెడుతున్నారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ధ్వజమెత్తారు. పెయిడ్ ఆర్టిస్టులతో మాట్లాడించి విమర్శిస్తున్నారని బీఆర్ఎస్ నేతలపై మండిపడ్డారు. జర్నలిస్టుల ముసుగులో అసాంఘిక భాష వాడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఆడబిడ్డల గురించి అసభ్యంగా పోస్టులు పెట్టేవాళ్లు జర్నలిస్టులా? అని ప్రశ్నించారు. హద్దులు దాటి నోరు జారితే ఫలితం మరోలా ఉంటుందని స్పష్టం చేశారు. జర్నలిస్టులకు విధి విధానాలు నిర్ణయిస్తామని అన్నారు. "ఐ అండ్ పీఆర్ లేదా డీఏవీపీ ఆమోదించిన పత్రికలు, ప్రసార సాధనాల వాళ్లు ఇచ్చిన ఐడీ కార్డులు ఉన్నవాళ్లు జర్నలిస్టులా, లేక, ఎవడు పడితే వాడు ఏదో ఒక టీవీ, యూట్యూబ్ చానల్ పెట్టుకుని నోటికొచ్చినట్టు మాట్లాడేవాళ్లు జర్నలిస్టులా? మమ్మల్ని ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారు. ప్రజా జీవితంలో ఉన్నాం కాబట్టి ఓపిక పడుతున్నాం... ఆ భాష వింటుంటే రక్తం మరుగుతోంది.

కుటుంబ సభ్యులను అంతేసి మాటలు అంటుంటే... మీరసలు మనుషులే అని వాళ్లను అడుగుతున్నా. మీకు భార్యాబిడ్డలు లేరా? తల్లిదండ్రులు లేరా? ట్విట్టర్ లో తప్పుడు వ్యాఖ్యలతో పోస్టులు పెడుతున్న వాళ్లను అరెస్ట్ చేస్తే, ఆ అరెస్టులను ఖండిస్తున్నారు... మీ అమ్మనో, మీ భార్యనో, మీ చెల్లినో ఈ రకంగా మాట్లాడితే నువ్వు వింటావా? అని ఆ అరెస్టులను ఖండించే వారిని ప్రశ్నిస్తున్నా.

నా భార్యను, నా బిడ్డను మాట్లాడుతుంటే నాకు నొప్పి కలుగుతుంది కానీ... ఓ ఆడపిల్లను అవమానిస్తుంటే నీకు నొప్పి కలగదా? ఏ సంస్కృతిలో ఉన్నావు నువ్వు? ముఖ్యమంత్రిగా చెబుతున్నా... తోలు తీస్తా ఒక్కొక్కడికీ! బట్టలు విప్పదీసి రోడ్డు మీద తిప్పిస్తా!

రాజకీయాల్లో ఉన్నది నేను.. నా గురించి మాట్లాడండి, విమర్శించండి, విశ్లేషించండి... ఇంట్లో ఉన్న ఆడవాళ్లను గురించి మాట్లాడే సంస్కృతి ఎక్కడ్నించి వచ్చింది? ఈ విధంగా తెలంగాణ సంస్కృతిని విషపూరితం చేస్తున్నారు... నోటికొచ్చింది మాట్లాడి వాటిని పోస్టులుగా పెట్టించి పైశాచిక ఆనందం పొందుతున్నారు. వాళ్లు తిట్టిన తిట్లకు అక్కడ నా పేరు తీసేసి మీ పేరు రాసుకోండి... మీకు అన్నం తినబుద్ధి అవుతుందేమో చూస్తా!

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి అంటే అంత బలహీనుడు అనుకుంటున్నారా? ఇన్నాళ్లు ఓపిక పట్టాను కాబట్టి సరిపోయింది... మీకెంతమంది ఉన్నారో తెలియదు... నాకు చికాకు కలిగిందని తెలిస్తే లక్షలాది మంది పిల్లలు రోడ్డు మీదికి వచ్చి ఒక్కొక్కరిని బట్టలిప్పదీసి కొడతారు. నేను వద్దంటున్నాను కాబట్టి వారు ఆగుతున్నారు.

చట్టాల పట్ల, శాసనాల పట్ల, భారత రాజ్యాంగం పట్ల సంపూర్ణ విశ్వాసం ఉంది కాబట్టి సంయమనం పాటిస్తున్నా... అంతే తప్ప మాకు చేతకాక కాదు. చంద్రశేఖర్ రావు గారూ... మీ పిల్లలకు చెప్పు... ఇది మంచిది కాదు... ఇలా ఏదో చేసి మానసికంగా కుంగదీసి, దెబ్బతీసి రాజకీయంగా ప్రయోజనం పొందుదామని అనుకుంటున్నావేమో!... అలా అని కలలు కంటున్నావేమో... ఇక కుదరదు చంద్రశేఖర్ రావ్! హద్దు దాటినా, మాట జారినా దాని ఫలితం అనుభవిస్తారు" అంటూ రేవంత్ రెడ్డి ఘాటుగా వార్నింగ్ ఇచ్చారు.

# భానుడి భగభగలు - వేసవి ప్రారంభంలోనే !



భానుడి ప్రతాపానికి బెంబేలెత్తుతున్న తెలుగు రాష్ట్రాల ప్రజలు...
మార్చిలోనే ఇలా ఉంటే మే వచ్చేసరికి సూర్యని ప్రతాపం తారాస్థాయికి .. ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహిస్తే అంతే సంగతులు..

రెండు తెలుగు రాష్ట్రాలలో వేసవి కాలం మొదటిలోనే ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదు అవుతున్నాయి , మార్చిలోనే ఇలా వుంటే ముందు ముందు ఇంకా ఎండలు తారాస్థాయికి చేరే అవకాశం ఉంది..దీంతో మే నెలలో వేసవిని ఎలా ఎదుర్కోవాలన్న భయాందోళన ప్రజలను వెంటాడోతుంది. గత ఏడాది ఇదే సమయంలో గరిష్ట ఉష్ణోగ్రతలు 41 డిగ్రీలకు మించలేదు. అయితే ప్రస్తుతం గరిష్ట ఉష్ణోగ్రత 43 డిగ్రీలు నమోదైంది. దీంతో ఇంట్లోంచి బయటకి రావాలంటే జనం భయపడిపోతున్నారు. ఇళ్లలో కూడా ఉక్కపోతకు గురవుతున్నారు. ఎండ తీవ్రత సాయంత్రం 6 గంటల వరకు కొనసాగుతుండటంతో రోడ్లపై జనం పలచబడుతున్నారు. రోజువారి పనులు సైతం కొందరు ప్రజలు ఉదయమే వీలైనంత త్వరగా పనులు పూర్తి చేసుకుని ఇళ్లకు పరిమితమవుతున్నారు.

వేసవిలో పెరుగుతున్న ఉష్ణోగ్రతల వల్ల వడదెబ్బ, వ్యాధులు, వాటి లక్షణాలు, నివా రణ పై అప్రమత్తంగా ఉండాలి. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రాణాంతకంగా మారవచ్చు. పరిస్థితికి అనుగుణంగా ఆహారం, తాగునీరు తీసుకోవాలి. వడదెబ్బ బారిన పడకుండా పలు జాగ్రత్తలు తీసుకోవాలి...

ఎండ తీవ్రంగా ఉన్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు
- ఎండ ఎక్కువగా ఉన్న రోజుల్లో గొడుగు తప్పనిసరిగా వాడాలి
- దూదితో నేయబడిన తెలుపు / లేత రంగు గల పలుచటి. వస్త్రాలను ధరించాలి.

తల పై టోపి లేదా రుమాలు పెట్టుకోవాలి.
ఎండ ఎక్కువగా ఉన్నప్పుడు నీరు ఎక్కువగా సేవించాలి.
- ఉప్పు కలిపిన మజ్జిగ / చిటికెడు ఉప్పు కలిపిన



గ్లూకోజు నీరు / ఓరల్ రీహైడ్రేషన్ ద్రావణము త్రాగవచ్చును.
- వడదెబ్బకు గురైన వారిని శీతల ప్రాంతానికి వెంటనే చేర్చాలి.
- వడదెబ్బకు గురైన వారివి చల్లని నీటిలో ముంచిన తడిగుడ్డతో శరీరం అంతా తుడుస్తూ ఉండాలి. శరీర ఉష్ణోగ్రత 101 డిగ్రీల కంటే తక్కువ స్థాయికి వచ్చేవరకు ఈ విధంగా శరీరాన్ని తుడుస్తూ ఉండాలి. ఫ్యాన్ క్రింద ఉంచాలి.
- వడదెబ్బకు గురైన వారి ఆరోగ్య పరిస్థితిలో ఆశించిన మార్పు లేనిచో శీతల వాతావరణంలో దగ్గర్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించాలి.

లిఎండ తీవ్రంగా ఉన్నప్పుడు చేయకూడనివి.లి
- సూర్య కిరణాలకు, వేడి గాలికి ఎక్కువ గురి కాకూడదు.
- వేడిగా ఉన్న సూర్యకాంతిలో గొడుగు లేకుండా తిరగరాదు.
- వేసవిలో నలుపు/ముదురు రంగు దుస్తులు మందంగా ఉండే దుస్తులు ధరించరాదు.
- నెత్తిన టోపీ లేక రుమాలు లేకుండా సూర్యకాంతిలో తిరగరాదు.
- వడదెబ్బకు గురైన వారిని వేడినీటిలో ముంచిన గుడ్డతో తుడవరాదు.
- దగ్గర్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చేర్చుటలో ఏ మాత్రం ఆలస్యం చేయరాదు.

వేసవి కాలంలో ఉష్ణోగ్రతలు పెరగడంతో పలు రకాల ఆరోగ్య సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. దాహం, డీహైడ్రేషన్, వడదెబ్బ, జీర్ణ సమస్యలు, చర్మ వ్యాధులు వంటి సమస్యలు వేడికి సంబంధించిన ప్రతికూల ప్రభావాలుగా కనిపిస్తాయి.

లివేసవి కాలంలో ఎక్కువగా వచ్చే ఆరోగ్య సమస్యలు

**డీహైడ్రేషన్ వడదెబ్బ :**
అధిక ఉష్ణోగ్రతల వల్ల శరీరంలో నీటి శాతం తగ్గిపోతుంది, దాంతో శరీరానికి అవసరమైన ఎలక్ట్రోలైట్స్ లోపించి వడదెబ్బ వచ్చే అవకాశం ఉంటుంది.ఎండలో ఎక్కువసేపు ఉన్నప్పుడే కాకుండా, తగినంత నీరు తాగకపోయినా డీహైడ్రేషన్ సమస్య ఏర్పడుతుంది.

**- వడదెబ్బ లక్షణాలు :**
తలనొప్పి, తల తిరగటం, తీవ్రమైన జ్వరం కలిగియుండటం, మత్తునిద్ర, కలవరింతలు, ఫిట్స్, పాక్షిక లేదా పూర్తి అపస్మారక స్థితి

**ఆస్తమా ఊపిరితిత్తుల సమస్యలు :**
వేసవిలో గాలి పొల్యూషన్ ఎక్కువగా ఉండడం వల్ల ఆస్తమా - శ్వాసకోశ వ్యాధులు ఎక్కువగా ప్రభావితం అవుతాయి.ధూళి, పొగ, పొల్యూషన్ ఎక్కువగా ఉండే ప్రదేశాల్లో ఉండటాన్ని నివారించాలి.ఆస్తమా ఉన్నవారు తమ వెంట ఇన్హేలర్ -మెడిసిన్స్ తప్పనిసరిగా ఉంచుకోవాలి.

**చర్మ సమస్యలు - అలర్జీలు :**
చెమట అధికంగా కారడం వల్ల చర్మం మురికితో ముడిపడి ఫంగల్ ఇన్ఫెక్షన్లు, రాషెస్ ఏర్పడతాయి.శోభి మచ్చలు (తినియా వెర్సికలర్) వేసవిలో అధికంగా ప్రబలతాయి.యూవీ రేడియేషన్ కారణంగా చర్మం కమిలిపోవడం, సన్‌బర్న్, మచ్చలు ఏర్పడే ప్రమాదం ఉంది.

**విరేచనాలు - కలరా :**
వేసవిలో భోజనం త్వరగా పాడవడం, నీటి కాలుష్యం పెరగడం వల్ల విరేచనాలు, కలరా వంటి సమస్యలు వస్తాయి.రహదారి పక్కన ఉన్న ఆహారం, కలుషితమైన నీరు తాగడం వల్ల బాక్టీరియల్ ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశముంది.

**మూత్రనాళ ఇన్ఫెక్షన్లు - కిడ్నీ సమస్యలు:**
వేసవిలో నీటి తగ్గుదల వల్ల మూత్రంలో మలినాలు పేరుకుని యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్లు సోకే అవకాశం ఉంటుంది.తగినంత నీరు తాగకపోతే కిడ్నీ రాళ్లు ఏర్పడే అవకాశం కూడా ఎక్కువ.

లివేసవి జాగ్రత్తలు - నివారణ చర్యలులి
- రోజూ కనీసం 3-4 లీటర్ల నీరు తాగాలి.
- ఒకసారి ఉడికించిన లేదా ఫిల్టర్ చేసిన నీరు తాగాలి.
- పొడిగా, వేడిగా ఉండే ఆహారాన్ని తగ్గించి, పండ్లు, కూరగాయలు ఎక్కువగా తినాలి.
- పొల్యూషన్ ఎక్కువగా ఉన్న ప్రదేశాలకు వెళ్లినప్పుడు మాస్క్ ధరించడం ఉత్తమం.
- పొడిపోతే ఊపిరితిత్తుల సమస్యలున్నవారు వైద్యుల సూచనల ప్రకారం ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి.
- కిడ్నీ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఎక్కువ నీరు తాగాలి, ఎక్కువ ఉప్పు ఉన్న ఆహారాన్ని తగ్గించాలి.
- ఎండలో ఎక్కువసేపు ఉండడం వల్ల సన్‌బర్న్, డీహైడ్రేషన్ సమస్యలు వస్తాయి, కాబట్టి సన్‌స్క్రీన్ వాడడం, హాట్ టైమ్‌లో బయటికి వెళ్లకుండా ఉండటం మంచిది.
- హైడ్రేటింగ్ ఫుడ్స్ (కాకర, దోసకాయ, ముజ్జిగ, కొబ్బరి నీరు) తినడం వల్ల వేడి తగ్గుతుంది.

**వేసవిలో ప్రకృతి :**
వేసవి కాలం ప్రకృతిలో కూడా అనేక మార్పులను తీసుకొస్తుంది. చెట్ల ఆకులు పచ్చగా ఉండి, పశువులు నీటి ప్రదేశాలకు చేరుకోవడం, పక్షులు చెట్ల కింద విశ్రాంతి తీసుకోవడం వంటి దృశ్యాలను మనం చూస్తాం. వేసవిలో ప్రజలు ప్రకృతి ప్రేమను మరింత అనుభూతి చెందుతారు, అదే సమయంలో ప్రకృతిని కాపాడుకునేందుకు చర్యలు తీసుకోవాలి.

సూర్యుడి వేడి ప్రభావం వేసవిలో మానవుని ఆరోగ్యానికి పెద్ద ముప్పు కావచ్చు. దీన్ని నివారించేందుకు జాగ్రత్తలు తీసుకోవడం అవసరం. ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి సరైన జాగ్రత్తలు పాటించడం, సురక్షితమైన వేళల్లో బయటకు వెళ్లడం చాలా ముఖ్యం. అలాగే ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహించకండి.

**శరీరాన్ని కాపాడుకోండి, ఆరోగ్యంగా ఉండండి!**
**ఆరోగ్యమే మహాభాగ్యం..!**

**-యస్వర్ధన్**
**కాలమిస్ట్**

# వినియోగదారుడే ' రారాజు ' అయ్యేదెప్పుడు?



మన దేశం 2047 చివరి నాటికి వికసిత భారత దేశంగా అవతరించాలంటే ముందుగా దేశం ఆర్థికపథంలో దూసుకుపోవాలి. దీనికి గాను ప్రజలకు అవసరమైన వస్తోత్పత్తి జోరుగా జరగడంతోపాటు, అంతే వేగంతో అవి అమ్ముడు పోవాలి. వస్తువుల నాణ్యత, సేవల విషయంలో వినియోగదారుడు సంతృప్తి చెందితేనే ఇలా జరుగుతుంది. అలా కానప్పుడు ఆర్థిక వృద్ధి మందగమనంలో కొనసాగుతుంది. ఇక్కడ ఉత్పత్తి అంటే వస్తువులు, సేవలు అని అర్థం. కొంత మంది విక్రేతలు వినియోగదారులకు విక్రయించి చేతులు దులుపుకుంటున్నారు. అలా కాకుండా ఉత్పత్తిదారులు వినియోగదారులకు కొన్ని హామీలు ఇవ్వవలసి ఉంటుంది. అవి గ్యారంటీ లేదా వారంటీ రూపంలో ఉండొచ్చు. కానీ చైతన్యం లేకపోవడం వలన వినియోగదారుడు కొన్ని సార్లు నష్టపోతున్నాడు.

**వినియోగదారుడు అంటే ఎవరు ?**
సూక్ష్మంగా చెప్పాలంటే మార్కెట్లో ఆర్థిక, వ్యాపార, ప్రచార రంగాలలో సంస్థలు ఉత్పత్తి చేసే వస్తువులు, వారి సేవలను వినియోగించుకునే వ్యక్తిగా వినియోగ దారుడుగా నిర్వచించబడతాడు. ఆర్థిక వ్యవస్థలో వినియోగదారులు కీలక పాత్ర వహిస్తారు. తయారు అయ్యే వస్తువులు కానీ, సేవలను వినియోగదారులు వాడకుంటే ఉత్పత్తిదారులకు ఉత్పత్తి చేయడానికి ప్రేరణనే ఉండదు.

**హక్కుల దినోత్సవం:**ప్రతి సంవత్సరం మార్చి 15వ తేదీ నాడు ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవంగా పరిగణిస్తారు. ఈ రోజు అనేది అంతర్జాతీయ వినియోగదారుల ఉద్యమంలో వేడుక, సంఘీభావాన్ని సూచించే వార్షిక అంతర్జాతీయ కార్యక్రమం. వినియోగదారుల హక్కులను గౌరవించాలని, రక్షించాలని డిమాండ్ చేస్తుంది. ఈ కార్యక్రమం మార్కెట్ దుర్వినియోగాలు, ఆ హక్కులను బలహీనపరిచే సామాజిక అన్యాయాలకు వ్యతిరేకంగా నిరసన తెలిపే అవకాశాన్ని కూడా ఇస్తుంది.

**2025 కోసం థీమ్**:ఈ ఏడాది ఇతివృత్తంగా "స్థిరమైన జీవనశైలికి న్యాయమైన పరివర్తన"గా తీసుకున్నారు. ఈ పరివర్తనలు ప్రజల ప్రాథమిక హక్కులు, అవసరాలను పరిరక్షిం చేటప్పుడు స్థిరమైన,




ఆరోగ్యకరమైన జీవనశైలి ఎంపికలను అందరి వినియోగదారులకు అందుబాటులో సరసమైన ధరకు అందించాల్సిన తక్షణ అవసరాన్ని ఈ థీమ్ ప్రతిబింబిస్తుంది. అత్యంత వేడిగా గత దశాబ్దం నమోదైంది. అనేక దేశాలలో తీవ్రమైన వాతావరణం నిత్యకృత్యంగా మారింది. ఇది జీవితాలను జీవనోపాధిని దెబ్బతీసింది. అదే సమయంలో, జీవవైవిధ్య నష్టం, కాలుష్యం భూమితోపాటుగా మానవ ఆరోగ్యానికి పెరుగుతున్న ముప్పును కలిగిస్తున్నాయి. ఈ సంక్షోభాల ప్రభావం పర్యావరణపరంగానే కాకుండా ఆర్థికంగా, సామాజికంగా కూడా ఉండి సుస్థిర అభివృద్ధి లక్ష్యాల పురోగతిని దెబ్బ తీసింది. మనం తినే విధానం, ప్రయాణించే విధానం, మన ఇళ్లను వేడి చేయడం, చల్లబరచడం, విద్యుత్తును అందించడం, మనం కొనుగోలు చేసి ఉపయోగించే ఉత్పత్తులు, సేవలలో ప్రాథమిక మార్పులు చేయాల్సి ఉంటుంది. అయినప్పటికీ వినియోగదారులకు స్థిరమైన, ఆరోగ్యకరమైన ఎంపికలను మరింత అందుబాటులో ఉంచడం, సరసమైనదిగా చేయడం చాలా అవసరం. ఈ పరివర్తన ప్రజల ప్రాథమిక హక్కులు, అవసరాలను దెబ్బ తీయకుండా ప్రజలకు స్థిరమైన జీవనశైలిని అందించే పురోగతికి అవకాశాన్ని కలిగిస్తుంది.

వినియోగదారుల హక్కులు:

**భద్రత హక్కు:**
ప్రాణానికి, ఆస్తికి ప్రమాదకరమైన వస్తువులు, సేవల మార్కెటింగ్ నుండి రక్షణ పొందే హక్కు ఇది. కొనుగోలు చేసిన వస్తువులు, సేవలు వారి తక్షణ అవసరాలను తీర్చడమే కాకుండా, దీర్ఘకాలిక ప్రయోజనాలను కూడా తీర్చాలి. కొనుగోలు చేసే ముందు వినియోగదారులు ఉత్పత్తుల నాణ్యతను అలాగే ఉత్పత్తులు సేవల హామీని నొక్కి చెప్పాలి.

ఎంచుకునే హక్కు:పోటీ ధరలకు వివిధ రకాల వస్తువులు, సేవలను పొందే అవకాశం ఉన్న చోట హామీ పొందే హక్కు. గుత్తాధిపత్యాల విషయంలో, సరసమైన ధరకు సంతృప్తికరమైన నాణ్యత, సేవను పొందే హక్కు దీని అర్థం.

**సమాచారం పొందే హక్కు:**
అన్యాయమైన వాణిజ్య పద్ధతుల నుండి వినియోగదారుని రక్షించడానికి వస్తువుల నాణ్యత, పరిమాణం, శక్తి, స్వచ్ఛత, ప్రమాణం, ధర గురించి తెలుసుకునే హక్కు. వినియోగదారుడు ఎంపిక చేసుకునే ముందు లేదా నిర్ణయం తీసుకునే ముందు ఉత్పత్తి లేదా సేవ గురించి మొత్తం సమాచారాన్ని పొందాలని పట్టుబట్టాలి. ఇది అతను తెలివిగా, బాధ్యతాయుతంగా వ్యవహరించడానికి అధిక పీడన అమ్మకపు పద్ధతులకు బలైపోకుండా ఉండటానికి వీలు కల్పిస్తుంది.

విద్య హక్కు:జీవితాంతం సమాచారం ఉన్న వినియోగదారుడిగా ఉండటానికి జ్ఞానం, నైపుణ్యాన్ని పొందే హక్కు దీని అర్థం. వినియోగదారుల అజ్ఞానం, ముఖ్యంగా గ్రామీణ వినియోగదారుల అజ్ఞానం వారి దోపిడీకి ప్రధానంగా బాధ్యత వహిస్తుంది. వారు తమ హక్కులను తెలుసుకోవాలి. వాటిని సద్వినియోగం చేసుకోవాలి. అప్పుడే నిజమైన వినియోగదారుల రక్షణ విజయంతో సాధించబడుతుంది.

**వినిపించే హక్కు:**దీని అర్థం వినియోగదారుల ప్రయోజనాలను తగిన వేదికలలో పరిగణనలోకి తీసుకుంటారు. వినియోగదారుల సంక్షేమాన్ని పరిగణనలోకి తీసుకోవడానికి ఏర్పడిన వివిధ వేదికలలో ప్రాతినిధ్యం వహించే హక్కు కూడా ఇందులో ఉంది. వినియోగదారులు రాజకీయేతర, వాణిజ్యేతర వినియోగదారు సంస్థలను ఏర్పాటు చేయాలి. వీటిని ప్రభుత్వం, ఇతర సంస్థలు వినియోగదారులకు సంబంధించిన విషయాలలో ఏర్పాటు చేసిన వివిధ కమిటీలలో ప్రాతినిధ్యం వహించవచ్చు.

**పరిష్కారాన్ని కోరే హక్కు:**అన్యాయమైన వాణిజ్య పద్ధతులు లేదా వినియోగదారులను అన్యాయంగా దోపిడీ చేయడంపై పరిష్కారం కోరే హక్కు దీని అర్థం. ఇందులో వినియోగదారుల నిజమైన ఫిర్యాదులను న్యాయంగా పరిష్కరించే హక్కు కూడా ఉంటుంది. వినియోగదారులు తమ నిజమైన ఫిర్యాదుల కోసం ఫిర్యాదు చేయాలి. చాలా సార్లు వారి ఫిర్యాదు విలువ తక్కువగా ఉండవచ్చు కానీ మొత్తం సమాజంపై దాని ప్రభావం చాలా పెద్దదిగా ఉండవచ్చు. వారు తమ ఫిర్యాదుల పరిష్కారం కోసం వినియోగదారుల సంస్థల సహాయం కూడా తీసుకోవచ్చు.మార్కెట్లు ప్రపంచీకరణ చెందుతున్నందున, తయారీదారు, తుది వినియోగదారు మధ్య ప్రత్యక్ష సంబంధాన్ని దూరం చేయడం, కొనుగోలు తర్వాత ఫిర్యాదులను బలమైన పరిష్కార వ్యవస్థ ద్వారా వినాలి. దీని కోసం, వినియోగదారుల వివాదాల పరిష్కార సంస్థలు (కన్స్యూమర్ ఫోరమ్‌లు లేదా వినియోగదారుల కోర్టులు అని ప్రసిద్ధి చెందాయి) చట్టం ప్రకారం జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో వినియోగదారుల ఫిర్యాదులకు వ్యతిరేకంగా సరళమైన చవకైన త్వరిత పరిష్కారాన్ని అందించడానికి ఏర్పాటు చేయబడ్డాయి.

**వినియోగదారుల బాధ్యతలు:**కొనుగోలు చేసే ముందు వినియోగదారుడు ఉత్పత్తులు, సేవల భద్రత, నాణ్యతను గుర్తుంచుకోవాలి. తమకు ఏమి కావాలో, అవసరమైన దాని గురించి బాగా శ్రద్ధ వహించాలి. వ్యాపారులకు వారు ఖచ్చితంగా ఏమి కోరు కుంటున్నారో చెప్పాలి. వస్తువులు లేదా సేవల పట్ల వారి అసంతృప్తిని నిజాయితీగా న్యాయమైన రీతిలో వ్యక్తం చేయడం, దాఖలు చేయడం వినియోగదారు బాధ్యత.

**వినియోగదారుల రక్షణ చట్టాలు :**ముఖ్యంగా ప్రపంచీకరణ, ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లు, ఇ-కామర్స్ మార్కెట్లు మొదలైన కొత్త యుగంలో వినియోగదారుల రక్షణ కోసం నిబంధనలను మరింత బలోపేతం చేయడానికి, వినియోగదారుల రక్షణ చట్టం 1986 స్థానంలో వినియోగదారుల రక్షణ చట్టం 2019 రూపొందించబడింది. వినియోగదారుల రక్షణ చట్టం 2019 దాని పరిధిలోని ఇ-కామర్స్ లావాదేవీలను స్పష్టంగా కలిగి ఉంటుంది. డిజిటల్ లేదా ఎలక్ట్రానిక్ నెట్‌వర్క్ ద్వారా డిజిటల్ ఉత్పత్తులతో సహా వస్తువులు లేదా సేవలను కొనుగోలు చేయడం లేదా విక్రయించడం ఇ-కామర్స్‌గా నిర్వచించబడింది. ప్రజలు, వినియోగదారుల ప్రయోజనాలకు హాని కలిగించే తప్పుడు లేదా తప్పుదారి పట్టించే ప్రకటనలకు సంబంధించిన విషయాలను నియంత్రించడానికి 24.07.2020 నుండి సెంట్రల్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ స్థాపించబడింది. ప్రకటనల ఆమోదం కోసం తగిన శ్రద్ధ అవసరం, తద్వారా ఒక ప్రకటనలో అటువంటి ఆమోదం అటువంటి ప్రాతినిధ్యం వహించే వ్యక్తి, సమూహం లేదా సంస్థ యొక్క నిజమైన, సహేతుకమైన ప్రస్తుత అభిప్రాయాన్ని ప్రతిబింబించాలి. దాని గురించి తగిన సమాచారం లేదా అనుభవంపై ఆధారపడి ఉండాలి. గుర్తించబడిన వస్తువులు, ఉత్పత్తి లేదా సేవతో పాటు మోసపూరితంగా ఉండకూడదు. ఇంకా వినియోగ దారులు ఆర్థిక మోసం, ఉద్యోగ మోసం వైవాహిక మోసాల నుండి రక్షణ కలిగిస్తుంది.

**-జనక మోహన రావు దుంగ**
**ఫోన్: 8247045230**

**(15 ప్రపంచ వినియోగ దారుల హక్కుల దినోత్సవం సందర్భంగా)**

# తిండి తినే విధము ఇదండి

భక్తి



శారీరక, మానసిక ఆరోగ్యం కోసం సమగ్రమైన జీవనశైలి అలవాట్లను ప్రోత్సహించడంలో ఆధ్యాత్మిక వేత్త సద్గురు జగ్గీవాసుదేవ్ పేరుగాంచిన వారు. ఒకప్పుడు పెద్దలు, పిల్లలు కలిసి నేలపై కూర్చుని పద్ధతిగా తినేవాళ్లు. ఇప్పుడు కాలం మారింది. ఆహారపు అలవాట్లు, పనిచేసే విధానం అన్నీ మారిపోయాయి. ఇలాంటి సమయంలో రోజు వారీగా మనం అనుసరించాల్సిన కొన్ని ఆహారపు అలవాట్ల గురించి ఆయన మాటల్లో

1 నేలపై కూర్చుని నేలపై పద్మాసనం వేసుకుని కూర్చుని తినాలి. పవిత్రమైన అన్నం వైపు కాళ్లు చాచి కూర్చోవద్దు. ఇది మన శరీరాలకు ప్రతికూల శక్తిని ఇస్తుంది.

2 చేత్తో తినాలి తినే ఆహారాన్ని చేత్తో తాకకపోతే అది ఏంటనేది మనకు తెలియదు. కాబట్టి, చేత్తో శ్రద్ధగా తినాలి.

3 24 సార్లు నమలాలి తినేటప్పుడు చాలా శ్రద్ధతో ఉండాలి. ఆహారాన్ని 24 సార్లు నమలాలి. దీంతో ఆహారం నోట్లోనే జీర్ణవ్యవస్థ చురుగ్గా పనిచేయడానికి అనువుగా మారిపోతుంది.

4 రెండు నిమిషాల నిరీక్షణ తినడానికి ముందు కనీసం రెండు నిమిషాలు ఆగాలి. ఇలా చేస్తే మన మనసు ఆహారం తీసుకోవడానికి సిద్ధమైపోతుంది. సరిగ్గా తినగల్గుతాం.

5 ఎంత కావాలో అంతే ముప్పై అయిదేండ్లు దాటితే శారీరకంగా అంతగా కష్టం చేయకపోతే, ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేకపోతే రోజుకు రెండు భోజనాలు సరిపోతాయి. కాలక్రమంలో శరీరం ఈ విధానానికి అలవాటు పడిపోతుంది.

6 ఎప్పుడు పడితే అప్పుడు వద్దు జీర్ణవ్యవస్థ తనను తాను శుద్ధి చేసుకోవడానికి తగిన సమయం ఇవ్వాలి. కాబట్టి, రోజంతా ఏదో ఒకటి తింటూ పోతే మలినాలు శుద్ధి కావడానికి ఎక్కువ సమయం పడుతుంది. కాలక్రమంలో ఇది మరిన్ని అనర్థాలకు దారితీస్తుంది.

7 రాత్రి సరైన సమయంలో పడుకునేందుకు కనీసం మూడు గంటల ముందు భోజనం ముగించాలి. ఆ తర్వాత ఓ ఇరవై, ముప్పై నిమిషాలు నడక లాంటి తేలికపాటి వ్యాయామం చేయాలి. ఇలాచేస్తే శరీరం ఆరోగ్యంగా ఉంటుంది.

8 తెలివిగా ఎంపిక మన కడుపు ఖాళీ అయిన ఒకటిన్నర నుంచి రెండున్నర గంటల్లో తినాలి. ఇది మనల్ని శక్తిమంతుల్ని చేస్తుంది. చురుగ్గా, అలర్ట్‌గా ఉంచుతుంది.

9 మాటలు వద్దు తినేటప్పుడు మాట్లాడకూడదు. నోరు తెరుస్తున్నామంటే అది తినడానికైనా లేదంటే మాట్లాడటానికైనా అయ్యుంటుంది. కాబట్టి ఒకేసారి రెండిటినీ చేయకూడదు.



# నవతార

## పొట్టకు శాంతి

పెరుగు అచ్చమైన పాల ఉత్పత్తి. క్యాల్షియం, విటమిన్ బి - 2, విటమిన్ బి- 12, పొటాషియం, మెగ్నీషియం లాంటి ఎన్నో అత్యవసర పోషకాలు ఉంటాయి. సులువుగా అరిగిపోతుంది కూడా. కాబట్టి నిక్షేపంగా తినొచ్చు.
సజీవ బ్యాక్టీరియా సమృద్ధంగా ఉండే పెరుగు గొప్ప ప్రొబయోటిక్ ఆహారం. ఇది మంచి బ్యాక్టీరియా కావడంతో పేగుల పనితీరు మెరుగుపడటానికి, జీర్ణవ్యవస్థ చల్లబడటానికి, గడబిడగా ఉన్న కడుపును శాంతపరచడానికి ఎంతగానో ఉపకరిస్తుంది. పెరుగులోని సజీవ బ్యాక్టీరియా వ్యాధికారక క్రిములతో సమర్థంగా పోరాడుతుంది.







# యూపీఎస్సీ సివిల్స్ ప్రిపరేషన్ ప్లాన్



జనవరి 22న, "979 పోస్టులతో" యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ నోటిఫికేషన్- 2025 విడుదలైంది. అయితే గత ఏడాది (2024లో) వెయ్యికి పైగా పోస్టులుండగా, అంతకుముందు సంవత్సరం (2023లో) 1100లకు పైగా పోస్టులున్నాయి. అయితే మొత్తం భర్తీ చేసే సర్వీసులను ఈ సారి 23కు పెంచడం జరిగింది (గత ఏడాది 21 సర్వీసులతో నోటిఫికేషన్ ఇచ్చారు). ఈసారి ఇండియన్ రైల్వే మేనేజ్‌మెంట్ సర్వీస్ ను విభజించి, ఇండియన్ రైల్వే ట్రాఫిక్ సర్వీస్, ఇండియన్ రైల్వే అకౌంట్స్ సర్వీస్- ఇండియన్ రైల్వే పర్సనల్ సర్వీసులుగా చేయడంతో ఈసారి భర్తీ చేసే సర్వీస్‌ల సంఖ్య 23కు పెరిగింది.

**తాజా నోటిఫికేషన్‌లో మార్పులు**

సివిల్ సర్వీసెస్ ఎగ్జామ్‌కు కనీస విద్యార్హత అయిన గ్రాడ్యుయేషన్ చివరి సంవత్సరం చదువుతున్నవారు కూడా ప్రిలిమినరీ, మెయిన్స్ పరీక్షలకు హాజరుకావచ్చు. గతంలో వీరు కేవలం ప్రిలిమినరీ వరకు మాత్రమే అవకాశం ఉండేది, మెయిన్స్ పరీక్షలకు హాజరు కావాలంటే మాత్రం గ్రాడ్యుయేషన్ సర్టిఫికేట్ సమర్పించాలి. ప్రస్తుతం ఇంటర్వ్యూకి ముందు నిర్ధేశిత గడువులోగా ఉత్తీర్ణత సర్టిఫికేట్ సమర్పిస్తే చాలు.
రిజర్వేషన్లు, వయోపరిమితి సడలింపులు కోరుతున్న అభ్యర్థులు సంబంధిత ధ్రువీకరణ పత్రాలను ప్రిలిమినరీ అప్లికేషన్‌లోనే సమర్పించాలి. గతంలో ఈ నియమం ప్రిలిమ్స్ దశలో లేదు.
ఆదేవిధంగా %OBC% లు కుల ధృవీకరణ పత్రంతో పాటుగా, నాన్ క్రీమీలేయర్ సర్టిఫికెట్‌ను కూడా దాఖలు చేయాలి. నాన్ క్రీమీలేయర్ సర్టిఫికెట్ గడచిన మూడు ఆర్థిక సంవత్సరాలు(2021-22, 2022-23, 2023-245) సంబంధించినదై ఉండాలి ౹ఆఇ సర్టిఫికేట్ 01-04-2024 మరియు 11-02-2025 మధ్య జారీ అయినదై వుండాలి . ఉగిఖి రిజర్వేషన్‌కు అర్హులైనవారు కూడా, 2023-2024 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి, నిర్ణీత అధికారిచే 01-04-2024 మరియు 11-02-2025 మధ్యకాలంలో కేంద్రప్రభుత్వ క్రైటీరియా ప్రకారం జారీ చేయబడిన ఇన్ కమ్ అండ్ అసెట్ సర్టిఫికెట్‌ను ప్రిలిమినరీ అప్లికేషన్ దశలోనే సమర్పించాల్సి వుంటుంది.
ఈసారి "సర్వీస్ ప్రిఫరెన్స్"లను కూడా ప్రిలిమినరీ ఎగ్జామ్ అప్లికేషన్‌లోనే ఎంచుకోవాల్సి ఉంది. అదేవిధంగా "క్యాడర్ ప్రిఫరెన్స్"లను ప్రిలిమ్స్ పరీక్ష అయిన 10 రోజుల తరువాత సమర్పించాలి.
UPSC పరీక్షకు వన్ టైమ్ రిజిస్ట్రేషన్ అనేది తప్పనిసరి. తొలిసారిగా పరీక్షకు హాజరయ్యేవారు ముందుగా వెబ్‌సైట్‌లో వన్ టైమ్ రిజిస్ట్రేషన్‌ను చేసుకోవాలి. ఈ వన్‌టైమ్ రిజిస్ట్రేషన్లో సమర్పించిన వివరాలను (డేట్ ఆఫ్ బర్త్ మినహా), సమర్పించిన తేదీ నుండి 2025 ఫిబ్రవరి 25 లోపుగా ఎప్పుడైనా సవరించుకోవచ్చు.
ప్రిలిమినరీ ఎగ్జామినేషన్ (ప్రిలిమ్స్): ఇది మొదటి దశ, ఇందులో రెండు ఆబ్జెక్టివ్ తరహా పేపర్లు ఉంటాయి.
జనరల్ స్టడీస్ పేపర్-1: ఇందులో హిస్టరీ, జాగ్రఫీ, ఎకనామిక్స్, సైన్స్ అండ్ టెక్నాలజీ, కరెంట్ అఫైర్స్ జనరల్ నాలెడ్జ్ తదితర అంశాల నుంచి ప్రశ్నలు వస్తాయి.
సివిల్ సర్వీసెస్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (సీశాట్) పేపర్ 2: పేపర్-2లో కాంప్రహెన్షన్, ఇంటర్ పర్సనల్ స్కిల్స్, లాజికల్ రీజనింగ్ అండ్ అనలిటికల్ ఎబిలిటీ, డెసిషన్ మేకింగ్ అండ్ ప్రాబ్లమ్ సాల్వింగ్, జనరల్ మెంటల్ ఎబిలిటీ, బేసిక్ న్యూమరసీ, ఇంగ్లీష్ లాంగ్వేజ్ కాంప్రహెన్షన్ అంశాల నుంచి ప్రశ్నలు ఉంటాయి(ఒక్కో పేపర్ 200 మార్కులకి ఉంటుంది).
CSAT కేవలం క్వాలిఫైంగ్ పేపర్ మాత్రమే. దీనిలో తప్పనిసరిగా 200 మార్కులకి 33/66 మార్కులు రావాలి. పేపర్ 1 మాత్రం కట్ ఆఫ్ మార్కులు ఉంటాయి. ప్రతిసంవత్సరం కట్ ఆఫ్ మార్కు మారుతూ ఉంటుంది.
మెయిన్స్: రాత పరీక్ష. ఇందులో తొమ్మిది పేపర్లు ఉంటాయి. ఇవి అభ్యర్థి పరిజ్ఞానాన్ని, లోతుగా పరీక్షిస్తాయి. నిజ జీవిత సంఘటనలను అభ్యర్థులు ఏ విధంగా అర్థం చేసుకోగలుగుతున్నారో అంచనా వేస్తాయి.
తప్పనిసరి పేపర్లు: పేపర్ ఏ(ఇండియన్ లాంగ్వేజ్), పేపర్ బి(ఇంగ్లిష్) ఈ రెండు పేపర్లు ఒక్కో పేపర్‌కి 300 మార్కులు ఉంటాయి. ఒక్కో పేపర్‌లో తప్పనిసరిగ్గా 75 మార్కులు సాధించాలి.
పేపర్ 1: జనరల్ ఎస్సే పేపర్ 2: జనరల్ స్టడీస్-1
పేపర్ 3: జనరల్ స్టడీస్-2 పేపర్ 4: జనరల్ స్టడీస్-3
పేపర్ 5: జనరల్ స్టడీస్-4 పేపర్ 6: ఆప్షనల్ పేపర్ -1
పేపర్ 7: ఆప్షనల్ పేపర్-2 (ఒక్కో పేపర్ 250 మార్కులు)
పర్సనాలిటీ టెస్ట్(ఇంటర్వ్యూ): అభ్యర్థుల వ్యక్తిత్వం, నాయకత్వ లక్షణాలు, కమ్యూనికేషన్ స్కిల్స్, వారి పరిపాలన సామర్థ్యాన్ని అంచనా వేస్తారు(దీనికి 275 మార్కులు).
అర్హతలు:వయోపరిమితి: అభ్యర్థుల వయస్సు 21 నుంచి 32 ఏళ్ల మధ్య ఉండాలి(కేటగిరీలను అనుసరించి సడలింపు ఉంటుంది).
**విద్యార్హతలు: బ్యాచిలర్ డిగ్రీ**
ఎన్నిసార్లు రాయవచ్చు: అభ్యర్థులు తమ కేటగిరీని బట్టి (జనరల్ కేటగిరీ అభ్యర్థులు-6 సార్లు, ఓబీసీ-9 సార్లు, ఎస్సీ/ ఎస్టీ-అపరిమితం) పరిమిత సంఖ్యలో రాయవచ్చు.
ఆప్షనల్ సబ్జెక్టులు(మెయిన్స్‌కి మాత్రమే): నోటిఫికేషన్‌లోని జాబితా నుంచి ఒక ఆప్షనల్ సబ్జెక్టును ఎంచుకోవాలి.
పరీక్ష షెడ్యూలు: ప్రతి ఏడాది ఫిబ్రవరి/మార్చిలో నోటిఫికేషన్ వెలువడుతుంది. ప్రిలిమినరీ పరీక్ష మే/జూన్‌లో, మెయిన్స్ సెప్టెంబర్/అక్టోబర్‌లో, ఇంటర్వ్యూను మరుసటి సంవత్సరం ఫిబ్రవరి/మార్చిలో నిర్వహిస్తారు.
**ప్రిపరేషన్:** సిలబస్ చాలా విస్తృతంగా ఉంటుంది, పరీక్ష సంక్లిష్టత కారణంగా చాలా మంది అభ్యర్థులు ఏడాది లేదా అంతకంటే ఎక్కువ కాలంపాటు ప్రిపేర్ అవుతారు. చాలామంది కోచింగ్ ఇన్‌స్టిట్యూట్‌లు, స్టడీ మెటీరియల్, ఆన్‌లైన్ రిసోర్సెస్, కరెంట్ అఫైర్స్ అప్‌డేట్స్‌పై ఆధారపడతారు.
ప్రిపరేషన్‌లో నిరంతరం చదవడం, రైటింగ్ ప్రాక్టీస్, ప్రాక్టీస్ ఎగ్జామ్స్ రాయాలి.
సంక్షిప్తంగా, యుపీఎస్సీ సీఎసఈ అనేది భారతదేశంలోని పరిపాలనా వ్యవస్థలో ఉన్నతమైన పదవులకు అత్యంత సమర్థులైన అభ్యర్థులను ఎంపిక చేసే సవాలుతో కూడిన పరీక్ష. దీనికి క్రమశిక్షణ, అంకితభావం, విభిన్న అంశాలపై సమగ్ర అవగాహన అవసరం.
స్టడీ మెటీరియల్: మార్కెట్‌లో రకరకాల స్టడీ మెటీరియల్స్ ఉన్నాయి. ఇందులో ఆన్‌లైన్ మెటీరియల్స్, కోచింగ్‌లు అధిక సంఖ్యలో అందుబాటులో ఉన్నాయి. ఇలాంటి సమయంలో ఎంపిక చాలా జాగ్రత్తగా ఉండాలి.
పరీక్ష విధానం:భారతదేశంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన పోటీ పరీక్షల్లో యూపీఎస్సీ సీఎస్ఈ ఒకటి. ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్(ఐఎఎస్), ఇండియన్ పోలీస్ సర్వీస్ (ఐపీఎస్), ఇండియన్ ఫారిన్ సర్వీస్(ఐఎఫ్ఎస్) మరియు ఇతర కేంద్రప్రభుత్వ సర్వీస్‌లకు అభ్యర్థులను ఎంపిక చేయడానికి యూపీఎస్సీ ఈ పరీక్షను నిర్వహిస్తుంది.
పరీక్ష విధానం: యూపీఎస్సీ సీఎసఈ పరీక్ష మూడు దశలలో జరుగుతుంది.
మొదటి దశ: ప్రిలిమినరీ ఎగ్జామినేషన్
రెండవ దశ: మెయిన్ ఎగ్జామినేషన్ (మెయిన్స్)
మూడో దశ: పర్సనాలిటీ టెస్ట్ (ఇంటర్వ్యూ)
మెయిన్స్, ఇంటర్వ్యూ మార్కులు కలిపి ఫైనల్ ర్యాంక్ లిస్ట్‌ను ఇస్తారు.

# షైనింగ్ కెరీర్ ఫుట్‌వేర్ డిజైనింగ్

ఒక వ్యక్తి ఆహార్యాన్ని ఉన్నతంగా రూపొందించడంలో మేకప్, దుస్తులతో సమాన ప్రాధాన్యం పాదరక్షలది కూడా. ఆకట్టుకునే బట్టలు కట్టుకున్న వ్యక్తి ఆకు చెప్పులతో తిరిగితే ఎబ్బెట్టుగా ఉంటుంది...
ఒక వ్యక్తి ఆహార్యాన్ని ఉన్నతంగా రూపొందించడంలో మేకప్, దుస్తులతో
సమాన ప్రాధాన్యం పాదరక్షలది కూడా. ఆకట్టుకునే బట్టలు కట్టుకున్న వ్యక్తి ఆకు చెప్పులతో తిరిగితే ఎబ్బెట్టుగా ఉంటుంది. సమయానికి అనుగుణమైన పాదరక్షలు ధరిస్తే సౌకర్యవంతంగా, హుందాగా ఉంటుంది. పాదరక్షల తయారీ అనేది ఒక పెద్ద ఇండస్ట్రీ. అందుకే భారతదేశంలో ప్రధాన రంగాల్లో లెదర్ ఇండస్ట్రీ ఒకటిగా ఎదిగింది. దేశ జాతీయ ఉత్పత్తిలో రెండు శాతం వాటా ఉన్న ఈ రంగం, దాదాపు 44 లక్షల మందిపైగా ఉద్యోగాలు



కల్పిస్తోంది. లెదర్ ఇండస్ట్రీని మార్కెట్‌కు అనుగుణంగా తీర్చిదిద్దడంలో 'ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవెల్‌పమెంట్ ఇన్‌స్టిట్యూట్'(ఎఫ్‌డీడీఐ)లు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి.
ఇంజనీరింగ్ చదువులకు ఐఐటీ, మేనేజ్‌మెంట్ కోర్సులకు ఐఐఎమ్, దుస్తుల ఫ్యాషన్‌కు నిఫ్ట్ ఎలాగో ఫుట్‌వేర్ చదువులకు ఎఫ్‌డీడీఐ అలాంటిది. దేశ వ్యాప్తంగా హైదరాబాద్‌తో సహా నోయిడా, కోల్‌కత్తా, రోహ్‌తక్, రాయ్‌బరేలీ, జోధ్‌పూర్, చెన్నై, చింద్వారా, చండీగడ్, గుణ, అంకలేశ్వర్, పట్నల్లో

12

ఎఫ్‌డీడీఐ క్యాంప్‌సలు ఉన్నాయి. వీటిలో 2025-26 అకడమిక్ సంవత్సరం యూజీ, పీజీ కోర్సుల్లో అడ్మిషన్లకు నోటిఫికేషన్ వెలువడింది. ఆల్ఇండియా సెలెక్షన్ టెస్ట్-2025 (ఏఐఎస్‌టీ-2025) ఆధారంగా ఎంపిక జరుగుతుంది.

**బ్యాచిలర్ డిగ్రీ ప్రోగ్రామ్‌లు:**

1. బ్యాచిలర్ ఆఫ్ డిజైన్(బీడీఎస): నాలుగు సంవత్సరాల కోర్సు ఇది. ఇందులో ఎనిమిది సెమిస్టర్లు ఉంటాయి.
బీడీఈఎస(ఫుట్‌వేర్ డిజైన్ అండ్ ప్రొడక్షన్)
బీడీఈఎస(ఫ్యాషన్ డిజైన్)
బీడీఈఎస(లెదర్, లైఫ్ స్టయిల్ అండ్ ప్రొడక్ట్ డిజైన్)
2. బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్(బీబీఏ): నాలుగు సంవత్సరాల కోర్సు ఇది. ఎనిమిది సెమిస్టర్లు ఉంటాయి.
బీబీఏ(రిటైల్ అండ్ ఫ్యాషన్ మర్చండైజ్)

మాస్టర్ డిగ్రీ ప్రోగ్రామ్‌లు

1. మాస్టర్ ఆఫ్ డిజైన్(ఎండీఎస): రెండు సంవత్సరాల కోర్సు ఇది. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి.
ఎండీఈఎస(ఫుట్‌వేర్ డిజైన్ అండ్ ప్రొడక్షన్)
ఎండీఈఎస(ఫ్యాషన్ డిజైన్)
2. మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్(ఎంబీఏ): ఎంబీఏ(రిటైల్ అండ్ ఫ్యాషన్ మర్చండైజ్)

అర్హతలు: బ్యాచిలర్ డిగ్రీ కోర్సులకు ఇంటర్‌మీడియేట్, మాస్టర్ డిగ్రీ కోర్సులకు ఏదైనా డిగ్రీ పాసై ఉండాలి.
వయస్సు: బ్యాచిలర్ డిగ్రీలో చేరాలనుకునే వారి వయస్సు 25 సంవత్సరాలలోపు ఉండాలి. పీజీ కోర్సులకు వయోపరిమితి లేదు.
**చివరి తేదీ: ఏప్రిల్ 20 ఎంట్రెన్స్ తేదీ: మే 11**
**ఫలితాలు: 2025 జూన్ మొత్తం సీట్లు: 2390**

# కాళ్లకీ కావాలి వ్యాయామం

దీనిలో ఒక మోకాలును ముందుకు వంచి రెండో మోకాలును నేరుగా పెట్టాలి. దీనివల్ల తొడలు, కాళ్లలో పేరుకున్న అదనపు కొవ్వు కరుగుతుంది. మోకాళ్లను సులభంగా వంచగలుగుతారు. పాదాల్లోని కండరాలు బలపడతాయి.

**కుర్చీలో కూర్చున్నట్లు...**

ఒక కుర్చీలో కూర్చున్నట్లు ఊహించుకోండి. కొద్దిగా అటూ ఇటూ కదలండి. ఇలా రోజుకు 15 నిమిషాలు చేస్తే కాళ్లలో సత్తువ పెరుగుతుంది. మోకాళ్ల కీళ్లు బలపడతాయి. తొడల కింది భాగంలో పేరుకుపోయిన కొవ్వు కరుగుతుంది.

కేరింతలు...

చిన్నపిల్లలు పడుక్కొని కాళ్లు చేతులు పైకి కిందికీ ఊపుతూ ఉంటారు. ఎయిర్‌సైక్లింగ్ కూడా ఇలాంటిదే. ప్రతిరోజూ ఉదయం లేవగానే ఎయిర్ సైక్లింగ్ చేస్తే కాళ్లలో బిగుసుకున్న కండరాలు వ్యాకోచం చెందుతాయి. వెన్ను నొప్పి తగ్గుతుంది.

**సగం వంగి...**

చాలా మంది సులభంగా వంగలేరు. కాళ్లను మడవటానికి కూడా ఇబ్బంది పడతారు. ఇలాంటి వారు కాళ్లను సగం వంచి అటూ ఇటూ కదిలితే... నడుము భాగం నుంచి పాదాల వరకూ ఉన్న కండరాల నొప్పులు, తిమ్మిర్లు తగ్గిపోతాయి. కీళ్లవాతం సమస్యల నుంచి ఉపశమనం కలుగుతుంది. కాళ్లకు రక్తప్రసరణ సక్రమంగా







# ఇందువదనకు.. బిందు వందనం





ప్రకృతిలో ప్రతిదీ అపురూపమే! మెరిసే మేఘం, కురిసే చినుకు.. అన్నీ అద్భుతాలే! అచ్చెరు వొందించే ఆ ప్రకృతి వింతలకు ఆభరణాల్లో చోటిచ్చి ఇంతుల మనసు దోచుకుంటున్నారు జువెలరీ డిజైనర్లు. అలా రూపొందించినవే బిందీ నగలు. నీటి బిందువు ఆకారం ప్రధానంగా తయారైన నగలు అతివ మేనిపై నిగనిగలు పోతున్నాయి.
అతివల అలంకరణలో ఆభరణాలు ఎప్పుడూ ప్రత్యేకమే. సందర్భానికి తగిన ఆభరణాలను ఎంచుకుని మరీ అలంకరించుకుంటారు మగువలు. మన సంస్కృతికి ప్రతీకలుగా నిలిచే ప్రాచీన నగలతోపాటు ఆధునిక ఆభరణాలు సైతం ఈతరం మహిళల అలంకరణలో అందంగా ఒదిగిపోతున్నాయి. ప్రకృతిలో సహజంగా లభించే రాళ్లు, గవ్వలు, ఆల్చిప్పలు లాంటి వస్తువులకు కూడా చోటిచ్చి కొత్త నగలకు ప్రాణం పోస్తున్నారు డిజైనర్లు. బిందీ జువెలరీ కూడా ఇదే కోవకు చెందుతుంది. నేల తల్లిని ముద్దాడే ముందు ముచ్చట గొలిపే వాన చినుకు ఆకృతి ఆలంబనగా బిందీ జువెలరీని తయారు చేస్తున్నారు.
%బంగారం, వెండి, ప్లాటినమ్ వంటి ఖరీదైన లోహాలతోపాటు రంగురంగుల పూసలతోనూ ఈ ఆభరణాలు అందుబాటులోకి వచ్చాయి. ఏ రంగు దుస్తులకైనా నప్పేలా ఆయా రంగు నగలనూ ఎంచుకోవచ్చు. అందమైన బిందువులను పొదిగిన కమ్మలు, కంఠాభరణాలు, బ్రేస్‌లెట్లు, ఉంగరాలు దొరుకుతున్నాయి. బంగారంతో తయారుచేసిన ఈ ఆభరణాల్లో వజ్రాలు, నవరత్నాలు కూడా బిందీ ఆకారాల్లో ఒదిగిపోయి ప్రత్యేకంగా ఆకర్షిస్తున్నాయి. వన్ గ్రామ్ గోల్డ్ ఇమిటేషన్ నగల్లోనూ ఈ బిందీ జువెలరీ ట్రెండ్‌గా మారుతున్నది. సంప్రదాయ, ఆధునిక దుస్తులపైనా నప్పేలా రంగురంగుల బిందీలతో అన్నిరకాల ఆభరణాలు ఉండే మ్యాచింగ్ సెట్లు కూడా వచ్చేశాయి. ఇంకెందుకు ఆలస్యం మీరూ ఓసారి ట్రై చేసేయండి!





# పెరుగుతో ఫేషియల్...

**ముఖం అందంగా కనిపించాలని మహిళలు ఫేషియల్ చేయించుకుంటూ ఉంటారు. ప్రతిసారీ పార్లర్‌కి వెళ్లకుండా ఇంట్లో వుండే పెరుగుతో స్వయంగా ఫేషియల్ చేసుకుని ముఖాన్ని కాంతివంతంగా మార్చుకోవచ్చు. ఆ వివరాలు తెలుసుకుందాం!**



ముందుగా ముఖాన్ని సున్నిపిండితో శుభ్రం చేసుకోవాలి. ఒక గిన్నెలో రెండు గంటెల పుల్లని పెరుగును తీసుకుని చెంచాతో బాగా కలిపి చిక్కని మిశ్రమంలా చేయాలి. దీనిని వేళ్లతో కొద్దిగా తీసుకుంటూ ముఖమంతా పట్టించి అయిదు నిమిషాలు సున్నితంగా మర్దన చేయాలి. పది నిమిషాల తరవాత చల్లని నీళ్లతో ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి. ఇలా వారానికి ఒకసారి చేస్తూ ఉంటే చర్మానికి తగినంత తేమ అంది ముఖం మెరుపు సంతరించుకుంటుంది. పెరుగులో ఉండే లాక్టిక్ యాసిడ్... నుదుటిపై ముడుతలు, గీతలు రాకుండా కాపాడుతుంది. అంతేకాదు బ్లీచింగ్ ఏజెంట్‌లా పనిచేసి ముఖానికి సహజ కాంతిని అందిస్తుంది.
ఒక గిన్నెలో రెండు గంటెల పెరుగు, ఒక చెంచా కాఫీ పొడి, రెండు చెంచాల పంచదార వేసి కలపాలి. పెరుగులో పంచదార కరగడానికి ముందే ఈ మిశ్రమాన్ని వేళ్లతో ముఖమంతా పట్టించాలి. నుదురు, చెంపలు, ముక్కు భాగాల్లో కింది నుంచి పైకి వేళ్లతో సున్నితంగా రుద్దాలి. ఈ మిశ్రమం చక్కని స్క్రబ్‌లా పనిచేసి చర్మ రంధ్రాలను శుభ్రం చేస్తుంది. చర్మం మీద పేరుకున్న మృతకణాలన్నీ తొలగిపోతాయి. తరచూ ఇలా చేస్తూ ఉంటే ముఖం మీద బ్లాక్ హెడ్స్, మొటిమలు రావు. ఎండ వల్ల కలిగే నలుపుదనం కూడా తగ్గిపోతుంది.
చిన్న గిన్నెలో ఒక గంటె పెరుగు, ఒక గంటె టమాటా గుజ్జు వేసి బాగా కలపాలి. మెత్తని బ్రష్ సహాయంతో ముఖంపై కింది నుంచి పైకి దిశలో ఈ మిశ్రమాన్ని పట్టించాలి. కళ్ల మీద గుండ్రంగా తరిగిన టమాటా ముక్కలు పెట్టుకోవాలి. కళ్లు మూసుకుని అరగంట విశ్రాంతి తీసుకోవాలి. తరవాత చల్లని నీళ్లతో ముఖం కడుక్కోవాలి. ఇలా వారానికి ఒకసారి చేస్తూ ఉంటే ముఖం మీద చర్మం బిగుతుగా మారి నున్నగా ఆరోగ్యంగా కనిపిస్తుంది.



# భారీగా పెరిగిన భారత్ ఫారెక్స్ నిలువలు.. వెల్లడించిన ఆర్‌బీఐ డేటా..!



**న్యూఢిల్లీ-నవభూమి:**భారతదేశ ఫారెక్స్ నిలువలు భారీగా పెరిగాయి. గతవారం ఫారెక్స్ నిల్వలు 15.267 బిలియన్లు పెరిగాయని రిజర్వ్ బ్యాంక్ డేటా పేర్కొంది. దాంతో దేశం మొత్తం విదేశీ మారక ద్రవ్య నిలువలు 653.966 బిలియన్లకు చేరాయి. గత మూడేళ్లలో ఒక వారంలో అత్యధికంగా పెరగడం ఇదే తొలిసారి. దాదాపు నాలుగు నెలలుగా విదేశీ మారక ద్రవ్య నిల్వలు తగ్గుతూ వస్తున్నాయి. ఇటీవల 11 నెలల కనిష్ఠానికి చేరుకున్నది. ఆ తర్వాత హెచ్చుతగ్గులు నమోదయ్యాయి. గత సంవత్సరం సెప్టెంబర్ మొదటల్లో భారతదేశ విదేశీ మారక ద్రవ్య నిల్వలు ఆల్ టైమ్ గరిష్ఠ స్థాయి 704.89 బిలియన్ డాలర్లకు చేరాయి. అప్పటి నుంచి ఫారెక్స్ నిలువలు వరుసగా తగ్గుతూ వచ్చాయి.ప్రస్తుతం గరిష్ఠ స్థాయితో పోలిస్తే 7శాతం తక్కువగా ఉన్నాయి. రూపాయి పతనం నేపథ్యంలో రిజర్వ్ బ్యాంక్ జోక్యం వల్లే విదేశీ మారక ద్రవ్యం నిలువలు తగ్గడానికి కారణమని భావిస్తున్నారు. యూఎస్ డాలర్‌తో పోలిస్తే రూపాయి ఇప్పుడు ఆల్‌టైమ్ కనిష్ఠానికి చేరుకుంది. విదేశీ మారక ద్రవ్య నిల్వల్లో అతిపెద్ద భాగమైన.. భారతదేశ విదేశీ కరెన్సీ ఆస్తులు 557.282 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయని ఆర్‌బీఐ డేటా పేర్కొంది. ఈ డేటా ప్రకారం.. ప్రస్తుతం బంగారు నిల్వలు 74.325 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న నిలువలు దాదాపు 10 నుంచి 11 నెలల అంచనా వేసిన దిగుమతులకు సరిపోతాయని అంచనా. 2023లో భారత్ విదేశీ మారక ద్రవ్య నిల్వులకు దాదాపు 58 బిలియన్లు పెంచగా.. 2022లో 71 బిలియన్లు తగ్గాయి. 2024లో 20 బిలియన్లకుపైగా పెరిగాయి.




# ఏప్రిల్ నుంచి కొత్త టీడీఎస్ నిబంధనలు



ఏప్రిల్ 1 నుంచి మూలంలో పన్ను కోత (టీడీఎస)కు సంబంధించి కొత్త నిబంధనలు అమల్లోకి వస్తున్నాయి. ఈ నిబంధనలు సీనియర్ సిటిజన్లతో పాటు సాధారణ పన్ను చెల్లింపుదారులకూ మేలు చేయనున్నాయి. లాటరీల్లో జాక్‌పాట్ కొట్టే వాళ్లు, బీమా ఏజెంట్లపైనా కొత్త నిబంధనలతో టీడీఎస్ భారం తగ్గనుంది. దీనికి సంబం?ధించి మరిన్ని వివరాలు తెలుసుకుందాం.2025-26 కేంద్ర బడ్జెట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ టీడీఎస్‌కు సంబంధించి పలు మార్పులు ప్రకటించారు. దీంతో ఆదాయ పన్ను (ఐటీ) చెల్లింపుదారులకు ముఖ్యంగా సీనియర్ సిటిజన్లకు చాలా మేలు జరగనుంది. కమిషన్ ఏజెంట్లు, ఇన్వెస్టర్లకి కూడా ఈ కొత్త నిబంధనలు మేలు చేయనున్నాయి.

సీనియర్ సిటిజన్లకు: మధ్య తరగతి ప్రజలు, సీనియర్ సిటిజన్ల చేతిలో మరిన్ని డబ్బులు ఉంచాలన్నది 2025-26 ఆర్థిక సంవత్సర బడ్జెట్ ప్రధాన లక్ష్యం. ఇందుకోసం టీడీఎస్ పరిధిలోకి వచ్చే సీనియర్ సిటిజన్ల వార్షిక వడ్డీ ఆదాయాన్ని ఆర్థిక మంత్రి రెట్టింపు చేశారు. ఏప్రిల్ 1 నుంచి ఒక బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్లు (ఎఫ్‌డీ), రికరింగ్ డిపాజిట్ల (ఆర్‌డీ)పై వీరికి వచ్చే వార్షిక వడ్డీ ఆదాయం రూ.లక్ష లోపు ఉంటే ఆ ఆదాయానికి టీడీఎస్ వర్తించదు.సాధారణ ప్రజలకూ ఊరట: సాధారణ ప్రజల వడ్డీ ఆదాయానికీ మొన్నటి కేంద్ర బడ్జెట్‌లో కొద్దిగా ఊరట లభించింది. 2025 ఏప్రిల్ 1 నుంచి ఒక ఆర్థిక సంవత్సరంలో ఒక నాన్-సీనియర్ సిటిజన్ వార్షిక వడ్డీ ఆదాయం రూ.50,000 మించకుండా ఉంటే బ్యాంకులు, ఆ వడ్డీ ఆదాయంపై టీడీఎస్ కట్ చేయవు.లాటరీ టిక్కెట్లు, గుర్రప్పందాల ఆదాయం: లాటరీ టిక్కెట్లు, క్రాస్‌వర్డ్ పజిల్స్, గుర్రప్పందాల జాక్‌పాట్ ఆదాయానికి ఏపిల్ 1 నుంచి కొద్దిగా ఉపశమనం లభించనుంది. గతంలో ఒక ఆర్థిక సంవత్సరంలో ఈ మార్గాల్లో వచ్చే మొత్తం ఆదాయం రూ.10,000 మించితే టీడీఎస్ పడేది. ఇప్పుడు నిబంధనలు మార్చి ఒక్కో దానిపై వచ్చే వార్షిక ఆదాయం రూ.10,000 మించకుండా ఉంటే చాలని స్పష్టం చేశారు. అంటే ఒక వ్యక్తికి ఒక ఆర్థిక సంవత్సరంలో లాటరీ టిక్కెట్‌పై రూ.8,000, క్రాస్ వర్డ్ పజిల్ ద్వారా రూ.8,000, గుర్రప్పందంపై బెట్టింగ్ ద్వారా రూ.8,000 ఆదాయం వచ్చిందనుకున్నాం. పాత నిబంధనల ప్రకారం ఈ మూడింటిని కలిపి రూ.10,000కు మించిన ఆదాయంపై టీడీఎస్ కట్ అయ్యేది. ఇప్పుడు ఒక్కోదానిపై రూ.8,000 చొప్పున రూ.24,000 వార్షిక ఆదాయం వచ్చినా పైసా టీడీఎస్ కూడా కట్ కాదు.బీమా ఏజెంట్లు, బ్రోకర్లకూ ఊరట: వివిధ రకాల కమిషన్ల ఆదాయానికి సంబంధించిన టీడీఎస్ నిబంధనలనూ బడ్జెట్‌లో సవరించారు. గతంలో ఈ వార్షిక కమిషన్ ఆదాయం రూ.15,000 మించితే టీడీఎస్ వర్తించేది. ఇప్పుడు ఆ పరిమితిని రూ.20,000కు పెంచారు. బీమా ఏజెంట్లు, స్టాక్ బ్రోకర్లకు ఇది ఎంతో కొంత మేలు చేస్తుందనడంలో సందేహం లేదు.ఎంఎఫలు, షేర్లపై టీడీఎస్: మ్యూచువల్ ఫండ్ (ఎంఎఫ్) సంస్థలు, కంపెనీల నుంచి యూనిట్ హోల్డర్లు, వాటాదారులకు అందే వార్షిక డివిడెండ్ ఆదాయం గతంలో రూ.5,000 మించితే టీడీఎస్ వర్తించేది. ఏప్రిల్ 1 నుంచి ఈ మినహాయింపు పరిమితి రూ.10,000కు పెరగనుంది.

# సన్‌రైజర్స్‌తో సీయూబీ జట్టు




**హైదరాబాద్-నవభూమి:** ప్రైవేట్ రంగంలోని సిటీ యూనియన్ బ్యాంక్ (సీయూబీ).. సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్‌ఆర్‌హెచ్)కు ప్రత్యేక బ్యాంకింగ్ భాగస్వామిగా వ్యవహరించనుంది. ఈ మేరకు ఎస్‌ఆర్‌హెచ్‌తో భాగస్వామ్యాన్ని కుదుర్చుకున్నట్లు ప్రకటించింది. ఇందులో భాగంగా ఎస్‌ఆర్‌హెచ్ అభిమానులు, క్రికెటర్లు, సిబ్బంది కోసం కస్టమైజ్డ్ సేవలతో పాటు ప్రత్యేక ఆఫర్లను అందించనున్నట్లు సీయూబీ చైర్మన్ మహాలింగం, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విజయ్ ఆనంద్ తెలిపారు. ఎస్‌ఆర్‌హెచ్ అభిమానుల కోసం ప్రత్యేక పొదుపు ఖాతాలు, రుణాలు, కో-బ్రాండెడ్ క్రెడిట్, డెబిట్ కార్డులను ప్రత్యేకంగా డిజైన్ చేసినట్లు విజయ్ చెప్పారు. అలాగే ఎస్‌ఆర్‌హెచ్‌కు చెందిన జెర్సీలు, క్యాప్స్, ఇతర వస్తువుల కొనుగోలుపై ప్రత్యేక ఆఫర్లతో పాటు డిజిటల్ బ్యాకింగ్ సేవలను అందించనున్నట్లు తెలిపారు.

ఎస్‌ఆర్‌హెచ్ కో-బ్రాండెడ్ క్రెడిట్, డెబిట్ కార్డుల కోసం రూపే, మాస్టర్ కార్డ్‌తో జట్టు కట్టినట్లు ఆయన పేర్కొన్నారు. కాగా తొలిసారిగా రూపే వర్చువల్ క్రెడిట్ కార్డ్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు. మొత్తం నాలుగు రకాల క్రెడిట్ కార్డులను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు విజయ్ వెల్లడించారు. ప్రస్తుతం సీయూబీ దేశవ్యాప్తంగా 840 శాఖలను నిర్వహిస్తుండగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో 90 శాఖలను కలిగి ఉందన్నారు.

# ఇండ్‌సఇండ్ ఖాతాదారులూ ఆందోళన వద్దు..

**న్యూఢిల్లీ-నవభూమి:**హిందూజా గ్రూప్‌నకు చెందిన ఇండ్‌సఇండ్ బ్యాంక్ తగినంత మూలధన నిల్వలను కలిగి ఉందని, బ్యాంక్ ఆర్థిక పరిస్థితి స్థిరంగానే ఉందని ఆర్‌బీఐ శనివారం ప్రకటన జారీ చేసింది. బ్యాంక్ కార్యకలాపాలనూ తామూ నిశితంగా గమనిస్తున్నట్లు తెలిపింది. అలాగే, బ్యాంక్‌లో వెలుగు చూసిన అకౌంటింగ్ లోపాలకు సంబంధించి ఈ నెలాఖరులోగా నివారణ చర్యలను పూర్తి చేయాలని ఇండ్‌సఇండ్ బ్యాంక్ బోర్డు, యాజమాన్యాన్ని ఆదేశించింది. తమ డెరివేటివ్ పోర్ట్‌ఫోలియోలో రూ.2,100 కోట్ల అకౌంటింగ్ వ్యత్యాసాన్ని గుర్తించామని, ఇది బ్యాంక్ విలువను దాదాపు 2.35 శాతం వరకు ప్రభావితం చేయవచ్చని ఇండ్‌సఇండ్ బ్యాంక్ ఈ వారంలో వెల్లడించింది. దాంతో బ్యాంక్ షేరు భారీగా క్షీణించడంతో చిన్న మదుపరులు, ఇతర ఇన్వెస్టర్లు నష్టపోవాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో బ్యాంక్ ఆర్థిక పరిస్థితిపై ఖాతాదారుల్లోనూ ఆందోళనలు పెరగడంతో ఆర్‌బీఐ రంగంలోకి దిగింది.

# ఆ పథకాల్లో పెట్టుబడితో పన్ను బాదుడికి చెక్.. మరో 15 రోజులే గడువు




**న్యూఢిల్లీ-నవభూమి:**ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2024-25 మార్చి 31న ముగియనుంది. ఐటీఆర్ సీజన్ 2025 ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమవుతుంది. పాత పన్ను విధానంలో 2025 ఆర్థిక సంవత్సరానికి కొంత ఆదాయపు పన్ను ఆదా చేసేలా ఎన్‌పీఎస్, ఈఎల్ఎస్ఎస్, పీపీఎఫ్ వంటి పన్ను ఆదా సాధనాలలో పెట్టుబడి పెట్టడానికి పన్ను చెల్లింపుదారులకు మార్చి 31 వరకు దాదాపు 15 రోజులు మాత్రమే మిగిలి ఉన్నాయి. ముఖ్యంగా ఆదాయపు పన్ను చట్టంలోకి కొన్ని సెక్షన్ల వివరించిన పెట్టుబడి పథకాల్లో పెట్టుబడితో భారీగా పన్ను ఆదా చేయవచ్చు. ఆ చట్టాల గురించి మరిన్ని వివరాలను తెలుసుకుందాం.

**సెక్షన్ 80సీ**

సెక్షన్ 80సీ అనేది అత్యంత విస్తృతంగా ఉపయోగించే పన్ను ఆదా మార్గం. ఇది ఒక ఆర్థిక సంవత్సరానికి రూ. 1.5 లక్షల వరకు తగ్గింపులను అనుమతిస్తుంది. ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్, పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్, జాతీయ పొదుపు ధ్రువీకరణ పత్రం (ఎన్ఎస్‌సీ), ఫిక్స్‌డ్ డిపాజిట్లు, ఈక్విటీ-లింక్డ్ సేవింగ్స్ స్కీమ్స్, జీవిత బీమా ప్రీమియంలు, సుకన్య సమృద్ధి యోజన వంటి పథకాల్లో పెట్టుబడితో ఆదాయపు పన్ను ఆదా చేయవచ్చు.

**సెక్షన్ 80డీ**

ఈ సెక్షన్ ద్వారా ఆరోగ్య బీమా ప్రీమియంలను చెల్లించే ఆదాయపు పన్ను మినహాయింపు పొందవచ్చు. పర్సనల్, కుటుంబం, తల్లిదండ్రుల వైద్య బీమా కోసం చెల్లించే ప్రీమియంలపై ఆదాయపు పన్ను మినహాయింపులు ఇస్తారు. పర్సనల్, భార్య, పిల్లలకు రూ. 25,000. తల్లిదండ్రులు సీనియర్ సిటిజన్లు అయితే రూ. 50,000, అలాగే ఆరోగ్య పరీక్షల కోసం అదనంగా రూ. 5,000 మినహాయింపు ఇస్తారు.

**సెక్షన్ 80ఈ**

విద్యా రుణాలపై చెల్లించే వడ్డీపై కూడా ఆదాయపు పన్ను మినహాయింపు ఉంటుంది. ఉన్నత చదువుల కోసం విద్యా రుణాలపై చెల్లించే వడ్డీని పూర్తిగా తగ్గించవచ్చు. తగ్గింపు మొత్తానికి పరిమితి లేదు, కానీ తిరిగి చెల్లింపు ప్రారంభం నుంచి 8 సంవత్సరాల వరకు ప్రయోజనం అందుబాటులో ఉంటుంది.

సెక్షన్ 80ఈఈ, 80ఈఈఏ

గృహ రుణ వడ్డీ చెల్లింపుపై కూడా పన్ను మినహాయింపులను పొందవచ్చు. సెక్షన్ 80 ఈఈ ద్వారా మొదటిసారి ఇల్లు కొనుగోలు చేసేవారికి గృహ రుణ వడ్డీపై రూ. 50,000 అదనపు మినహాయింపు పొందవచ్చు. 80 ఈఈఏ ద్వారా సరసమైన గృహ రుణాలకు రూ. 1.5 లక్షల అదనపు మినహాయింపు పొందవచ్చు.

**సెక్షన్ 80జీ**

ధార్మిక సంస్థలకు ఇచ్చే విరాళాలపై ఆదాయపు పన్ను మినహాయింపు పొందవచ్చు. అర్హత కలిగిన దాతృత్వ సంస్థలు, సహాయ నిధులకు ఇచ్చే విరాళాలు తగ్గింపులకు అర్హత పొందుతాయి. కొన్ని విరాళాలు 100 శాతం తగ్గింపునకు అర్హత ఉంటే మరికొన్ని 50 శాతం మినహాయింపుకు అనుమతిస్తాయి.

**సెక్షన్ 80 జీజీ**

మీ హెచ్ఆర్ఏ జీతంలో భాగం కాకపోతే చెల్లించిన అద్దెపై మినహాయింపు వస్తుంది. సంవత్సరానికి రూ. 60,000 లేదా మొత్తం ఆదాయంలో 25శాతం గరిష్టంగా మినహాయింపు పొందవచ్చు.

# పెళ్లి వేళ పసిడి వెలవెల



**న్యూఢిల్లీ-నవభూమి:**'ఏం వదిన గారు..!! పెళ్లికి మా అమ్మాయికి మీరు ఎన్ని తులాల బంగారం పెడతారు? ఏయే నగలు ఇస్తారు?..' 'ఆ సంగతి సరే కానీ.. మా అబ్బాయికి మీరెన్ని తులాలు పెడతారో ముందు అది చెప్పండి?'.. పెళ్లి ఖాయం చేసుకున్నాక పెట్టిపోతల అంశంలో జరిగే చర్చల్లో సర్వసాధారణంగా వినిపించే మాటలివి.. ఎన్ని తరాలైనా ఈ మాటలు మారలేదు కానీ..వధూవరులకు పెట్టే బంగారం బరువు మాత్రం తులాల నుంచి ప్రస్తుతం గ్రాములకు తగ్గిపోయింది. బంగారం ధరలు ఆకాశాన్ని తాకుతుండడంతో సామాన్య, మధ్య తరగతి ఇళ్లలో జరిగే పెళ్లి సందడిలో పసిడి కాంతులు తగ్గిపోయాయి..!!'బంగారం ధరలు ఇలానే పెరుగుతూపోతే..

**మంగళసూత్రాల ఫొటోను ఫోన్‌లో చూపించి మెడలో పసుపుతాడు కట్టాల్సిందే..!!'**

'ఒకప్పుడు పెళ్లికి ఎంత ఖర్చవుతుందని లెక్కలేసుకుంటే ఆ బడ్జెట్ చూసి గుండెల్లో దడ పుట్టేది. కానీ, ఇప్పుడు పెళ్లి బడ్జెట్‌లో బంగారం లెక్క చూస్తేనే బీపీ, షుగర్ వచ్చేస్తున్నాయి..' రోజురోజుకి పెరుగుతున్న పసిడి ధరలను, పెళ్లి ఖర్చులతో లింక్ చేస్తూ చక్కర్లు కొడుతున్న జోకులివి..నవ్వుకోవడానికి బాగానే ఉన్నా ప్రస్తుత పరిస్థితులు నిజంగా ఇలానే ఉన్నాయి. బంగారం ధరలు రోజురోజుకి పెరిగిపోతుండడంతో పేద, మధ్య తరగతి, సామాన్య ప్రజలు బంగారం పేరు చెబితేనే 'అయ్య బాబోయ్' అనేలా పరిస్థితులు మారాయి. భారతీయులు ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల ప్రజల ఇళ్లలో జరిగే పెళ్లిల్లో బంగారానికి ఉన్న ప్రాధాన్యం అంతాఇంతా కాదు. పెళ్లి కూతురు, పెళ్లి కుమారుడికి పెట్టే బంగారంపై ఆయా కుటుంబాల్లో పెద్ద చర్చ జరగాల్సిందే. కొన్ని ఇళ్లలో అయితే పెళ్లాయ్యాక ఫలానా పండుగకు అబ్బాయికి ఇంత బంగారం పెడతామని, అమ్మాయికి ఫలానా నగ చేయిస్తామనే ఒప్పందాలు కూడా జరుగుతాయి. కానీ ఇప్పుడా ఆ పరిస్థితి లేనేలేదు సరికదా.. తమ ఇంట్లో గతంలో జరిగిన వివాహాలప్పుడు ఎంత బంగారం పెట్టామనే విషయాన్ని పెళ్లి మాటల్లో బయటకు చెప్పడానికి కూడా కొందరు సాహసించడం లేదు. పండుగలు, ఇతర శుభకార్యాల అప్పుడు బంగారం పెట్టడం అనే మాటే చాలా ఇళ్లలో అసలు రావడం లేదు.

**బంగారం బదులుగా డబ్బులు..!**

పెరిగిన రేట్ల వల్ల సామాన్యులు తమ పిల్లల పెళ్లిళ్లకు నాలుగు నుంచి ఆరు తులాలు పెట్టడమే కష్టంగా భావిస్తున్నారు. పిల్లల పెళ్లి కోసం ఎప్పట్నించో ప్రణాళికతో పొదుపు చేసిన వారిని మినహాయిస్తే.. చాలామంది బంగారం అంశంలో మమ అనిపిస్తున్నారు. బంగారం బదులు నగదు, ఇతర కానుకలు ఇస్తూ పెళ్లివారిని శాంతింపజేస్తున్నారు. మరికొందరు బంగారానికి సరిపడా ధర ఉండే భూములను ఇస్తున్నారు.

**కరోనా తర్వాత నుంచి మొదలు..!**

ప్రస్తుతం 10 గ్రాముల బంగారం ధర రూ.89,790 దాకా ఉంది. ఏదైనా ఆభరణాలు చేయించుకుంటే తయారీ చార్జీలు, తరుగు, పన్నులు అని ఇది రూ.లక్ష దాటేస్తోంది. నిజానికి, కరోనా రాకముందు బంగారం ధరలు అన్ని వర్గాలకు కాస్త అందుబాటులో ఉండేవి. 2019లో 24 క్యారట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.35,220 (జీఎస్టీతో కలిపి) ఉండేది. అయితే, లాక్‌డౌన్ సమయంలో, లాక్‌డౌన్ ఎత్తేసిన తర్వాత బంగారం ధరలకు ఒక్కసారిగా రెక్కలొచ్చాయని వ్యాపారులు చెబుతున్నారు. ప్రస్తుత పరిస్థితులను చూస్తుంటే మరికొద్ది రోజుల్లోనే 10 గ్రాముల బంగారం ధర రూ.లక్షకు చేరేలా ఉందని వ్యాపారులు అభిప్రాయపడుతున్నారు.

**పడిపోయిన వ్యాపారం**

పేద, సామాన్య, మధ్య తరగతి ప్రజలు బంగారం కొనుగోళ్లకు దూరంగా ఉండడంతో బంగారం దుకాణాల్లో వ్యాపారాలు భారీగా తగ్గిపోయాయి. ఒకప్పుడు రెండు, మూడు తులాలు కొనుగోలు చేసిన వారు కూడా ప్రస్తుతం మూడు, నాలుగు గ్రాములతో సరిపెడుతున్నారని చాలా మంది వ్యాపారులు వాపోతున్నారు. అక్షయ తృతీయ సమయంలో తప్పితే.. ఇతర సందర్భాల్లో మధ్య తరగతి కష్టమర్ల నుంచి గిరాకీ ఉండడంలేదని ముషీరాబాద్‌కు చెందిన సత్యనారాయణ అనే వ్యాపారి తెలిపారు.

**తగ్గేదేలే అంటున్న సంపన్నులు..**

ముగ్గురు ఆడపిల్లల తండ్రైన సికింద్రాబాద్‌కు చెందిన వెంకటేశ్వర్లు అనే రైల్వే ఉద్యోగి.. ఎనిమిదేళ్ల క్రితం పెద్ద కూతురికి పెళ్లి చేసినప్పుడు 8తులాల బంగారం పెట్టాడు. నాలుగేళ్ల క్రితం రెండో కూతురి పెళ్లి చేసినప్పుడు కూడా 8తులాలు ఇచ్చాడు. గత నెల చిన్న కుమార్తెకు పెళ్లి చేసినప్పుడు 4తులాలు ఇచ్చాడు. ఇక, కూకట్‌పల్లికి చెందిన కృష్ణారావు అనే ఓ ప్రైవేటు ఉద్యోగి తన మనవడికి మొదటి పుట్టినరోజున బంగారు గొలుసు కానుకగా ఇద్దామని దుకాణానికి వెళ్లగా 10గ్రాముల గొలుసు ధర రూ.80,500 ఉండడం చూసి అవాక్కయ్యాడు. పెరుగుతున్న ధరలను చూసి వెంకటేశ్వర్లు, కృష్ణారావు వంటి సామాన్య, మధ్య తరగతి ప్రజలు బంగారం అంటేనే వామ్మో అంటుంటే.. సంపన్నులు మాత్రం తగ్గేదేలే అంటున్నారు. తమ ఇళ్లల్లో జరిగే పెళ్లి వేడుకలప్పుడు కిలోల లెక్కన బంగారాన్ని కొనుగోలు చేస్తున్నారు. ఆడవాళ్లు ఆపాదమస్తకం రకరకాల నగలు ధరిస్తుంటే.. మగవారు కూడా నగలు ధరించి హడావుడి చేస్తున్నారు. సంపన్నులు కదా మరీ..!!

# రూ. 2 లక్షల వరకు పూచీకత్తు లేకుండా లోన్.. అందుకు ఏం చేయాలంటే..



**న్యూఢిల్లీ-నవభూమి:**భారతదేశంలో పునరుత్పాదక ఇంధన విభాగంలో విప్లవాత్మక మార్పును తెస్తూ, ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లి యోజన దేశంలోని లక్షలాది కుటుంబాలకు ఉచిత సౌరశక్తిని అందిస్తోంది. ప్రపంచంలోనే అతిపెద్ద రూఫ్‌టాప్ సోలార్ చొరవగా పేరుగాంచిన ఈ పథకం ఇప్పటివరకు 10 లక్షల ఇళ్లకు సోలార్ ఎనర్జీ అందించింది. కేంద్ర ప్రభుత్వం అక్టోబర్ నాటికి ఈ సంఖ్యను 20 లక్షలకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. 2027 మార్చి నాటికి కోటి ఇళ్లకు సౌరశక్తిని సరఫరా చేయాలనే ఉద్దేశంతో ఈ స్కీం ముందుకు సాగుతోంది.

ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లి యోజన లక్ష్యాలు

పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి ప్రకటన ప్రకారం ఈ స్కీం ద్వారా ఇప్పటివరకు 1 మిలియన్ ఇళ్లకు పైగా సౌరశక్తిని అందించామన్నారు. ఇది భారతదేశ పునరుత్పాదక ఇంధన లక్ష్యాలను చేరుకునేందుకు చాలా కీలకమైన ముందడుగని చెప్పవచ్చు.

ఈ పథకం ప్రయోజనాలు ఏంటి?

గృహ యజమానులకు సౌర ఫలకాలను అమర్చుకోవడానికి 40% వరకు సబ్సిడీ

12 ప్రభుత్వ రంగ బ్యాంకులు 6.75% సబ్సిడీ వడ్డీ రేటుతో రూ. 2 లక్షల వరకు పూచీకత్తు లేకుండా రుణాలను అందిస్తున్నాయి

రూ. 78,000 వరకు సబ్సిడీ లభించనుంది

సంవత్సరానికి కేవలం 6.75% వడ్డీ రేటుతో రూ. 6 లక్షల వరకు రుణం తీసుకునే ఛాన్స్

రూ. 2 లక్షల వరకు రుణాలకు ఎలాంటి ఆదాయ పత్రాలు అవసరం లేదు

మొత్తం ఖర్చులో 90% వరకు బ్యాంకు ఫైనాన్స్ సదుపాయం

అర్హత ప్రమాణాలు

దరఖాస్తు దారుడు తప్పనిసరిగా భారతీయ పౌరుడై ఉండాలి

సౌర ఫలకాలను అమర్చడానికి అనువైన పైకప్పు గల ఇంటి యజమానిగా ఉండాలి

ఇంటికి చెల్లుబాటు అయ్యే విద్యుత్ కనెక్షన్ ఉండాలి

ఇంతకు ముందు ఎలాంటి ఇతర ప్రభుత్వ సబ్సిడీని పొందకూడదు

ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లి యోజనకు దరఖాస్తు విధానం

ముందుగా అధికారిక వెబ్‌సైట్ %https://pmsuryaghar.gov.in%/ ను సందర్శించండి

వినియోగదారుల ట్యాబ్‌లో "ఇప్పుడే దరఖాస్తు చేసుకోండి" అనే ఆప్షన్‌ను ఎంచుకోండి (లేదా) "కన్స్యూమర్ లాగిన్" పై క్లిక్ చేయండి

మీ మొబైల్ నంబర్‌ను నమోదు చేసి, ఓటీపీ ద్వారా ధృవీకరించండి

మీ పేరు, రాష్ట్రం, ఇతర వ్యక్తిగత వివరాలను నమోదు చేసి, ఇమెయిల్ ఐడీ ధృవీకరించండి

మీరు అవసరమైతే విక్రేత ఎంపికకు "అవును" లేదా "కాదు" అనే ఆప్షన్‌ను ఎంచుకోండి.'సోలార్ రూఫ్‌టాప్ కోసం దరఖాస్తు చేసుకోండి' పై క్లిక్ చేసి, మీ రాష్ట్రం, జిల్లా డిస్కామ్ వంటి ఇతర వివరాలను నమోదు చేయండిసాధ్యాసాధ్య అంగీకారాన్ని పొందిన తర్వాత, విక్రేతను ఎంపిక చేసుకుని మీ బ్యాంక్ వివరాలను సమర్పించండి

ఆపై మీ సబ్సిడీ మంజూరైన తర్వాత సోలార్ ప్లాంట్‌ను అమర్చుకోవచ్చు

ఈ పథకం ప్రాముఖ్యత..ఈ పథకం ప్రధానంగా దేశంలోని మధ్య తరగతి కుటుంబాలకు తక్కువ ఖర్చుతో విద్యుత్ అందించడమే లక్ష్యంగా పనిచేస్తుంది. దీని వల్ల విద్యుత్ ఖర్చులు గణనీయంగా తగ్గడంతో పాటు, దేశంలో పునరుత్పాదక ఇంధన వినియోగాన్ని ప్రోత్సహించడంలో కీలకపాత్ర పోషిస్తుంది. మీరు కూడా ఈ పథకం ద్వారా లబ్ధి పొందాలనుకుంటే, వెంటనే పైన చెప్పిన విధంగా దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేసుకోండి మరి.

# 2025లో బంగారం కంటే వెండి రేటు పెరిగే ఛాన్స్.. కారణమిదే..




**న్యూఢిల్లీ-నవభూమి:**దేశంలో ప్రస్తుతం గోల్డ్ రేటు దాదాపు 90 వేల స్థాయికి చేరింది. కానీ ఓ నివేదిక మాత్రం బంగారం, కంటే వెండి రేటు ఇంకా పెరిగే అవకాశం ఉందని చెబుతోంది. అవును మీరు విన్నది నిజమే. అయితే ఇప్పటికే వెండి రేటు కిలోకు లక్ష రూపాయలను దాటేసింది. ప్రపంచ పెట్టుబడి సంస్థ విజ్డమ్ ట్రీ తాజా నివేదిక ప్రకారం 2025లో వెండి, బంగారం కంటే ఎక్కువ పెరుగుతుందన్నారు. ఈ క్రమంలో వెండిపై పెట్టుబడులు చేసే వారు మంచి లాభాలను పొందవచ్చని అంచనా వేసింది. అయితే దీనికి కారణాలు కూడా ఉన్నాయని తెలిపింది.

**గత ఏడాది ఇలా..**

విజ్డమ్ ట్రీ నివేదిక ప్రకారం బంగారం ధర 2024 చివరి నాటికి 17% పెరుగుతుందని అంచనా వేస్తే, అదే సమయంలో వెండి 23% పెరుగుతుందని అంచనా వేసింది. ఈ వృద్ధికి ప్రధానంగా పారిశ్రామిక రంగంలో వెండి వినియోగం పెరగడమేనని తెలిపింది. ఫోటోవోల్టాయిక్ (సౌర ప్యానెల్), 5G విస్తరణ, ఆటోమోటివ్ ఎలక్ట్రానిక్స్, డేటా సెంటర్లు సహా పలు ఉత్పత్తుల్లో వెండి వినియోగం పెరగడం వల్ల, దీని డిమాండ్ రికార్డు స్థాయికి చేరుకుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

పారిశ్రామిక రంగంలో వెండి వినియోగం

సౌర విద్యుత్ రంగం: అధిక సామర్థ్యం గల N రకం సౌర ప్యానెల్ వినియోగం పెరగడం వల్ల వెండి డిమాండ్ మరింత పెరుగుతోంది. ఈ క్రమంలో 2025లో ఫోటో వోల్టాయిక్ ఇన్‌స్టాలేషన్‌లు మరిన్ని నమోదవుతాయని అంచనా వేస్తున్నారు.

ఎలక్ట్రానిక్, టెలి కమ్యూనికేషన్ రంగం: 5G నెట్‌వర్క్ విస్తరణలో వెండి కూడా కీలక పాత్ర పోషిస్తుంది. ఈ క్రమంలో 5%G% టవర్లు, యాంటెన్నాలు, మైక్రోచిప్ తయారీలో వెండి వినియోగం పెరుగుతోంది.

ఆటోమోటివ్ పరిశ్రమ: ఎలక్ట్రిక్ వెహికల్స్ పెరుగుతున్న నేపథ్యంలో, వెండి వినియోగం పెరుగుతోంది. బ్యాటరీ ఛార్జింగ్ మౌలిక సదుపాయాలు, అధునాతన సెన్సార్‌లు, ఆటోమేటిక్ డ్రైవింగ్ టెక్నాలజీల్లో వెండి ప్రధానంగా ఉంటుంది.

డేటా సెంటర్లు, అధునాతన కంప్యూటింగ్ విభాగాల్లో కూడా వెండి వినియోగం అధికమవుతోంది. ఆధారిత సూపర్ కంప్యూటర్లు, క్లౌడ్ స్టోరేజీ కోసం వెండి ఉపయోగం పెరుగుతోంది.

**సరఫరా పరిమితులు కూడా..**

వెండి నిల్వల పరిమితి కూడా దీని గణనీయమైన ధర పెరుగుదలకు కారణమవుతుంది. భూమిపై ఉన్న వెండి నిల్వలు క్రమంగా తగ్గుతున్నాయి. కొన్ని ప్రముఖ వెండి మైనింగ్ కంపెనీలు ఉత్పత్తి పరిమితులను ఎదుర్కొంటున్నాయి. దీని ప్రభావం మార్కెట్‌పై కనిపిస్తోంది. ఈ క్రమంలో పెట్టుబడిదారులు అధిక ధరలకు వెండి అమ్మేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ఈ క్రమంలో వెండిని దీర్ఘకాలిక పెట్టుబడిగా పరిగణించాలని నిపుణులు సూచిస్తున్నారు. 2025లో పారిశ్రామిక డిమాండ్ పెరుగుతుందనే అంచనాలు ఉన్నందున దీని విలువ పెరిగే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.



# ఇండ్‌సఇండ్ ఖాతాదారులూ ఆందోళన వద్దు..

**న్యూఢిల్లీ-నవభూమి:** హిందూజా గ్రూప్‌నకు చెందిన ఇండ్‌సఇండ్ బ్యాంక్ తగినంత మూలధన నిల్వలను కలిగి ఉందని, బ్యాంక్ ఆర్థిక పరిస్థితి స్థిరంగానే ఉందని ఆర్‌బీఐ శనివారం ప్రకటన జారీ చేసింది. బ్యాంక్ కార్యకలాపాలనూ తామూ నిశితంగా గమనిస్తున్నట్లు తెలిపింది. అలాగే, బ్యాంక్‌లో వెలుగు చూసిన అకౌంటింగ్ లోపాలకు సంబంధించి ఈ నెలాఖరులోగా నివారణ చర్యలను పూర్తి చేయాలని ఇండ్‌సఇండ్ బ్యాంక్ బోర్డు, యాజమాన్యాన్ని ఆదేశించింది. తమ డెరివేటివ్ పోర్ట్‌ఫోలియోలో రూ.2,100 కోట్ల అకౌంటింగ్ వ్యత్యాసాన్ని గుర్తించామని, ఇది బ్యాంక్ విలువను దాదాపు 2.35 శాతం వరకు ప్రభావితం చేయవచ్చని ఇండ్‌సఇండ్ బ్యాంక్ ఈ వారంలో వెల్లడించింది. దాంతో బ్యాంక్ షేరు భారీగా క్షీణించడంతో చిన్న మదుపరులు, ఇతర ఇన్వెస్టర్లు నష్టపోవాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో బ్యాంక్ ఆర్థిక పరిస్థితిపై ఖాతాదారుల్లోనూ ఆందోళనలు పెరగడంతో ఆర్‌బీఐ రంగంలోకి దిగింది.



## ముగ్గురు పిల్లలను చంపి.. ఆత్మహత్య చేసుకున్న తండ్రి




**రాంచీ-నవభూమి:** తండ్రైన వ్యక్తి తన ముగ్గురు పిల్లలను హత్య చేశాడు. ఆ తర్వాత ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సమాచారం తెలిసి పోలీసులు ఆ ఇంటికి చేరుకున్నారు. భార్య ఇంట్లో లేని సమయంలో ఈ సంఘటన జరిగినట్లు తెలుసుకున్నారు. జార్కండ్‌లోని గిరిదిహ్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. మహేశ్‌లిటి గ్రామంలోని ఒక ఇంటి తలుపులు ఆదివారం ఉదయం తెరుచుకోలేదు. దీంతో అనుమానించిన స్థానికులు లోపలకు వెళ్లి చూశారు. ఒక వ్యక్తి మృతదేహం సీలింగ్‌కు వేలాడుతుండగా, అతడి పిల్లల మృతదేహాలు ఆ సమీపంలో కింద ఉండటాన్ని గమనించి షాక్ అయ్యారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు.

కాగా, పోలీసులు ఆ ఇంటికి చేరుకున్నారు. మృతులను 36 ఏళ్ల సనాల్ అన్సారీ, ఇద్దరు కుమార్తెలైన 12 ఏళ్ల అఫ్రీన్ పర్వీన్, 8 ఏళ్ల జైబా నాజ్, ఆరేళ్ల కుమారుడు సఫాల్ అన్సారీగా గుర్తించారు. ముగ్గురు పిల్లల గొంతునొక్కి హత్య చేసిన తర్వాత సనాల్ ఆత్మహత్య చేసుకున్నట్లు భావిస్తున్నారు. పుట్టింటికి వెళ్లిన మృతుడి భార్యకు ఈ విషయం తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వివాదాస్పద షాహి జామా మసీదుకు పెయింటింగ్..



**న్యూఢిల్లీ-నవభూమి:** ఉత్తర్ ప్రదేశ్‌లోని సంభాల్ మొఘల్ కాలం నాటి షాహి జామా మసీదు సర్వే సందర్భంగా గత ఏడాది నవంబర్ 24న పెద్ద ఎత్తున హింస చెలరేగింది. ఈ ఘటనలో నలుగురు మరణించగా, పోలీసులు సహా పలువురు గాయపడ్డారు. దీంతో ఈ మసీదు సర్వే చర్చనీయాంశంగా మారింది. అయితే ఇటీవల రంజాన్ సందర్భంగా ఈ మసీదుకు పెయింటింగ్ వేయడానికి అనుమతి ఇవ్వాలని షాహి జామా మసీదు కమిటీ అలహాబాద్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. విచారణ చేపట్టిన కోర్టు వారంలోపు పనిని పూర్తి చేయాలని ఆదేశించింది. అయితే హిందూ పక్షం మాత్రం దీనిపై అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇక్కడ హరిహర ఆలయం ఉందని హిందూ బృందం చెబుతోంది. ఇలాంటి సమయంలో ఎలా అనుమతి ఇస్తారని ప్రశ్నించింది.

**బయటి గోడలకు**

అలహాబాద్ హైకోర్టు ఆదేశాన్ని అనుసరించి ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్‌లో ఈరోజు (ఆదివారం, మార్చి 16) పెయింటింగ్ పనులు ప్రారంభమయ్యాయి. మార్చి 12న మసీదు బయటి గోడలకు రంగులు వేసుకునేందుకు హైకోర్టు పర్మిషన్ ఇచ్చింది. ఈ ప్రక్రియలో ఎటువంటి చారిత్రక నిర్మాణం దెబ్బతినకూడదని, నిర్మాణాన్ని ప్రభావితం చేయకుండా పని చేపట్టాలని హైకోర్టు ఆదేశించింది. ఆ తర్వాత కార్మికులు ఈరోజు నుంచి తమ పనిని ప్రారంభించారు. గురువారం ముందుగా పెయింట్ చేయాల్సిన ప్రాంగణాన్ని కొలిచారు. ఆ తర్వాత నేటి నుంచి పని ప్రారంభమైంది. కోర్టు ఆదేశాల మేరకు, ఈ మొత్తం పని భారత పురావస్తు సర్వే సంస్థ అంటే ASI పర్యవేక్షణలో జరుగుతోంది. జరగాల్సిన ప్రాంతాన్ని..శనివారం కూడా ASI బృందం పెయింటింగ్ పని చేస్తున్న వ్యక్తులతో పాటు మసీదుకు చేరుకుంది. వైట్‌వాషింగ్ పనులు జరగాల్సిన ప్రాంతాన్ని కూడా ASI బృందం పరిశీలించింది. కానీ ఈ పనికి ఆమోదం లభించకపోవడంతో శనివారం ప్రారంభం కాలేదు. వారం రోజుల్లోగా పనులు పూర్తి చేయాలని కోర్టు ఆదేశించింది. ప్రస్తుతం సంభాల్ జామా మసీదుకు సున్నం వేయడానికి ఆదివారం ఉదయం కార్మికులు వచ్చి బయటి గోడలకు పెయింటింగ్ వేస్తున్నారు. దీని గురించి జామా మసీదు కమిటీ కార్యదర్శి మసూద్ ఫారూకి సమాచారం అందించారు. ఇదే సమయంలో పోలీసులు కూడా అప్రమత్తం అయ్యారు. మళ్లీ గొడవలు జరగకుండా చూసేందుకు ఆయా ప్రాంతాల్లో మోహరించారు. ఈ కేసు తదుపరి విచారణ ఏప్రిల్ 8న జరగనుంది.

## ఇది కదా పోలీసుల పవర్.. నడిరోడ్డుపై గూండాలకు చుక్కలు..



**న్యూఢిల్లీ-నవభూమి:** వజ్రాన్ని వజ్రంతోనే కోయాలి.. ముళ్లును ముళ్లుతోనే తీయాలని కొన్ని సామెతలు ఉన్నాయి. గుజరాత్ పోలీసులు ఈ సామెతల్ని నిజజీవితంలో అచరణలోకి తీసుకువచ్చారు. వాహనదారులపై రెచ్చిపోయిన రౌడీలకు వారి స్టైల్లోనే బుద్ధి చెప్పారు. ఇకపై తప్పు చేయాలంటే భయపడేలా ఆ రౌడీలకు చుక్కలు చూపించారు. నడిరోడ్డుపై వారిని నడిపిస్తూ.. బ్యాకు బద్దలు కొట్టారు. ఇక, ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పోలీసుల చేసిన పనిని సోషల్ మీడియా మొత్తం తెగ పొగిడేస్తోంది. ఇంతకీ ఆ రౌడీలు ఏం చేశారు?.. పోలీసులు లాఠీలకు పని చెప్పాల్సినంత పరిస్థితి ఎందుకు వచ్చింది? ఆ వివరాలు...కత్తులు, కర్రలతో దాడి..గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్ వస్త్రల్ ఏరియాలో గత కొద్ది రోజుల నుంచి రౌడీలు రెచ్చిపోతున్నారు. హెూలీకి ఒకరోజు ముందు మార్చి 13వ తేదీన 20 మంది రౌడీలు రోడ్డుపైకి వచ్చారు. వారి చేతుల్లో కత్తులు, కర్రలు ఉన్నాయి. రోడ్డు మీదకు వచ్చిన ఆ 20 మంది ఓ కారుపై దాడికి దిగారు. కారు ఓనర్‌ను దారుణంగా చితక్కొట్టారు. అంతటితో ఆగకుండా.. రోడ్డుపై వెళుతున్న మరికొన్ని వాహనాలపై కూడా దాడి చేశారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలను ఓ వ్యక్తి వీడియో తీశాడు. ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పోలీసు అధికారుల దృష్టికి కూడా వెళ్లింది. సంఘటనపై అధికారులు సీరియస్ అయ్యారు. దర్యాప్తుకు ఆదేశించారు. పోలీసుల దర్యాప్తులో ఏం తేలిదంటే.. వస్త్రల్ ఏరియాలో ఓ ఫుడ్ స్టాల్ తెరిచే విషయంలో రెండు గ్రూపుల మధ్య గొడవ మొదలైంది. పంకజ్ భవ్‌సార్ అనే వ్యక్తి సంగ్రమ్ సికార్‌వర్‌పై పగ పెంచుకున్నాడు. సంగ్రమ్‌ను ఫుడ్ స్టాల్ ఓపెన్ చేయనీయకుండా అడ్డుకున్నాడు. రౌడీలకు చుక్కలు..వాహనదారులపై కత్తులు, కర్రలతో దాడి చేసిన 20 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. 12 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారికి తమదైన స్టైల్లో బుద్ధి చెప్పారు. 12 మందిని రోడ్డు మీద నడిపించి మరీ కొట్టారు. అది కూడా ఆ రౌడీలు నివసించే ప్రాంతంలో తిప్పుతూ చావకొట్టారు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆ వీడియోపై స్పందిస్తున్న నెటిజన్లు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ' అలాంటి వారికి అలా పోలీస్ స్టైల్‌లో బుద్ధి చెప్పాల్సిందే'..' అన్ని రాష్ట్రాల్లో పోలీసులకు ఇలాంటి మద్ధతు లభిస్తే బాగుంటుంది. సమాజం బాగు పడుతుంది'..' కొనసాగించండి.. పోలీస్ బెల్టులకు పని చెప్పాల్సిందే'.. అంటూ కామెంట్లు పెడుతున్నారు. అయితే, కొంత మంది మాత్రం వడోదరాలో జరిగిన సంఘటనను గుర్తు చేస్తున్నారు. మహిళను యాక్సిడెంట్ చేసి చంపిన వ్యక్తిని ఇంకా ఎందుకు శిక్షించలేదని ప్రశ్నిస్తున్నారు.

## రాజధాని ప్రజలకు గుడ్ న్యూస్.. మూడేళ్లలో కొత్త రికార్డు!

**న్యూఢిల్లీ-నవభూమి:** దేశ రాజధాని ఢిల్లీ ప్రజలకు ఇది నిజంగా గుడ్ న్యూస్ అని చెప్పవచ్చు. ఎందుకంటే గత మూడేళ్లలో తొలిసారి ఢిల్లీలో గాలి నాణ్యత గణనీయంగా మెరుగుపడింది. శనివారం (మార్చి 15న) నమోదైన గాలి నాణ్యత సూచీ85గా నమోదైంది. ఇది జనవరి 1 నుంచి మార్చి 15 మధ్య కాలంలో గత మూడేళ్లలో నమోదైన అత్యల్ప స్థాయి కావడం విశేషం. దీంతో కమిషన్ ఫర్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ 2025లో తొలిసారిగా ఢిల్లీ గాలి నాణ్యత 'సంతృప్తికరమైన' విభాగంలోకి చేరుకుందని ప్రకటించింది. దీనికి ముందు..ఈ విషయాన్ని తమ అధికారిక ట్విట్టర్ ఖాతాలో ఢిల్లీలో సగటు 85గా ఉందని ప్రకటించింది. గత మూడు సంవత్సరాలలో ఇదే అత్యల్ప స్థాయి. ప్రస్తుత సంవత్సరంలో 'సంతృప్తికరమైన' గాలి నాణ్యత నమోదైన మొదటి రోజు ఇది" అని తెలిపింది.

## మండిపోతున్న పసిడి ధర! రానున్న కాలంలో బంగారం ధర తగ్గుతుందా? పెరుగుతుందా?




**న్యూఢిల్లీ-నవభూమి:** బంగారం ధరలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. రానున్న రెండు, మూడు నెలల్లో భారీ సంఖ్యలో పెళ్లిళ్లు జరగనున్నాయి. ఈ క్రమంలో బంగారం ధరలు సామాన్యులను భయపెడుతున్నాయి. ఇంత ధర ఉంటే పెళ్లిళ్ల సమయంలో ఎలా కొనాలంటూ తలలు పట్టుకుంటున్నారు. భారతీయ సంప్రదాయంలో బంగారు ఆభరణాలకు ఉన్న ప్రాముఖ్యత గురించి తెలిసిందే. ముఖ్యంగా పెళ్లిళ్లలో వధూవరులకు బంగారు ఆభరణాలను కచ్చితంగా అలంకరిస్తారు. పెళ్లి కూతురికి అయితే ఎక్కువ మొత్తంగా బంగారు ఆభరణాలు అవసరం. కానీ, ప్రస్తుతం ఉన్న ధరలు చూస్తుంటే.. పెళ్లి పెట్టుకున్న వారి గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. మన దేశంలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.90,000కు మించిపోయింది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్సు బంగారం 3,000 డాలర్లను తాకింది. ఇంత భారీగా పెరిగినా.. త్వరలోనే ధరలు తగ్గుతాయనే ఆశ ఉండేది. కానీ, ప్రస్తుతం ఏమీ చెప్పలేని పరిస్థితి నెలకొంది. ధర ఇప్పట్లో తగ్గదేమో అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పైగా పెళ్లిళ్ల సీజన్ వచ్చేసింది. రోజురోజుకూ ధర పెరగడం చూసి పెళ్లి సంబంధాలు కుదుర్చుకున్న వధూవరుల తల్లితండ్రులు ఆందోళన చెందుతున్నారు. ధర పెరిగి కొనేవాళ్లు కరవయ్యారని, ఆభరణాల వర్తకులు ఆందోళన చెందుతున్నారు. రెండు నెలల క్రితం వరకూ ధర ఇంకా పెరగకపోవచ్చని నిపుణులు అంచనా వేశారు. కానీ డొనాల్డ్ ట్రంప్, అమెరిక అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత టారిఫ్‌లు పెంచడంతో అభివృద్ధి చెందుతున్న దేశాల కరెన్సీలు బలహీనపడ్డాయి. కొన్ని దేశాల్లో ద్రవ్యోల్బణం పెరిగింది. దీంతో ఎంతో భద్రమైన ఆస్తిగా భావించే బంగారానికి డిమాండ్ పెరగడంతో ధర పెరిగింది. 2008లో ప్రపంచ ఆర్థిక సంక్షోభం సందర్భంగా ఔన్సు బంగారం ధర 1,000 డాలర్లకు చేరింది. నాలుగేళ్ల క్రితం కొవిడ్ ముప్పు ముంచుకొచ్చినప్పుడు 2,000 డాలర్లు పలికింది. మళ్లీ ఇప్పుడు 3,000 డాలర్లకు చేరుకుంది. ఆర్థిక సంక్షోభం ముంచుకొచ్చినప్పుడు బంగారం ధర రికార్డు స్థాయికి చేరుతున్నట్లు స్పష్టమవుతోంది. దీనికి తోడు గత కొంతకాలంగా వివిధ దేశాల్లోని కేంద్ర బ్యాంకులు బంగారాన్ని కొని నిల్వ చేస్తున్నాయి. 2022 నుంచి ఏటా 1,000 టన్నులకు పైగా బంగారాన్ని కేంద్ర బ్యాంకులే కొనుగోలు చేశాయి. ఇందులో భారత రిజర్వు బ్యాంకు ముందుంటోంది. చైనాలో రియల్ ఎస్టేట్ రంగం దెబ్బతిని అక్కడి మదుపర్లు ఇటీవల పసిడిని ఎక్కువగా కొంటున్నారు. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్సు బంగారం ధర 3,000 డాలర్ల దగ్గర ఎన్నాళ్లు ఉంటుంది, ఇంకా పెరుగుతుందా, లేక తగ్గుతుందా? అనేది మిలియన్ డాలర్ ప్రశ్నగా మారింది. బులియన్ వర్తకులు, పెట్టుబడి నిపుణులు ఎవరూ దీనికి సమాధానం చెప్పలేకపోతున్నారు. అమెరికా టారిఫ్‌లు, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, ఇతర ప్రతికూల పరిస్థితులు కొనసాగినంత కాలం ధర తగ్గదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. బంగారం ధర భారీగా పెరగడంతో ఆభరణాల వ్యాపారం తగ్గింది. బంగారు ఆభరణాల అమ్మకాలు 70 శాతం తగ్గినట్లు సమాచారం. పాత బంగారం ఇచ్చి కొత్త ఆభరణాలు తీసుకోవడం పెరిగిందని, ఎంతో తప్పనిసరి అయితే తప్పించి కొత్త ఆభరణాలు కొనుగోలు చేయడం తెలుస్తోంది. ప్రస్తుతం అంతర్జాతీయంగా నెలకొన్న పరిస్థితుల కారణంగా బంగారం ధర తగ్గే సూచనలైతే కనిపించడం లేదని నిపుణులు అంటున్నారు.

## లక్కీ భాస్కర్ స్ఫూర్తితో భారీ మోసం



**బెంగళూరు-నవభూమి:** సత్యదేవ్ హీరోగా నటించిన జీబ్రా సినిమాలో హీరో, హీరోయిన్, హీరో ఫ్రెండ్ ముగ్గురు కలిసి కస్టమర్ల బ్యాంకు ఖాతాల్లోంచి తెలివిగా డబ్బు కొట్టేస్తారు. దొరికిపోయే అవకాశం ఉండటంతో ఆ డబ్బుని మళ్లీ కస్టమర్ల ఖాతాల్లోకి పంపించేస్తారు. నేరం బయటపడకుండా తప్పించుకుంటారు. లక్కీ బాస్కర్ సినిమాలో హీరో బ్యాంకులోంచి డబ్బులు కొట్టేసి, అక్రమ వ్యాపారాలు చేస్తుంటాడు. సమయానికి డబ్బుల్ని మళ్లీ బ్యాంకులో జమ చేస్తుంటాడు. సినిమా చివరి వరకు పోలీసులకు దొరకడు. అయితే, నిజ జీవితంలో మాత్రం ఓ బ్యాంకు ఉద్యోగి నేరం చేసి, పోలీసులకు పట్టుబడిపోయింది. ఓ ప్రముఖ బ్యాంకులో డిప్యూటీ మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఆమె ఓ వృద్ధ జంటను మోసం చేసింది. వారి దగ్గరినుంచి పక్కా ప్లాన్ ప్రకారం లక్షల రూపాయల డబ్బులు కొట్టేసింది. తర్వాత పాపం పండి దొరికిపోయింది. ఉద్యోగం పోవటమే కాదు.. జైలు పాలయ్యే పరిస్థితి వచ్చింది.

**పక్కా ప్లాన్‌తో మోసం..**

మేఘన అనే మహిళ బెంగళూరులోని ఓ ప్రముఖ బ్యాంకులో డిప్యూటీ మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తోంది. గిరినగర్‌లో ఆ బ్యాంకు ఉంది. అదే ప్రాంతానికి చెందిన వృద్ధ జంటకు ఆ బ్యాంకులో జాయింట్ అకౌంట్‌తో పాటు, ఎఫ్‌డీ కూడా ఉంది. బ్యాంకు ఖాతా లావాదేవీలకు సంబంధించి మేఘన వృద్ధురాలికి సాయం చేస్తూ ఉండేది. ఆ వృద్ధురాలు తన కుటుంబానికి సంబంధించిన ప్రతీ విషయాన్ని మేఘనకు చెబుతూ ఉండేది. చామరాజపేట్‌లోని తమ ఇల్లు అమ్మబోతున్నట్లు, పెద్ద మొత్తంలో డబ్బు రాబోతున్నట్లు ఆ వృద్ధురాలు చెప్పింది. కొద్దిరోజుల తర్వాత వృద్ధురాలి బ్యాంకు అకౌంట్‌లో కోటి రూపాయలు డిపాజిట్ అయింది. ఆ డబ్బుపై మేఘన కన్నుపడింది. భర్త, స్నేహితులతో కలిసి ఆ డబ్బులో కొంత భాగం కొట్టేయాలని ప్లాన్ చేసింది. ఆ వృద్ధురాలు బ్యాంకుకు వెళ్లినపుడు.. బాండ్స్ ఎక్స్‌పేర్ అయిపోయాయని మేఘన చెప్పింది. కొత్త బాండ్లు కొనడానికి కొన్ని డాక్యుమెంట్లు కావాలని అంది. మరుసటి రోజు వృద్ధురాలి ఇంటికి వెళ్లివారి అకౌంట్‌లోని డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేయానికి అవసరమైన అన్ని డాక్యుమెంట్లను తీసుకుంది. అవసరమైన చోట సంతకాలు పెట్టించుకుంది. ఆ తర్వాత 50 లక్షల రూపాయల్ని వేరే అకౌంట్‌కు పంపుకుంది. ఓ రోజు వృద్ధ దంపతులు అకౌంట్‌లో ఉన్న డబ్బులు చెక్ చేసుకున్నారు. 50 లక్షలు తక్కువగా ఉన్నాయి. ఆ డబ్బులు మొత్తం 13వ తేదీన వేరే అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ అయినట్లు తెలిసింది. దీంతో అనుమానం వచ్చిన వృద్ధురాలు బ్యాంకుకు వెళ్లింది. మేఘనను నిలదీసింది. 'మీరు చెప్పినట్లే డబ్బులు వేరే వాళ్లకు ట్రాన్స్‌ఫర్ చేశా'అంటూ బుకాయించింది. మోసపోయామని గుర్తించిన ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మేఘనను అదుపులోకి తీసుకుని విచారించగా అసలు విషయం బయటపడింది. విలాసాలకు అలవాటు పడ్డ ఆమె ఇలా మోసానికి పాల్పడ్డట్టు తేలింది. లక్కీ బాస్కర్ సినిమా స్ఫూర్తితో డబ్బు కొట్టేసినట్లు మేఘన చెప్పింది. తనకు డబ్బు కొట్టేసే ఉద్దేశం లేదని, వ్యాపారంలో డబ్బులు పెట్టి, మళ్లీ తిరిగి ఇచ్చేదామనుకున్నానని చెప్పింది. పోలీసులు ఆ మొత్తం డబ్బును సీజ్ చేశారు.

## లోయలో పడిన ఐఐటీ విద్యార్థులున్న బస్సు.. పది మందికి గాయాలు



**గ్యాంగ్‌టక్-నవభూమి:** ఐఐటీ విద్యార్థులతో వెళ్తున్న బస్సుపై డ్రైవర్ అదుపుకోల్పోయాడు. దీంతో అది లోయలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో పది మంది గాయపడ్డారు. వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సిక్కింలోని మంగన్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. శనివారం రాత్రి 9.30 గంటల సమయంలో ఐఐటీ ధన్‌బాద్ విద్యార్థులతో వెళ్తున్న బస్సుపై డ్రైవర్ నియంత్రణ కోల్పోయాడు. దారా అటవీ ప్రాంతంలోని పక్షేప్ సమీపంలో ఆ బస్సు ప్రమాదానికి గురైంది. వంద అడుగుల లోతైన లోయలోకి దూసుకెళ్లి బోల్తాపడింది.

కాగా, బస్సు ప్రమాదం గురించి తెలిసిన వెంటనే పోలీసులు, భద్రతా సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సహాయక చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదంలో డ్రైవర్‌తో సహా పది మంది గాయపడినట్లు అధికారులు తెలిపారు. గాయపడిన విద్యార్థుల్లో నలుగురు మహిళలు ఉన్నట్లు చెప్పారు. గాయపడిన వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండటంతో గ్యాంగ్‌టక్‌లోని ఆసుపత్రికి తరలించినట్లు వివరించారు. మిగతా విద్యార్థులకు మంగన్‌లోని హాస్పిటల్‌లో చికిత్స అందించినట్లు వెల్లడించారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో భారీ అగ్నిప్రమాదం.. 200 మంది రోగులను రక్షించిన సిబ్బంది



**భోపాల్-నవభూమి:** ప్రభుత్వ ఆసుపత్రిలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఐసీయూ)లోని ఏసీలో మంటలు చెలరేగాయి. గమనించిన సెక్యూరిటీ గార్డులు, వైద్య సిబ్బంది అప్రమత్తమయ్యారు. ఐసీయూతో పాటు అన్ని వార్డుల్లో ఉన్న సుమారు 200 మంది రోగులను రక్షించారు. మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో ఈ సంఘటన జరిగింది. గజ్రా రాజా మెడికల్ కాలేజీలో భాగమైన కమలా రాజా హాస్పిటల్‌లో ఆదివారం తెల్లవారుజామున 1 గంట సమయంలో అగ్నిప్రమాదం జరిగింది. గైనకాలజీ విభాగంలోని ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఐసీయూ)లోని ఎయిర్ కండిషనర్‌లో మంటలు చెలరేగాయి. కాగా, మంటలు, పొగలు గమనించిన ఆసుపత్రి గార్డులు, సిబ్బంది వెంటనే అప్రమత్తమయ్యారు. కిటికీలు పగులగొట్టి ఐసీయూలోని 13 మంది రోగులను బయటకు తెచ్చారు. అలాగే అన్ని వార్డులతో సహా సుమారు 200 మంది రోగులను సురక్షిత ప్రాంతానికి చేర్చారు. మెడికల్ కాలేజీ క్యాంపస్‌లోని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి వారిని తరలించారు. మరోవైపు ఈ సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది ఆ ఆసుపత్రికి చేరుకున్నారు. మంటలను ఆర్పివేశారు. అగ్నిప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరుగలేదని అధికారులు తెలిపారు. ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

## తేజ్ ప్రతాప్ ఆదేశంతో డాన్స్ చేసిన పోలీసుపై చర్యలు




**పాట్నా-నవభూమి:** ఆర్జేడీ ఎమ్మెల్యే తేజ్ ప్రతాప్‌కు సెక్యూరిటీ గార్డ్‌గా ఉన్న కానిస్టేబుల్ దీపక్‌కుమార్‌పై పోలీస్ శాఖ చర్యలు తీసుకుంది. అతనిని సెక్యూరిటీ బాధ్యతల నుంచి తప్పించి పోలీస్ లైన్స్‌కు అటాచ్ చేసింది. తక్షణం ఈ ఆదేశాలు అమల్లోకి వచ్చినట్టు సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. పోలీసు యూనిఫాంలో ఉంటూ డాన్స్ చేసినందుకు ఆయనను పోలీస్ లైన్స్‌కు పంపామని, కుమార్ స్థానంలో ఎమ్మెల్యే సెక్యూరిటీకి మరొకరిని నియమిస్తారని ఆ ప్రకటన పేర్కొంది.

తేజ్ ప్రతాప్ హుకుం..తేజ్ ప్రతాప్ తన నివాసంలో శనివారంనాడు హెూలీ వేడుకలు నిర్వహించారు. లాలూ ప్రసాద్ యాదవ్, రబ్రీదేవి సైతం ఈ వేడుకలో పాల్గొన్నారు. వేదికపై కూర్చున్న తేజ్ ప్రతాప్ మైక్ పట్టుకుని కానిస్టేబుల్ దీపక్‌కుమార్‌ను డాన్స్ చేయాల్సిందిగా ఆదేశించారు. లేదంటే సస్పెండ్ అవుతావంటూ బెదిరించారు. దీంతో కొద్ది క్షణాలు కానిస్టేబుల్ తన కుడి చేతిని గాలిలో ఆడిస్తూ డాన్స్ చేశారు. ఇందుకు సంబంధించిన వీడియో వైరల్ కావడంతో ఆయనను సెక్యూరిటీ భాద్యతల నుంచి శాఖ తప్పిస్తూ పోలీసు శాఖ తాజా ఆదేశాలిచ్చింది.

**స్కూటర్ యజమానికి ఫైన్**

హెూలీ వేడుకల్లో భాగంగా తేజ్ ప్రతాప్ తమ సమీప ప్రాంతాల్లో స్కూటరుపై తిరిగారు. దీంతో స్కూటర్ యజమానిపై పోలీసులు చర్యలకు దిగారు. హెల్మెట్ లేకుండా స్కూటర్ డ్రైవ్ చేయడం, పొల్యూషన్ సర్టిఫికెట్, బీమా లేకపోవడంతో రూ.4,000 చలానా విధించినట్టు పాట్నా ఎస్పీ (ట్రాఫిక్) అపరాజిత్ లోహన్ తెలిపారు.

## తోడల్లుడిపై కారు ఎక్కించి చంపిన వ్యక్తి.. కారణం తెలిస్తే షాక్ అవుతారు..



**న్యూఢిల్లీ-నవభూమి:** హెూలీ పండుగ వేల ఓ కుటుంబంలో దారుణమైన సంఘటన చోటుచేసుకుంది. ఓ వ్యక్తి తన తోడల్లుడిని కారు ఎక్కించి మరీ చంపేశాడు. అనంతరం అక్కడినుంచి పారిపోయాడు. ఈ సంఘటన బీహార్‌లోని ససరామ్ జిల్లాలో ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల్లోకి వెళితే.. చవారియా గ్రామానికి చెందిన ధర్మేంద్ర కుమార్, మోతీవారి గ్రామానికి చెందిన సుభాష్ సింగ్.. కురుప్ గ్రామానికి చెందిన అక్కాచెల్లెళ్లను పెళ్లి చేసుకున్నారు. ధర్మేంద్ర, సుభాష్‌లు హెూలీ పండుగ జరుపుకోవడానికి అత్తింటికి వచ్చారు. అక్కడ అత్తింటికి సంబంధించిన ఆస్తి విషయంలో ఇద్దరికీ గొడవ జరిగింది. ఆ గొడవ చినికి, చినికి గాలి వానలా మారింది. కొట్టుకునే వరకు వెళ్లారు. ఈ నేపథ్యంలోనే ధర్మేంద్ర కుమార్, సుభాష్‌పై పగ పెంచుకున్నాడు.

ఎలాగైనా అతడ్ని చంపేసి అత్తింటి ఆస్తిని తన సొంతం చేసుకోవాలని భావించాడు. ఇందుకోసం ఓ పక్కా ప్లాన్ వేశాడు. ధర్మేంద్ర తన కారులో అత్తింటికి 200 మీటర్ల దూరంలో సిద్ధంగా ఉన్నాడు. సుభాష్ రాక కోసం ఎదురు చూస్తూ ఉన్నాడు. కొద్ది సేపటి తర్వాత సుభాష్ బైకు మీద బయటకు వచ్చాడు. అది గమనించిన ధర్మేంద్ర కారుతో బైకును ఢీకొట్టాడు. సుభాష్ బైకుతో సహా కిందపడ్డాడు. ఆ వెంటనే ధర్మేంద్ర తన కారును సుభాష్ పైకి ఎక్కించాడు. దీంతో అతడు అక్కడికక్కడే చనిపోయాడు. సుభాష్ చనిపోగానే ధర్మేంద్ర కారును వదిలేసి అక్కడినుంచి పరారయ్యాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు, గ్రామస్తులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కొద్దిసేపటికి పోలీసులకు సమాచారం అందింది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృత దేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. బైకు, కారును సీజ్ చేశారు. పరారీలో ఉన్న ధర్మేంద్ర కోసం గాలిస్తున్నారు. ఇక, ఈ సంఘటనతో చుట్టు పక్కల గ్రామాల్లో అలజడి మొదలైంది. సుభాష్ కుటుంబం శోక సంద్రంలో మునిగిపోయింది.

## పద్మ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం




**న్యూఢిల్లీ-నవభూమి:** వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చిన వారికి ప్రధానం చేసే దేశంలోనే అత్యున్నత పురస్కారం 'పద్మ' అవార్డ్స్ కోసం కేంద్ర ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానించింది. గణతంత్ర వేడుకల సందర్భంగా ప్రకటించే 2026 సంవత్సరానికి సంబంధించిన పద్మ అవార్డుల కోసం నామినేషన్ల ప్రక్రియ ప్రారంభించింది. ఆసక్తి ఉన్నవారు జులై 31లోగా పద్మ అవార్డులకు సంబంధించిన నామినేషన్లు, సిఫార్సులు రాష్ట్రీయ పురస్కార్ పోర్టల్ https://awards.gov.inలో అప్‌లోడ్ చేయాలని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. దేశంలోని రెండు అత్యున్నత పౌరపురస్కారాలైన భారతరత్న, పద్మ అవార్డులను కేంద్ర ప్రభుత్వం 1954లో ప్రారంభించింది. భారత్‌తో పాటు వివిధ దేశాలకు చెందిన వారికి సైతం అవార్డులను కేంద్రం ప్రకటిస్తుంది. వివిధ రంగాల్ల ప్రతిష్ఠాత్మక, అసాధారణ సేవలు అందించినందుకు అవార్డులతో సత్కరిస్తుంది. ఈ అవార్డులను ఏటా గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రకటిస్తుండగా.. మార్చి, ఏప్రిల్‌లో రాష్ట్రపతి చేతుల మీదుగా అందజేస్తారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
12 హైదరాబాద్ సోమవారం 17 । మార్చి । 2025

## ఆకతాయికి దమ్కీ ఇచ్చిన అనసూయ.. ప్యాంట్ తడిసిపోతుందా అంటూ సైగ



అందాల అనసూయ చాలా డేరింగ్ అండ్ డ్యాషింగ్ పర్సన్. యాంకర్ నుండి నటిగా మారిన ఈ ముద్దుగుమ్మ ఇప్పుడు ఇండస్ట్రీలో మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించింది. కొందరు దర్శకులు ఆమె కోసమే కథలు రాస్తున్నారంటే అనసూయ క్రేజ్ ఏ స్థాయికి వెళ్లిందో అర్థం చేసుకోచ్చు. ఇక అనసూయ వివాదాలతో కూడా ఎక్కువగా వార్తలలో నిలుస్తూ ఉంటుంది. విజయ్ దేవరకొండ ఫ్యాన్స్‌తో ఢీ అంటే ఢీ అంటూ కొన్నాళ్ల పాటు ఫైట్ చేసింది. ఇదే కాకుండా పలు సందర్భాలలో నెటిజన్స్ తనని ట్రోల్ చేయడంపై కూడా అనసూయ ఫైర్ అయింది. వారికి గట్టిగా బుద్ది చెప్పింది. ఇక ఇదిలా ఉంటే శుక్రవారం (మార్చి 14) దేశవ్యాప్తంగా హెూలీ సంబరాలు ఘనంగా జరిగాయి. సామాన్యులతో పాటు సెలబ్రిటీలు ఈ వేడుకని ఎంతో సంతోషంగా జరుపుకున్నారు. పలువురు సెలబ్రిటీలు ఈవెంట్స్‌కి వెళ్లి అభిమానులతో కలిసి ఎంజాయ్ చేశారు. ఈ క్రమంలోనే అనసూయ కూడా ఓ హెూలీ ఈవెంట్‌కి వెళ్లింది. అక్కడ ఓ ఆకతాయి అనసూయను ఆంటీ అని పిలిచాడు. అంతే.. ఆ మాట విన్న అనసూయకు చిర్రెత్తిపోయింది. అందరి ముందే ఆ ఆకతాయికి స్ట్రాంగ్ వార్నింగ్ వచ్చింది. దమ్ముంటే స్టేజీపైకి రా ..నన్ను రెచ్చగొడితే ఎలా ఉంటుందో నీకు చూపిస్తా రా అంటూ ధమ్కీ ఇచ్చింది. అయితే అతడు రాకపోవడంతో ఏంటీ భయంతో ప్యాంటు తడిసిపోతుందా? అయితే వాష్‌రూమ్‌కు వెళ్లు అన్నట్లుగా సైగ చేసింది.





## షూటింగ్‌కు లేట్‌గా వెళ్లానని.. ఈ సినిమాకు నీతో పనిలేదు వెళ్లిపో అన్నారు: నయనతార

ఈ సినిమాకు నీతో పనిలేదు.. వెళ్లిపోనయనతారని అభిమానులు 'లేడీ సూపర్‌స్టార్' అని ప్రేమతో పిలుచుకుంటూ ఉంటారు. నిజానికి శిఖరాగ్రాన ఉంటే కానీ 'సూపర్‌స్టార్' బిరుదు నటులకు రాదు. మరి ఆ బిరుదు నయన్‌ని వరించిందంటే.. తను అగ్రస్థానంలో ఉన్నట్టేకదా. దానికి తగ్గట్టే పారితోషికం విషయంలోనూ తోటి హీరోయిన్లకంటే ఎక్కువే డిమాండ్ చేస్తున్నారు నయనతార. ఇప్పుడిదంతా దేనికి? అంటే.. అంతటి స్టార్‌డమ్ ఉన్న నయనతార కెరీర్.. భయంకరమైన అవమానంతో మొదలయ్యిందట. ఆ విషయాన్ని తానే స్వయంగా ఓ ఇంటర్వ్యూలో తెలిపింది. 'హీరో పార్థిబన్ డైరెక్ట్ చేస్తున్న సినిమాతో నేను హీరోయిన్‌గా పరిచయం కావాల్సింది. ఆడిషన్ చేసి మరీ ఆయన నన్ను కథానాయికగా తీసుకున్నారు. అయితే.. కొన్ని వ్యక్తిగత కారణాల వల్ల టైమ్‌కి లొకేషన్‌లో ఉండలేకపోయాను. తొలిరోజే లేట్‌గా రావడంతో 'ఈ సినిమాకు నీతో పనిలేదు.. వెళ్లిపో..' అని ముఖంమీదే అనేశారు పార్థిబన్.అందరిముందూ ఆయన అలా అనడంతో మనసు చివుక్కుమంది. క్షమించమని అడిగే ధైర్యం కూడా చేయలేకపోయా. తల దించుకొని వెనక్కి వెళ్లిపోయా.' అంటూ గత చేదు జ్ఞాపకాన్ని గుర్తు చేసుకున్నారు నయనతార. ఆ తర్వాత హరి దర్శకత్వంలో శరత్‌కుమార్ హీరోగా రూపొందిన 'అయ్యా' చిత్రం ద్వారా నయన్ తమిళతెరకు పరిచయం అయిన సంగతి తెలిసిందే.

## సినిమా విషయంలో నాని నమ్మే రెండు విషయాలు



నాని హీరోగా వాల్‌పోస్టర్ సినిమాస్ బ్యానర్ లో రూపొందిన మూవీ కోర్టు. ప్రియదర్శి ప్రధాన పాత్రలో వచ్చిన ఈ సినిమాతో రామ్ జగదీష్ డైరెక్టర్ గా ఇండస్ట్రీకి పరిచయమయ్యాడు. మార్చి 14న రిలీజైన ఈ సినిమా మంచి మౌత్ టాక్ తెచ్చుకుని ప్రేక్షకులతో పాటూ విమర్శకుల నుంచి కూడా ప్రశంసలు అందుకుంటుంది. ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ సెలబ్రేషన్ ఆఫ్ ఆడియన్స్ వెర్డిక్ట్ పేరుతో సక్సెస్ మీట్‌ను నిర్వహించి తమ ఆనందాన్ని తెలిపారు. తాను ఇప్పటివరకు స్క్రిప్ట్, ఆడియన్స్ అనే రెండు విషయాలనే నమ్మానని, స్క్రిప్ట్ తన టీమ్ ను గెలిపిస్తే, తెలుగు ఆడియన్స్ సినిమాను గెలిపించారని, కోర్టు సినిమా తనను గెలిపించిందని నేచురల్ స్టార్ నాని అన్నారు. కోర్టు టీమ్ అందరినీ చూస్తుంటే చాలా గర్వంగా ఉంది. రానున్న రోజుల్లో కోర్టు పేరు మరింత వినపడుతుందని, సినిమాకు పని చేసిన ప్రతీ ఒక్కరికీ థ్యాంక్స్ అన్నారు. ఇక కీలక పాత్రలో నటించిన ప్రియదర్శి మాట్లాడుతూ బలగం లాంటి హిట్ అందుకున్న తర్వాత ఏ సినిమా చేయాలా అని ఆలోచిస్తున్న టైమ్ లో డైరెక్టర్ రామ్ జగదీష్ తనకు ఈ కథ చెప్పాడని, ఈ కథను నాని నమ్మకపోయుంటే ఇంత దూరం వచ్చేది కాదని, తనకి, తమ సినిమాకు సపోర్ట్ చేసిన ప్రతీ ఒక్కరికీ థ్యాంక్స్ చెప్పిన ఆయన తెలుగు ఆడియన్స్ జాతిరత్నాలు అన్నారు. కోర్టు మూవీ రిలీజయ్యాక అందరికంటే ఎక్కువ క్రెడిట్ కొట్టేసిన శివాజీ 25 ఏళ్లుగా మంగపతి లాంటి క్యారెక్టర్ కోసం ఎదురుచూశానని, ప్రతీ ఆర్టిస్ట్‌కు ఒక కల ఉంటుందని, ఒక రోజంతా మన గురించే మాట్లాడుకోవాలనుకుంటారని, ఆ కల కోర్టు మూవీతో తీరిందన్నారు. టాలీవుడ్ ఇండస్ట్రీకి నాని, మరో సూపర్ స్టార్ కృష్ణ అని, నాని కూడా కృష్ణ గారిలానే కొత్తగా ఆలోచిస్తూ మంచి కంటెంట్ ను ప్రోత్సహిస్తాడని అన్నారు. కోర్టు సినిమాను ఆదరిస్తున్న ఆడియన్స్ కు ధన్యవాదాలని, సినిమా జిందాబాద్... ప్రొడ్యూసర్ జిందాబాద్ అన్నారు. కోర్టు సినిమా విషయంలో చాలా గర్వంగా ఫీలవుతున్నట్టు డైరెక్టర్ రామ్ జగదీష్ తెలిపారు. సినిమాకు చాలా పవర్ ఉందని, సినిమా లైఫ్ నే మార్చేస్తుందని, తను నాని గారి ప్రొడక్ట్ అని చెప్పడం ఎంతో ప్రౌడ్ గా ఉందన్నారు. ప్రియదర్శికి స్పెషల్ థ్యాంక్స్ చెప్పిన రామ్ జగదీష్, మంగపతి పాత్రలో శివాజీని తప్ప మరొకరిని ఊహించలేనన్నారు. అన్ని చోట్ల నుంచి కోర్టు సినిమాకు మంచి రెస్పాన్స్ వస్తోందని, రామ్ జగదీష్ అద్భుతమైన రైటింగ్ తో మంచి కథ చెప్పారని రోహిణి చెప్పారు. అనిల్ రాసిన మాస్టర్ స్క్రీన్ ప్లే కు చాలా చోట్ల చప్పట్లు కొట్టారని, నాని మంచి టాలెంట్ ను ఇండస్ట్రీకి తీసుకొస్తున్నారని, మంచి సినిమా వస్తే ఆడియన్స్ దాన్ని బాగా రిసీవ్ చేసుకుంటారని చెప్పడానికి కోర్టు సినిమా నిదర్శనమని ఆమె అన్నారు. కోర్టు సినిమా ఇంత మంచి అవుట్‌పుట్ రావడానికి కారణం నాని గారి జడ్జిమెంటే కారణమన్నారు హర్ష వర్ధన్. ఈ సక్సెస్‌మీట్ లో అందరికీ క్రెడిట్ ఇవ్వడం ఆనందంగా ఉందని, నాని ఈ సినిమాను ఎంతో నమ్మారని, మంచి స్టార్ అవడమే కాదు, స్టార్ మేకర్ కూడా అయ్యారని, గట్స్ ఉంటేనే ఇలాంటి సినిమాలు తీయగలమని ఆయన అన్నారు. ఇక సినిమాలో ప్రధాన పాత్రలో నటించిన శ్రీదేవి మాట్లాడుతూ, తన సినిమాను ప్రేక్షకులతో కలిసి చూడటం ఒక కల అని, ఆ కల కోర్టుతో తీరిందని, చిత్ర యూనిట్ మొత్తానికి థ్యాంక్స్ చెప్తూ ప్రతి ఒక్కరూ కోర్టుని థియేటర్లలో చూడమని కోరింది. రోషన్ మాట్లాడుతూ కోర్టు సక్సెస్ చాలా గొప్ప అనుభూతినిచ్చిందని, డైరెక్టర్ జగదీష్ అన్నకి చాలా పెద్ద థ్యాంక్స్ అన్నాడు. తనను తను నమ్మే దానికంటే జగదీష్ అన్న ఎక్కువగా నమ్మాడని చెప్పాడు. ఇంత మంది ఛాన్స్ ఇచ్చినందుకు నాని అన్న లవ్ యూ అని చెప్పాడు.కోర్టు గురించి నాని సోదరి దీప్తి మాట్లాడుతూ డైరెక్టర్ జగదీష్ సినిమా పిచ్చోడని, సినిమా గురించి తప్ప మరో విషయం మాట్లాడడని, ఈ సినిమాకు ఊహించిన దానికంటే ఎక్కువ రెస్పాన్స్ రావడం ఎంతో ఆనందాన్నిస్తుందని తెలిపింది. ఈ ఈవెంట్ లో శ్రీదేవి, రోషన్ ప్రేమలో సాంగ్ కు సంతోషంగా డ్యాన్స్ వేయగా, వారితో పాటూ ఆ ఆనందాన్ని షేర్ చేసుకుంటూ నాని, ప్రియదర్శి కూడా ఆ హిట్ సాంగ్ కు డ్యాన్స్ వేశారు. ప్రస్తుతం దానికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతుంది.

## హాస్పిటల్ బెడ్‌పై సెలైన్ బాటిల్‌త్తో ఉన్న ఫొటో షేర్ చేసిన సమంత



అగ్రకథానాయిక సమంత పోస్ట్ చేసిన తాజా ఫొటోలు ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్నాయి. పలు చిత్రాల్లో నటిస్తూనే.. నిర్మాణ రంగంలోకి అడుగుపెట్టిన సామ్ ట్రలాలా పేరుతో ప్రొడక్షన్ హౌజ్‌ను ప్రారంభించింది. ఈ బ్యానర్‌పై తెరకెక్కించిన తొలి చిత్రం 'శుభం'చిత్రీకరణ పూర్తి చేసుకుంది. త్వరలో విడుదలకు సిద్ధమవుతున్నది. ఈ విషయాన్ని తెలియజేస్తూ కొన్ని ఫొటోలను షేర్ చేసింది. అందులో సామ్ హాస్పిటల్ బెడ్‌పై సెలైన్ ఎక్కించుకుంటున్న ఫోటో కూడా ఉంది. ఈ ఫొటో ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది. ఇది చూసిన నెటిజన్లు, అభిమానులు సమంతకు ఏమైంది అంటూ ఆందోళన చెందుతున్నారు.విజయ్ దేవరకొండతో చివరగా ఖుషి సినిమాలో నటించింది సమంత. ఈ సినిమా తర్వాత తెలుగులో మళ్లీ కొత్త ప్రాజెక్టు ప్రకటించలేదు. వరుణ్ ధావన్‌తో కలిసి 'సిటాడెల్ : హనీ బన్నీ' వెబ్‌సిరీస్‌లో మెరిసిన సమంత.. ప్రస్తుతం రాజ్ అండ్ డీకే తెరకెక్కిస్తున్న వెబ్ సిరీస్ 'రక్త్ బ్రహ్మాండ్' షూట్‌లో జాయిన్ అయింది.

## ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయిన ఏఆర్ రెహమాన్



ఆస్కార్ అవార్డు విజేత, దిగ్గజ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ అస్వస్థతకు గురయిన విషయం తెలిసిందే. ఆదివారం ఉదయం లండన్ నుంచి ఇండియాకు వచ్చిన ఆయన ఛాతీ నొప్పితో ఇబ్బందిపడ్డట్లు వార్తలు వచ్చాయి. దీంతో ఆ వార్తలను ఆయన కుటుంబసభ్యులు ఖండించారు. రెహమాన్‌కి డీహైడ్రేషన్, మెడ నొప్పి వలన ఆస్పత్రికి వెళ్లారని స్పష్టం చేసింది. రంజాన్ మాసం కారణంగా ఉపవాసం ఉండడంతో డీహైడ్రేషన్ గురయినట్లు సమాచారం.వైద్యులు అతడికి జరిపిన పరీక్షల్లో అన్నీ సాధారణంగా ఉన్నట్లు తేలడంతో, రెహమాన్ ఆరోగ్యం స్థిరంగా ఉందని వైద్యులు తెలిపారు. దీంతో అతడిని ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేశామంటూ వైద్యులు వెల్లడించారు. మరోవైపు రెహమాన్ ఆరోగ్యంపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ స్పందిస్తూ.. రెహమాన్ త్వరగా కోలుకోవాలని ప్రార్థించాడు.

## రెచ్చిపోయిన దొంగలు.. నటుడు విశ్వక్ సేన్ ఇంట్లో భారీ చోరీ.!



టాలీవుడ్ హీరో విశ్వక్ సేన్ ఇంట్లో ఆదివారం తెల్లవారు జామున భారీ దొంగతనం జరిగింది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వార్తలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఫిలింనగర్ రోడ్డు నెంబర్ 8లోని విశ్వక్ నివాసంలో ఈ ఘటన చోటుచేసుకోగా.. విశ్వక్ సేన్ తండ్రి కరాటే రాజు ఈ చోరీ గురించి ఫిలింనగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం.విశ్వక్ కుటుంబమంతా ఒకే ఇంట్లో నివాసముంటుండగా.. విశ్వక్ సేన్ సోదరి వన్మయి బెడ్ రూమ్ మూడో అంతస్తులో ఉంటుంది. ఆదివారం తెల్లవారుజామున తన గదిలో వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉండడం గమనించిన వన్మయి అనుమానం వచ్చి, అల్మారాలను తనిఖీ చేయగా అందులో ఉన్న బంగారం చోరీకి గురయినట్లు తెలిసింది. దీంతో వెంటనే ఈ విషయాన్ని తన తండ్రికి చెప్పగా, కరాటే రాజు పోలీసులకు సమాచారం అందించారు.ఇక కరాటే రాజు నుంచి ఫిర్యాదును అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్లూస్ టీం సహాయంతో వేలిముద్రలను సేకరించారు. అలాగే ఇంటి చుట్టుపక్కల ఉన్న సీసీటీవీ కెమెరాల ఫుటేజీని పరిశీలించారు. తెల్లవారుజామున 5:50 గంటల సమయంలో ఒక గుర్తు తెలియని వ్యక్తి బైక్‌పై వచ్చినట్టు కెమెరాల్లో రికార్డు అయింది. ఆ వ్యక్తి గేటు తెరిచి, నేరుగా మూడో అంతస్తుకు చేరుకుని, వెనుక ద్వారం గుండా వన్మయి బెడ్‌రూంలోకి ప్రవేశించినట్టు పోలీసులు గుర్తించారు. అక్కడ అల్మారాలో నుంచి బంగారు ఆభరణాలను దొంగిలించినట్టు తెలుస్తోంది. సీసీటీవీ ఫుటేజీ ప్రకారం, ఆ దొంగ కేవలం 20 నిమిషాల్లోనే చోరీ పూర్తి చేసి, అక్కడి నుంచి పరారైనట్టు పోలీసులు నిర్ధారించారు. చోరీలో రెండు డైమండ్ రింగులు సహా రూ.2.20 లక్షల విలువైన ఆభరణాలు మాయమైనట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు.

## నాకిష్టమైన ఛోలే భటురే గురించి చర్చ ఎందుకు? బ్రాడ్‌కాస్టర్లపై విరాట్ ఆగ్రహం..!





**బెంగళూరు-నవభూమి:** టీమిండియా సీనియర్ ప్లేయర్ విరాట్ కోహ్లీ బ్రాడ్‌కాస్టర్లపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. బ్రాడ్‌కాస్టర్లపై క్రికెట్ గురించి చర్చించడమని.. తనకు ఇష్టమైన ఛోలే భటురే గురించి చర్చించాల్సిన అవసరం లేదని వ్యాఖ్యానించాడు. ఓ కార్యక్రమంలో విరాట్ కోహ్లీ మాట్లాడాడు. విరాట్ ఐపీఎల్‌లో పాల్గొనేందుకు బెంగళూరుకు వచ్చి ఆర్‌సీబీతో చేరాడు. విరాట్ అండర్-19 నుంచి వార్తల్లో వ్యక్తిగా నిలుస్తూ వస్తున్నాడు. గత పదిహేనేళ్లుగా భారత జట్టులో కీలక సభ్యుడిగా కొనసాగుతున్నాడు. కోహ్లీ ఆటతో పాటు ఫిట్‌నెస్‌పై దృష్టి పెడుతుంటాడు.ఇదిలా ఉండగా.. మ్యాచులు జరుగుతున్న సమయంలో బ్రాడ్‌కాస్టర్స్ కోహ్లీ తీసుకునే ఆహారం గురించి చర్చించడం చాలాసార్లు కనిపించింది. చాలా రోజుల తర్వాత ఈ ఏడాది ఢిల్లీ తరఫున రంజీ మ్యాచ్ ఆడిన విషయం తెలిసిందే. మ్యాచ్ సమయంలో కోహ్లీ చిల్లీ పనీర్ ఆర్డర్ చేశాడు. ఇందుకు సంబంధించిన చిత్రాలు సైతం ఆ సమయంలో సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. బ్రాడ్‌కాస్టర్స్ క్రికెట్‌పై మరింత కవరేజీ అవసరమని.. ఇష్టమైన విషయాల గురించి కాదని కోహ్లీ సూచించాడు. భారత్‌ను క్రీడల్లో అగ్రగామిగా మార్చేందుకు కృషి చేస్తున్నామని.. ఈ విషయంలో తమకు ఓ విజన్ ఉందని తెలిపాడు. ప్రస్తుతం క్షేత్రస్థాయిలో పని చేస్తున్నామని.. ఇందులో భాగస్వాములైన ప్రజలందరికీ సమష్టి బాధ్యత ఉండాలని చెప్పాడు. ఇది కేవలం మౌలిక సదుపాయాలు, డబ్బు పెట్టుబడి పెట్టే వ్యక్తుల గురించి మాత్రమే కాదన్నాడు.

## ముంబై మహాన్.. రెండో సారి డబ్ల్యూపీఎల్ టైటిల్ కైవసం



**ముంబై-నవభూమి:** ఇండియన్స్ మళ్లీ మెరిసింది! మహిళల ప్రీమియర్ లీగ్‌లో రెండో టైటిల్‌ను ఖాతాలో వేసుకుని తమకు తిరుగులేదని నిరూపించింది. సమిష్టి ప్రదర్శనతో సత్తాచాటుతూ ఆఖరి వరకు ఆసక్తికరంగా సాగిన ఫైనల్లో ఢిల్లీ క్యాపిటల్స్‌పై అద్భుత విజయం సాధించింది. సహచర బ్యాటర్లు విఫలమైన చోట కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడుతూ హర్మన్‌ప్రీత్‌కౌర్ అర్ధసెంచరీతో చెలరేగగా ముంబై పోరాడే స్కోరు అందుకుంది. లక్ష్యఛేదనలో ముంబై బౌలర్ల ధాటికి వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయిన ఢిల్లీ వరుసగా మూడోసారి టైటిల్ చేజార్చుకుని రన్నరప్‌తో సరిపెట్టుకుంది. కాప్, రోడ్రిగ్స్ పోరాడినా ఫలితం లేకపోయింది. మూడు సీజన్లలో రెండోసారి టైటిల్ విజేతగా నిలిచిన ముంబై సంబురాల్లో మునిగిపోయింది.ముంబై: డబ్ల్యూపీఎల్ మూడో సీజన్‌లో ముంబై ఇండియన్స్ టైటిల్ విజేతగా నిలిచింది. ఆదివారం బ్రబౌర్న్ స్టేడియం వేదికగా కడదాకా ఉత్కంఠ రేపిన మ్యాచ్‌లో ముంబై 8 పరుగుల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్‌పై చిరస్మరణీయ విజయాన్ని సొంతం చేసుకుంది. తొలుత టాస్ గెలిచిన ఢిల్లీ..ముంబైని బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్‌కౌర్(44 బంతుల్లో 66, 9ఫోర్లు, 2సిక్స్‌లు), నాట్‌సీవర్ బ్రంట్(30) రాణించడంతో ముంబై నిర్ణీత 20 ఓవర్లలో 149/7 స్కోరు చేసింది. 14 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయిన ముంబైని కౌర్ కెప్టెన్ ఇన్నింగ్స్‌తో ఆదుకుంది. కాప్(2/11), జొనాసెన్(2/26), చరణి(2/43) రెండేసి వికెట్లు తీశారు.

## ఆస్ట్రేలియన్ గ్రాండ్ ప్రిక్స్‌లో సంచలనం



**ముంబై-నవభూమి:** ఫార్ములా 1 రేసింగ్ అనగానే ఈ తరం వారికి రెండే పేర్లే గుర్తుకొస్తాయి. అదే లూయిస్ హామిల్టన్, మ్యాక్స్ వెర్‌స్టాపెన్. గత దశాబ్ద కాలం రేసింగ్‌లో ఈ ఇద్దరిదే హవా నడిచింది. 2014 నుంచి 2020 వరకు వరుసగా 7 సార్లు చాంపియన్‌గా నిలిచాడు హామిల్టన్. అయితే 2021లో రివ్వున దూసుకొచ్చిన వెర్‌స్టాపెన్ వరుసగా తిరుగులేని విజయాలతో నంబర్ వన్ రేసర్‌గా రుబాబు చూపిస్తూ వచ్చాడు. నాలుగేళ్ల పాటు అతడి జోరు కొనసాగింది. అయితే ఈసారి వీళ్లిద్దర్నీ కాదని.. మరో రేసర్ కప్పు ఎగరేసుకుపోయాడు. అతడు ఎవరు.. ఎలా గెలిచాడు.. తదితర వివరాలు ఇప్పుడు చూద్దాం..టెన్షన్ టెన్షన్..ఆస్ట్రేలియా గ్రాండ్ ప్రిక్స్‌లో సంచలనం నమోదైంది. చాంపియన్ రేసర్ వెర్‌స్టాపెన్‌కు బిగ్ షాక్ తగిలింది. ఎవరూ ఊహించని రీతిలో మెక్‌లారెన్ రేసర్ లాండో నోరిస్ ట్రోఫీ గెలుచుకున్నాడు. కెరీర్‌లో ఫస్ట్ టైమ్ మెల్‌బోర్న్‌లో గెలుపు బావుటా ఎరగేశాడు నోరిస్. ఓవరాల్‌గా అతడి రేసింగ్ కెరీర్‌లో ఇది ఐదో ట్రోఫీ కావడం విశేషం. దీనిపై అతడు రియాక్ట్ అయ్యాడు. 'ఈ రేస్ అద్భుతంగా సాగింది. వెర్‌స్టాపెన్ నా వెనకాలే ఉన్నాడు. అతడితో పోటీ రసవత్తరంగా నడిచింది. అయితే ఆఖరి 2 ల్యాప్స్‌లో నేను మరింత వేగం పెంచి దూసుకెళ్లాను. ఆ టైమ్‌లో చాలా ఒత్తిడిగా అనిపించింది. మొత్తానికి టాప్‌లో ఫినిష్ చేయడం సంతోషాన్నించింది' అని నోరిస్ చెప్పుకొచ్చాడు. కాగా, ఫెరారీ తరపున బరిలోకి దిగిన లూయిస్ హామిల్టన్ 10వ స్థానానికి పరిమితం అయ్యాడు.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**